అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 06-04-2025

సంపుటి : 11 సంచిక : 95

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



ముస్లింల తర్వాత వంతు క్రైస్తవులదే

రాహుల్ విమర్శల నేపథ్యంలో వ్యాసాన్ని తొలగించిన ఆర్గనైజర్

న్యూఢిల్లీ : కేథలిక్ చర్చిలు, వక్ఫ్ బోర్డుల ఆధీనంలో వున్న స్థలాలను పోలుస్తూ వచ్చిన ఒక వ్యాసాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం వున్న ఆంగ్ల పత్రిక ఆర్గనైజర్ ఇటీవల తొలగించింది. ముస్లింల తర్వాత వంతు ఇక క్రైస్తవులదేనని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ వ్యాసం తొలగింపు చోటు చేసుకుంది. వక్ఫ్ ఆస్తుల క్రమబద్ధీకరణకు సంబంధించి గణనీయమైన మార్పులను ప్రతిపాదిస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును మొత్తానికి మోడీ ప్రభుత్వం ఆమోదింపచేసుకున్న సమయంలో ఈ పరిణామం చోటు ...6లో



ఢిల్లీ పోలీస్ కమిషనర్ వాంగ్మూలం నమోదు

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల కేసులో రెండు గంటల పాటు విచారించిన దర్యాప్తు కమిటీ

ఇప్పటికే పలువురి స్టేట్‌మెంట్లు రికార్డు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయవాది జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంలో దర్యాప్తు కమిటీ పలువురిని విచారిస్తోంది. ఇందులో భాగంగా ముగ్గురు జడ్జిల కమిటీ ముందు ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా హాజరయ్యారు. ఆయనను కమిటీ రెండు గంటల పాటు విచారించింది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. అలాగే, న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ...13లో




పోరాటం పదునెక్కుతోంది

ప్రజలు కదులుతున్నారు : బీవీ రాఘవులు

సీతారాంఏచూరి నగర్ (మదురై)నుంచి నవతెలంగాణ ప్రతినిధి

దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వివిధ సమస్యలపై పోరాటాలు జరుగుతున్నాయని, ప్రజలు పెద్దఎత్తున ఈ పోరాటాల్లో పాల్గొంటున్నారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. సీపీఐ(ఎం) 24వ అఖిలభారత మహాసభ నాల్గవరోజైన శనివారం సీతారాం ఏచూరి నగర్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే పోరాటాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. మహాసభలో శనివారం ప్రవేశపెట్టిన ముసాయిదా ఆర్గనైజేషనల్ రిపోర్ట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నట్టు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉదారవాద విధానాలు ప్రజలకు పెనుభారంగా మారడమే దీనికి ప్రధాన కారణమని ఆయన చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో పాటు, సంక్షేమ పథకాలు నిర్వహించడం కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు కష్టంగా మారుతోందని, దీంతో ఆ భారాన్ని కూడా ప్రజలపై ప్రభుత్వాలు మోపుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితులు ప్రజలు రోడ్లమీదకు వచ్చి పోరాటం చేయక తప్పని స్థితిని కలిగిస్తున్నాయని చెప్పారు. కార్మికవర్గంపై పడుతున్న భారాలకు, పెరుగుతున్న ఒత్తిడికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు చేసిన పోరాటాలకు సీపీఐ(ఎం) క్రియాశీలక మద్దతు ఇచ్చిందని తెలిపారు. అదే విధంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్‌మోర్చా చేసిన పోరాటానికి కూడా పార్టీ కీలక మద్దతు ఇచ్చినట్టు చెప్పారు. భూమి, ఇండ్లస్థలాలు, ఉపాధి కోసం తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, రాజస్థాన్‌లతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా సీపీఐ(ఎం) ప్రజలను కదిలించి పోరాటాలు చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా కేరళలో పెద్దఎత్తున ప్రచార ఆందోళన కార్యక్రమాలు జరిగాయని, నిరుద్యోగానికి నిరసనగా పశ్చిమబెంగాల్‌లో యువత ఆందోళనలు చేసిందని, బీజేపీ దాడులకు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా త్రిపురలో భారీ ఆందోళనలు సాగాయని తెలిపారు. పశ్చిమబెంగాల్, తమిళనాడుతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో మహిళలు, పిల్లలపై జరిగిన లైంగికదాడులు, వేధింపులకు వ్యతిరేకంగా ...3లో



ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు : సీపీఐ(ఎం) డిమాండ్

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి నవతెలంగాణ ప్రతినిధి

ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో సభ్యులు రామచంద్రడోమ్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, సెంట్రల్ కమిటీ సభ్యులు ఇష్ఫాకర్ రహమాన్ బలపరిచారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తున్నట్టు ఈ తీర్మానంలో పేర్కొన్నారు. 'సమాజంలోని అణచివేతకు గురైన షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్సీలు), షెడ్యూల్డ్ ట్రైబల్ (ఎస్టీలు), ఇతర వెనుకబడిన తరగతు లు (ఓబీసీలు) ఇప్పటికీ సామాజిక వివక్షకు విస్మరణకు గురవు తూనే ఉన్నారు. పేదరికం, వివక్ష కులాల ఆధారంగా ఏర్పడిన సామాజిక నిర్మాణాల్లో ప్రధాన భాగంగా ఉన్నాయి. భూమి ...3లో

హెచ్‌సీయూ భూములు లాక్కున్నట్టు

తప్పుడు ప్రచారం

ఏఐ ద్వారా లేనివి ఉన్నట్టు సృష్టించారు

ఫేక్ కంటెంట్ తయారీపై కోర్టుకు వివరించండి

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోండి

సైబర్ క్రైం విభాగాన్ని మరింత బలోపేతం చేయండి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను లాక్కున్నట్టుగా సోషల్ మీడియా నెట్‌వర్క్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. "సర్వే నెంబర్ 25లో ఉన్న భూముల్లో గత 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రయివేటు బిల్డింగ్‌లు, యూనివర్సిటీ బిల్డింగ్‌లను నిర్మించారు. వాటిపై ఎలాంటి ఆందోళన జరగలేదు" అని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు తలెత్తలేదని ...13లో

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం

స్ఫూర్తిదాయకం : సీఎం

వివరాలు 12లో..

నేడు భద్రాద్రికి ముఖ్యమంత్రి

సీఎం హోదాలో శ్రీరామనవమికి తొలిసారి..

సీఎంతోపాటు ఏడుగురు మంత్రులూ..

తానీషా కాలంనాటి ఆనవాయితీకి గత సీఎం బ్రేక్

సారపాకలో సన్నబియ్యం అన్నం రుచి చూడనున్న రేవంత్ రెడ్డి

మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో భారీ బందోబస్తు



సమగ్ర రక్షణ సహకారం

ఏడు కీలక ఒప్పందాలపై భారత్, శ్రీలంక సంతకాలు

ప్రధాని మోడీకి మిత్ర విభూషణ అవార్డు ప్రదానం

కొలంబో : మొట్టమొదటిసారిగా, భారత్, శ్రీలంక బృహత్తరమైన రక్షణ సహకార ఒప్పందంపై శనివారం సంతకాలు చేశాయి. మరింత సమగ్రమైన రీతిలో ద్వైపాక్షిక సహకారానికి చేపట్టాల్సిన విస్తృత ప్రణాళికను ప్రధాని మోడీ వివరించారు. ఇరు దేశాలు పరస్పరం ఆధారపడి వున్నాయని, వాటి భద్రత కూడా ముడిపడి వుందని మోడీ పేర్కొన్నారు. ఇరు పక్షాలు ఏడు కీలకమైన ఒప్పందాలపై సంతకాలు చేయగా వాటిలో రక్షణ ఒప్పందం ఒకటి. అంతకుముందు ప్రధాని మోడీ, శ్రీలంక అధ్యక్షుడు ...13లో

బాయ్‌కాట్ అమెరికా

పలు దేశాలలో వస్తు బహిష్కరణలు



వాషింగ్టన్ : ఒక వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య భాగస్వాములపై ప్రతీకార సుంకాలు విధించి సంబరపడుతుంటే మరోవైపు ప్రపంచవ్యాప్తంగా అమెరికా వస్తువుల బహిష్కరణ కొనసాగుతోంది. 'బాయ్‌కాట్ అమెరికా' పేరుతో సోషల్ మీడియా, సెర్చ్ ఇంజిన్లలో పుంఖానుపుంఖాలుగా సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా బ్రాండ్లు, ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దంటూ నెటిజన్లు విజ్ఞాపనలు పంపుతున్నారు. సుంకాలను ట్రంప్ ప్రకటించకముందే ఐర్లాండ్‌లోని డూన్‌బెగ్‌లో, స్కాట్‌లాండ్‌లోని టర్న్‌బెర్రీలో ఉన్న అధ్యక్షుడి గోల్ఫ్ కోర్సుల వద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి. కెనడాలో వ్యాపారులు అమెరికా వస్తువులను విక్రయించడం ఆపేశారు. ఇక ట్రంప్ సన్నిహితుడు ఎలన్ మస్క్‌పై కూడా ప్రజాగ్రహం అమెరికాతో సహా పలు దేశాల్లో పెల్లుబుకుతోంది. యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లోని టెస్లా కార్ షోరూముల వద్ద నిరసనలు జరిగాయి.జర్మనీ వంటి కొన్ని చోట్ల ఆందోళనకా రులు కార్లకు నిప్పు పెట్టారు. కార్ల అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. మొత్తంగా చూస్తే ట్రంప్, మస్క్ బ్రాండ్ల బహిష్కరణ ఊపందుకుంటోంది. డెన్మార్క్‌లోని అతి పెద్ద వ్యాపార సంస్థ సాలింగ్ గ్రూప్ యూరోపియన్ యూనియన్ ఉత్పత్తులన్నింటి ...13లో

వీడీసీ ఆగడాలు



ఆలయంలో పూజలో పాల్గొనకుండా అడ్డగింత

గౌడ సామాజిక తరగతిపై తాళ్లరాంపూర్ వీడీసీ దాష్టీకం

పోలీస్‌స్టేషన్‌లో మహిళల ఫిర్యాదు

గ్రామకమిటీ సభ్యులు, పూజారిపై కేసు నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

నిజామాబాద్ జిల్లాలో గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)ల ఆగడాలు శృతిమించుతున్నాయి. ముఖ్యంగా ఆర్మూర్ డివిజన్‌లో చాలా గ్రామాల్లో వీడీసీ పేరిట వివిధ కుల వృత్తులపై ఆంక్షలు విధిస్తూ వేధిస్తున్నాయి. గౌడ కులస్తులపై గ్రామంలో ఆంక్షలు విధించిన వీడీసీ.. తాజాగా శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆ సామాజిక తరగతికి చెందిన మహిళలను పూజలు చేయకుండా అడ్డగించిన వైనం వెలుగుజూసింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. తాళ్లరాంపూర్ గ్రామంలో గీత కార్మికులకు, గ్రామ కమిటీకి కల్లుగీత విషయంలో కొన్ని నెలలుగా గొడవలు ...13లో

ఆయుధాలు వీడండి

మావోయిస్టులకు అమిత్ షా విజ్ఞప్తి



దంతెవాడ : ఆయుధాలు విడనాడి జన జీవన స్రవంతిలో చేరాల్సిందిగా మావోయిస్టులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా కోరారు. మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల గురించి ప్రశ్నలు లేవనెత్తిన వారిని ప్రస్తావిస్తూ బస్తర్ ప్రాంతంలో అమాయకులైన గిరిజనులు ప్రాణాలు కోల్పోవడాన్ని ఈ సందర్భంగా ఉదహరించారు. ఏ ఒక్క మావోయిస్టు చనిపోయినా ఏ ఒక్కరూ సంతోషంగా ...13లో

క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని..


మనస్తాపంతో రైలు కిందపడి యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-బేగంపేట్

క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్రలోని బీహెచ్‌ఈఎల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రాజీవ్‌ర్ సింగ్ ఠాకూర్(25) ప్రయివేటు ఉద్యోగి. అతను క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడి ...13లో

హిందూత్వ శక్తుల డిజిటల్ మాయ

అసత్య కథనాలు, విద్వేష కంటెంట్‌తో విపరీత ప్రచారాలు



సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న వైనం

కల్పిత వీడియోలు, మీమ్స్, ట్రోల్స్ వైరల్

ముస్లింలు, క్రిస్టియన్లు, ప్రతిపక్ష నాయకులే టార్గెట్

కలిసొచ్చిన సామాజిక మాధ్యమాల అల్గారిథమ్

బీజేపీకి అనుకూలంగా వ్యవహారం

న్యూఢిల్లీ : ప్రపంచంలో డిజిటల్ టెక్నాలజీ రాక, దాని విస్తృత వినియోగం రాజకీయ చర్చను మార్చివేసింది. భారత్‌లో ఈ పరివర్తన హిందూత్వ సైద్ధాంతిక స్థిరత్వానికి బాటలు పరిచింది. హిందూత్వ సంస్థలు, సంఘాలు, పార్టీలు ఈ వేదికను తమకు అనుకూలంగా వినియోగించుకున్నాయి. వాట్సప్, ఎక్స్(ట్విట్టర్), ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు హిందూత్వ సైద్ధాంతిక విస్తరణకు ఎంతగానో దోహదం చేశాయని మేధావులు, విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఇందుకు భారత్‌లో సదరు వేదికల అల్గారిథమ్‌లు కావచ్చు, ఆ సంస్థల ఆర్థిక ప్రయోజనాలు కావచ్చు.. హిందూత్వ శక్తుల విష ప్రచారానికి అనుకూలంగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ కోసం మతాల మధ్య చిచ్చు

విద్వేషపూరిత కంటెంట్, కల్పిత కథనాలు, మీమ్స్, ట్రోల్స్‌ను హిందూత్వ శక్తులు వాడుకుంటున్నాయి. ఇవి హింసనూ ప్రేరేపిస్తున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సత్యదూరమైన కథనాలతో ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్నాయి. హిందు, ముస్లిం, క్రిస్టియన్ అంటూ రెచ్చగొడుతున్నాయి. ఆ వర్గాల మధ్య చిచ్చుపెడుతున్నాయి. సమాజంలో మతసారస్యానికి విఘాతం కలిగిస్తున్నాయి. మత ఘర్షణలతో బీజేపీకి రాజకీయ ప్రయోజనాలను అందించే ప్రయత్నాలను హిందూత్వ శక్తులు చేస్తున్నాయి. ముస్లింలను శాశ్వత దురాక్రమణదారులుగా చరిత్రను తిరిగి రాసే కుటిల యత్నాలకూ పూనుకుంటున్నాయి.



ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాషాయ ప్రభుత్వాలకు ప్రచారం

కేంద్రంలోని మోడీ సర్కారు, ఆయా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు, చేసే చర్యలను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. మోడీ, బీజేపీ.. హిందువుల కోసం పని చేసే శక్తులుగా చిత్రీకరిస్తున్నాయి. ఇతర పార్టీలను హిందు వ్యతిరేకులుగా, మైనారిటీ పక్షపాతం కలిగినవిగా ప్రచారం చేస్తున్నాయి. హిందూత్వవాదంతో వీహెచ్‌పీ, అంతర్రాష్ట్ర హిందూ పరిషద్-రాష్ట్రీయ బజరంగ్ దళ్, హిందూ జన జాగృతి సమితి అనే సంస్థలతో పాటు బీజేపీలు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాయి. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఉదాహరణకు, 2023లో కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో టిప్పు సుల్తాన్‌ను 'క్రూరమైన ఆక్రమణదారుడు'గా, హిందువులను అణచివేసిన వ్యక్తిగా హిందూత్వ శక్తులు చిత్రీకరించాయి. హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు.. టిప్పు సుల్తాన్ విషయంలో కల్పిత కథనాలు, వీడియోలు, మీమ్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసి వైరల్ చేశాయి. కాంగ్రెస్‌పై విషం చిమ్మాయి. ఇక అయోధ్య బాబ్రీ మసీదు అంశంలో సుప్రీంకోర్టు తీర్పు పైనా హిందూత్వ శక్తులు సోషల్ మీడియాలో పోస్టుల వరదను కురిపించాయి.

కలిసి వచ్చిన సోషల్ మీడియా అల్గారిథమ్.. బాసటగా బీజేపీ ప్రభుత్వాలు

ఇక సోషల్ మీడియా అల్గారిథమ్‌లు కూడా హిందూత్వ శక్తులకు కలిసి వస్తున్నాయి. సంచలన కథనాలకు ఈ అల్గారిథమ్‌లు సానుకూలంగా పని చేస్తున్నాయి. ఈ అల్గారిథమ్ పక్షపాతంతో హిందూత్వ కంటెంట్‌కు ప్రయోజనం చేకూరుతున్నదని అయాన్ ఇన్‌స్టిట్యూట్ 2022 నివేదిక, సహానా ఉడుపాస్ (2020) పరిశోధన వెల్లడించింది. ఇక ప్రభుత్వాల మద్దతు కూడా హిందూత్వ శక్తుల విపరీత ప్రచారానికి కీలకంగా మారుతున్నది. ముఖ్యంగా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ తీరు కనిపిస్తున్నది. ఆన్‌లైన్‌లో తప్పుడు ప్రచారంలో చాలా నైపుణ్యం కలిగి ఉన్న బీజేపీ ఐటీ సెల్.. పెయిడ్ ప్రకటనలతో డిజిటల్ వేదికను తనకు అనుకూలంగా వాడుకుంటున్నది. అయితే, భారత్‌లో మత విద్వేష ప్రసంగాలకు తమ వేదికను వాడుకుంటున్నారన్న విషయం ఫేస్‌బుక్ మాతృ సంస్థ అయిన మెటాకు తెలిసినా.. ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అటువంటి కంటెంట్‌ను కట్టడి చేసే విషయంలో పెద్దగా ఏమీ చేయటం లేదని ఫేస్‌బుక్ విజిల్‌బ్లోయర్ ఫ్రాన్సెస్ హాగెన్స్ వివరించారు. ఇక వాట్సప్‌లో ప్రత్యేకమైన గ్రూపులను ఏర్పర్చి ద్వేషపూరిత కంటెంట్‌ను షేర్ చేస్తున్నాయి. ముఖ్యంగా, ముస్లింలు, క్రిస్టియన్లను టార్గెట్‌గా చేసుకుంటూ వీటి చర్యలు ...13లో



పిల్లలకు ర్యాంకులే జీవితం కాదు

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబురి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మార్కులు, ర్యాంకులు మాత్రమే జీవితం కాదనీ, తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభ చూపేలా చిన్నారులను ప్రోత్సహించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ సన్ సిటీలోని గ్లెన్డేల్ అకాడమీలో నిర్వహించిన "లీడర్‌షిప్‌డే-2025"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను నేర్పించాలనీ, అప్పుడే సమాజాన్ని అర్థం చేసుకునే మంచి నాయకులు తయారవుతారని పేర్కొన్నారు. వ్యక్తిత్వ నిర్మాణంలో పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి చిన్నారిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందనీ, ఇతరులతో పోల్చి వారిపై ఒత్తిడి తేవొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థి దశలోనే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని... దాన్ని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. టెక్నాలజీ రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో వినూత్నంగా ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌జీ డిప్యూటీ కంట్రీ డైరెక్టర్ అవీష్ సింగ్, గ్లెన్డేల్ గ్రూప్స్ డైరెక్టర్ మీనూ సలూజా, లైఫ్ కోచ్ అండ్ మెంటార్ డా.కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య అకాడమి-ఇన్ఫినిటీ లెర్న్ ఆత్రేయ ప్రారంభం

- నీట్ ఫలితాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా ఫిజిక్స్ సెషన్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శ్రీచైతన్య అకాడమి-ఇన్ఫినిటీ లెర్న్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నీట్ కోర్సు కోసం ఆత్రేయను ప్రారంభించాయి. ఇది డిజిటల్ టూల్స్‌తోపాటు రియల్ టైమ్ పనితీరు ట్రాకింగ్‌ను సమగ్రంగా అందిస్తుంది. నీట్ అభ్యర్థులకు ఎక్కువగా సవాల్‌గా నిలిచేది ఫిజిక్స్ సబ్జెక్టు. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. పీ2సీబీజెడ్‌తో నీట్ కోచింగ్ ద్వారా ఫిజిక్స్ సెషన్లను రెట్టింపు చేస్తుంది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్ఫినిటీ లెర్న్ సహ వ్యవస్థాపకురాలు, శ్రీచైతన్య గ్రూప్ సీఈవో, డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ ఆత్రేయ ద్వారా నీట్ కోచింగ్‌ను కొత్త దిశలో తీసుకెళ్లామని అన్నారు. వ్యక్తిగత గైడెన్స్‌కు ఆధునిక ఏఐ టెక్నాలజీని మిళితం చేయడం వల్ల విద్యార్థుల అభ్యాసాన్ని విప్లవాత్మంగా మార్చుతున్నామని చెప్పారు. నీట్‌లో టాప్ ఫ్యాకల్టీతో విద్యార్థుల ప్రగతికి తక్షణ పరిష్కారాలను అందిస్తామని వివరించారు. ఇది వారి ఎంబీబీఎస్ కలను నిజం చేయడంలో సహాయ పడుతుందని అన్నారు. నీట్ సంసిద్ధత అంటే కేవలం చదువు మాత్రమే కాదనీ, భావోద్వేగ స్థిరత్వం కూడా అవసరమని చెప్పారు. ఆత్రేయలో ఈ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ఏకాగ్రతతో, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లేలా ప్రయత్నిస్తామన్నారు. ఇన్ఫినిటీ లెర్న్ వ్యవస్థాపక సీఈవో ఉజ్వల్ సింగ్ మాట్లాడుతూ అభ్యాసం అనేది ప్రయాణమని అన్నారు. టాప్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు సాధించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి విద్యార్థి శక్తివంతం చేసేందుకే ఈ మిషన్‌ను ప్రారంభించామని చెప్పారు. బలహీనంగా ఉన్న అంశాలను దృఢంగా చేయడంపై దృష్టి పెడతామని అన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి

- యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు టీపీసీసీ చీఫ్ పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వంపై కొంతమంది పనిగట్టుకుని చేస్తున్న తప్పుడు ప్రచారాలను యువజన కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఇంధిరా భవన్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శులు పీసీ. విష్ణునాథ్, సంపత్ కుమార్, నాగార్జున సాగర్ ఎంపీ కుందూర్ జయవీర్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో కొంతమంది ఫేక్ వీడియోలు సృష్టించి ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

రాష్ట్ర యువతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తలపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. యూత్ జోడో- బూత్ జోడో కార్యక్రమంతో ప్రజల్లోకి మరింతగా చొచ్చుకు వెళ్లాలనీ, సోషల్ మీడియా కమిటీలను ఏర్పాటు చేయాలని మొదలగు ఆరు అంశాలపై సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి సురభి ద్వివేది, కార్యదర్శి శ్రవణ్ రావు, తెలంగాణ బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ చైర్మెన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, రాష్ట్ర సాంస్కృతిగా సారధి చైర్మన్ వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకి ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య

నవతెలంగాణ - ముషీరాబాద్

ఆరోగ్య సమస్యతో బాధపడుతూ మానసిక ఆందోళనకు గురైన ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ ఓ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్ గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మికి భర్త రమేష్‌తో 9 సంవత్సరాల కిందట విడాకులయ్యాయి. ఆమె ప్రస్తుతం తన కుమార్తెతో కలిసి ఈసీఐఎల్ సాయినాథ్‌పురంలోని సోనీ ప్లాజా వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటోంది. అయితే, జయలక్ష్మి రెండు సంవత్సరాలుగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. క్యాన్సర్ ఉన్నట్టు తెలిసినప్పటి నుంచి ఆమె తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. ఈ క్రమంలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కాగా, ఆమె కవాడిగూడలోని సీజీఓ టవర్స్‌కు వచ్చింది. భవనం 8వ అంతస్తుకు వెళ్లి కిటికీ నుంచి కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడిన అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కూతురు అందించిన సమాచారంతో అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. తదుపరి వివరాలపై దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం జయలక్ష్మి కూతురు భావన బేగంపేట్‌లో సీఏ ఇంటర్న్ షిప్ చేస్తోంది.

13న ఇందిరాపార్క్ వద్ద ధర్నా : ఎస్టీటీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు ఎస్టీటీయూ తెలిపింది. శనివారం హైదరాబాద్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని చెప్పారు. పీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలనీ, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించాలని కోరారు. ఉద్యోగులకు ఆరోగ్య కార్డులను ఇవ్వాలని చెప్పారు. ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికల వెంకటేశం మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన హక్కుల కోసం ఉద్యమిస్తామని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఒక ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉండాలనీ, తరగతికి ఒక గది, టీచర్‌తోపాటు పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఉండాలని సూచించారు. ఉద్యోగులకు సంబంధించి వివిధ రకాల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి అంజయ్య, డి శ్రీనివాస్ రెడ్డి, వి నీరజ, రోహిణి దేవి, హరి ప్రసాద్, తిరుపతిరెడ్డి, విజయ్, విజయేందర్ రెడ్డి, రమణారెడ్డి, సాగర్, కిషన్, సత్యం, సుధాకర్ రావు, రిజ్వానా బేగం, సౌమ్య, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో సామాజిక సాధికారత ఉత్సవాలు

జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన వీసీ ఘంటా చక్రపాణి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ)లో సామాజిక సాధికాంత ఉత్సవాలను నిర్వహించారు. శనివారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ వర్సిటీలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వీసీ ఘంటా చక్రపాణి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అణగారిన ప్రజల అభ్యున్నతికి, విద్యా వికాసానికి, దేశ సమైక్యతకు, సమగ్రతకు దిశా నిర్దేశం చేసిన మహనీయుల జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ వర్సిటీలో సామాజిక సాధికారత వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలతో మొదలై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కార్యక్రమాలతో ముగుస్తాయని వివరించారు. అసమానతలకు నిలయంగా ఉన్న దేశంలో సమాన అవకాశాల కోసం అణగారిన వర్గాల సాధికారత కోసం కృషి చేసిన మహనీయుల్లో మహాత్మా జ్యోతిబా పూలే, బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అగ్రగణ్యులని అన్నారు. సామాజిక న్యాయాన్ని, సాధికారతను పూలే ఒక ఉద్యమంగా మొదలుపెడితే అంబేద్కర్ దాన్ని రాజ్యాంగబద్ధం చేసి ఈ దేశ మౌలిక స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేశారని చెప్పారు. చదువొక్కటే సాధికారతకు మూలమని అంబేద్కర్ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మహనీయుల జయంతులు, ఉపన్యాసాలు, చర్చాగోష్ఠులు, సదస్సులు, సాహిత్య సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని వివరించారు. ఈనెల ఎనిమిదిన జగ్జీవన్‌రామ్ జీవితం దేశాభివృద్ధికి చేసిన కృషిపై ఉపన్యాసం, 11న పూలే జయంతి సందర్భంగా బీసీ కులగణన సాధికారతపై ఉపన్యాసం ఉంటుందని చెప్పారు. 12న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అండ్ ఇంటర్ సెక్షనాలిటీస్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామనీ, అదేరోజు సాయంత్రం అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గ్లోబల్ అల్యూమ్ని ఉంటుందని అన్నారు. 13న రాజ్యాంగ పీఠిక పఠనం, సామాజిక సమానత్వం-సమ్మిళితం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని చెప్పారు. 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా స్మారకోపన్యాసం ఉంటుందనీ, ప్రధాన వక్తగా కత్తి పద్మారావు హాజరవుతారనీ, సాయంత్రం గోరెటి వెంకన్న ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి , పలువురు డైరెక్టర్లు , డీన్‌లు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుడు నాగరాజుకు మెరుగైన వైద్యమందించాలి

ప్రమాదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జనగాం జిల్లా రఘునాథ్ పల్లి మండలం మేకల గట్టు గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన గ్రామ పంచాయతీ కార్మికుడు వేల్పుల నాగరాజుకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మేకల గట్టు ఊరిలో పంచాయతీ కార్యదర్శి ఒత్తిడి మేరకు కారోబారు నాగరాజు మూడు రోజుల నుంచి వీధిలైట్లను వేస్తున్నాడని తెలిపారు. మల్టీపర్పస్ వర్కర్ విధానంతో అనుభవం లేకున్నా నాగరాజు విద్యుత్ స్తంభానికి వీధిలైట్లు వేస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడడం దారుణమని పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్ నడపరాని వాళ్ళ తోటి ట్రాక్టర్ నడిపించడం కరెంటు గురించి తెలవని వాళ్లతోటి కరెంట్ పని చేయించడం ఫలితంగా పంచాయతీ కార్మికుల ప్రాణాలు గాలిలో దీపాలమాదిరిగా మారాయని వాపోయారు. మేకల గట్టు కారోబార్ వేల్పుల నాగరాజు విద్యుత్ ప్రమాదానికి కారణమైన సంబంధిత పంచాయతీ అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాగరాజు కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆ జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రైళ్లలో మహిళలపై పెరిగిపోతున్న లైంగిక దాడులు

- ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైళ్లల్లో మహిళలపై రోజురోజుకి లైంగిక దాడులు పెరిగిపోతున్నాయనీ, దాడికి పాల్పడిన నిందితునిపై 2016 ఆర్‌పీడీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని ఎన్‌పీఆర్‌డీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు టి వరమ్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. రక్సోల్ - సికింద్రాబాద్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అర్ధరాత్రి వాష్ రూమ్‌కు వెళ్లిన ఆటీజం కలిగిన(వికలాంగురాలు) బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుణ్ణి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైళ్లలో వరుసగా మహిళలపై లైంగిక దాడులు, పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెలలో మేడ్చల్‌కు వెళ్లే ఎంఎంటీఎస్ రైలులో బాలికపై లైంగిక దాడి యత్నం ఘటన మరువకముందే మళ్ళీ ఆటీజం కలిగిన వికలాంగురాలిపై లైంగిక దాడి జరిగిందని తెలిపారు. రైలులో మహిళలకు భద్రత లేదనే దానికి ఈ మధ్యలో జరిగిన ఘటనలే నిదర్శనమని పేర్కొన్నారు. రైల్వే భద్రత వైఫల్యం మూలంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నవనీ, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్

నాలుగు రోజులుగా మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నిరవధిక సమ్మె



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 5 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 4 రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలతోపాటు నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మేడ్చల్, శామీర్‌పేట, మూడు చింతలపల్లి మండలాల్లోని గ్రామాల్లో కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల ఆందోళన, పోరాటాల ఫలితంగా సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపెడుతూ ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలను ప్రభుత్వం విడుదల చేసినా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించని పరిస్థితి ఏర్పడిందన్నారు. గతేడాది నవంబర్, డిసెంబర్ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ఏడాది మూడు నెలలు కలుపుకొని మొత్తం ఐదు నెలల వేతనాలు అందలేదని తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, ఇన్‌చార్జి డీపీఓ, జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లకు విన్నవించినప్పటికీ పరిష్కారం లభించడం లేదన్నారు. దాంతో దిక్కుతోచని పరిస్థితుల్లో వేతనాలు చెల్లించాలని కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేపట్టారని తెలిపారు. ఆదాయం కలిగిన జీపీల్లో గ్రామాల అభివృద్ధి, జనాభా పెరగటం వల్ల పంచాయతీ కార్మికుల పని కూడా పెరిగిందని తెలిపారు. పెరిగిన పనికి అనుగుణంగా తమ శ్రమను గుర్తించి వేతనాలు చెల్లించాలని ఆయా మండలాల్లో కార్మికులు పంచాయతీల సెక్రెటరీలకు విన్నవించిన నేపథ్యంలో ఏడాది కిందటి నుంచి ఆయా పంచాయతీల ఆదాయాన్ని బట్టి వేతనాలు పెంచి ఇస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.9,600కు గ్రామ పంచాయతీల ఆదాయం నుంచి కార్మికుల శ్రమను గుర్తించి పెంచిన వేతనాన్ని కలపాలని డిమాండ్ చేశారు. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వం నిర్ణయించిన వేతనాన్నే చెల్లిస్తామని, ఆదాయాన్ని బట్టి గతంలో నిర్ణయించిన వేతనాలు చెల్లించేది లేదని నేడు అధికారులు మాట దాట వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ కమిటీల తీర్మానంతో ఆమోదించుకున్న వేతనాలు చెల్లించే వరకు ఈ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించాలని, గ్రామ కమిటీల తీర్మానాన్ని గౌరవించి పాత పద్ధతిలో కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనకు సిద్ధం

జగ్జీవన్ రామ్ విగ్రహం వద్దకరపత్రాల ఆవిష్కరణ: కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేటి ఆధునిక యుగంలో కూడా కొనసాగుతున్న దేశానికి పట్టిన చీడ కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించడానికి యువతరం సమైక్యంగా సన్నద్ధం కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం కుల వివక్షపై ప్రతిఘటన పోరాటాలు అనే కరపత్రాన్ని సామాజిక ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన కరపత్రాలను ఆవిష్కరిం చారు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతీ నెలలో చివరి రోజు ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత గల ప్రభుత్వం దానిని విస్మరిస్తున్నదని విమర్శించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల్లో ప్రధానమైన భాగం ప్రతి వారంలో ఒకరోజు కుల వివక్ష నిర్మూలన కోసం ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని తెలిపారు.

రాష్ట్రంలో నేటికీ దేవాలయ ప్రవేశాలు లేని గ్రామాలున్నాయని పేర్కొన్నారు. బతుకమ్మ ఆడనీయకపోవడం, క్షవరం చేయకపోవడం రచ్చబండల మీద కూర్చోనీయక పోవడం తదితర వివక్షా రూపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో కుల వివక్ష పై అధ్యయనం నిర్వహించి, పూలే అంబేద్కర్ జయంతులను పురస్కరించుకుని ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు కరపత్రాన్ని అందించి మద్దతు తెలియజేయాలని కోరారు. వివిధ సామాజిక ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు చెన్నయ్య, మచ్చ దేవేందర్, పి శంకర్, ఆరేపల్లి రాజేందర్, పల్లెల వీరస్వామి, రుద్రవరం లింగస్వామి, వశపాక నరసింహ, గొల్లపల్లి దయానంద్, పోకల కిరణ్ వాణి, కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం దశరథ్ తదితరులు పాల్గొన్నారు..



కనీస అవసరాలను ప్రాథమిక హక్కులుగా గుర్తించండి

సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభ తీర్మానం

(సీతారాం ఏచూరి నగర్ (మదురై)నుంచి నవతెలంగాణ ప్రతినిధి)

ఆహారం, నివాసం, ఉపాధి, పెన్షన్, విద్య, ఆరోగ్యం వంటి కనీస అవసరాలను ప్రాథమిక హక్కులుగా గుర్తించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు అఖిల భారత మహాసభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు ప్రవేశపెట్టగా, సెంట్రల్ కమిటీ సభ్యులు ఏఆర్ సింధు బలపర్చారు. 'ఈ కనీస అవసరాలను అందించే సంక్షేమ పథకాలు దాతృత్వ చర్యలు కావు. ఇవి ప్రతి పౌరుడి మౌలిక హక్కులు' అని తీర్మానంలో పేర్కొన్నారు.

'వీటిని పొందడం ప్రతి పౌరుడి హక్కు. ఇవే న్యాయం, సమానత్వానికి పునాది. ఆర్థిక హక్కులు సామాజిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తాయి. సంక్షేమ కార్యక్రమాలు పెట్టుబడులుగా పని చేస్తాయి. ఫలితంగా ఎక్కువ ఉత్పాదకత కలిగిన కార్మిక వర్గాన్ని తయారుచేసి, దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయి.' అని తీర్మానంలో సీపీఐ(ఎం) వివరించింది. 'నూతన ఉదారవాద విధానాల ప్రవేశంతో, సామాజిక రంగంపై దాడులు మొదలయ్యాయి. ప్రభుత్వాలు ఆరోగ్యం, విద్యా రంగాల నుంచి తప్పుకోవాలని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వాటిని ప్రయివేటీకరించి తీరాలని ఈ విధానాలు చెబుతాయి. బీజేపీ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం ఈ సంక్షేమ కార్యక్రమాలను నిర్వీర్యం చేయడానికి, సబ్సిడీలను తగ్గించేందుకు ప్రయత్నాలను తీవ్రం చేస్తోంది. ప్రధాని మోడీ ఈ సంక్షేమ పథకాలను 'రేవడీలు'గా పోలుస్తూ, ఇవి దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారుతాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది అసలు వాస్తవానికి వ్యతిరేకం, ఎందుకంటే ఈ సంక్షేమ కార్యక్రమాలే మార్కెట్ ప్రేరేపిత నూతన ఉదారవాద విధానాల వల్ల నష్టపోయే బలహీన వర్గాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.' అని తీర్మానం వివరించింది. ' సబ్సిడీల ఆధారంగా ఉన్న పథకాల స్థానంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని నగదు బదిలీ పథకాలు చివరికి మౌలిక సామాజిక భద్రతా పథకాలను కుదించడానికి దారి తీస్తాయని, ఫలితంగా అత్యంత బలహీన వర్గాలు మరింత దుర్బల స్థితిలోకి వెళ్లిపోయాయని తీర్మానంలో పేర్కొన్నారు. 'ఇది భారత రాజ్యాంగంలోని మార్గద ర్శక సూత్రాలను ఉల్లంఘించ డమే.! ఇవి అన్ని వర్గాల పౌరులకు కుల, మత, వర్ణ, లింగ, ఇతర భేదాభిప్రాయాలకు అతీతంగా గౌరవనీయ జీవితానికి హామీ ఇవ్వాలని స్పష్టంగా చెబుతున్నాయి. అయితే, వాటిని అమలు చేయడం లేదు. అందువల్ల వీటిని న్యాయబద్ధమైన రాజ్యాంగ హక్కులుగా మార్చాల్సిన అవసరముంది.' అని తీర్మానం పేర్కొం ది. 'నూతన ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు "ఆర్థిక భారం" వల్ల ఈ హక్కులకు హామీ ఇవ్వలే మని చెబుతాయి. ఇది పూర్తిగా తప్పుడు వాదన. ఎందుకంటే, కార్పొరేట్ పన్నులను నిరంతరం తగ్గించడమే కాకుండా, కంపెనీల నుంచి చట్టపరంగా వసూలు చేయాల్సిన పన్ను లను వసూలు చేసేందుకు కూడా ప్రభుత్వాలు సిద్ధపడటం లేదు. బీజేపీ ప్రభుత్వం తన అధికారంలో ఉన్న ప్రతి ఏడాది కార్పొరేట్ పన్నులను తగ్గిస్తూ వచ్చింది. దీనికి బదులుగా ఒక న్యాయబద్ధమైన పన్నుల విధానం ద్వారా అవసరమైన అన్ని సేవలు ప్రతి పౌరునికి అందించవచ్చు' అని సీపీఐ(ఎం) తీర్మానంలో తెలిపింది. ఆహారం, నివాసం, ఉపాధి, పెన్షన్, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి మౌలిక హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ఈ తీర్మానంలో సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది.

పోరాటం పదునెక్కుతోంది



(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) పెద్దఎత్తున ఆందోళనలు చేసిందని తెలిపారు.

పెరిగిన పార్టీ సభ్యత్వం..

గత మహాసభ (2021) నుంచి ప్రస్తుత మహాసభ మధ్య కాలంలో సీపీఐ(ఎం) సభ్యత్వం పెరిగినట్టు రాఘవులు తెలిపారు. 2021 నాటికి 9,85,757గా ఉన్న పార్టీ సభ్యత్వం 2024 నాటికి 10,19,009కి చేరిందని, మహిళల సభ్యత్వం 18.2శాతం నుంచి 20.2 శాతానికి పెరిగిందని వివరించారు. పార్టీలో యువకుల సభ్యత్వం కూడా పెరుగుతోందని తెలిపారు. 2021లో 19.5శాతంగా ఉన్న యువకుల సభ్యత్వం 2024 నాటికి 22.6కు చేరిందని, వర్గ పొందిక కూడా సంతృప్తికరంగా ఉంద ని చెప్పారు. మొత్తం సభ్యత్వంలో 48.25శాతం కార్మిక వర్గానికి చెందిన వారు కాగా, 17.79 శాతం వ్యవసా య కార్మికులు, 9.93శాతం పేద రైతులు ఉన్నారని తెలిపారు. మొత్తం సభ్యత్వంలో 75.97శాతం పునాదివర్గాలకు చెందినవారని తెలిపారు.

13 తీర్మానాలు ...

వ్యవసాయ మార్కెటింగ్ కోసం రూపొందించిన నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్‌ను ఉపసంహరించుకోవాలని, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, విద్య, వైద్యం, ఆహారం, పెన్షన్ వంటి కనీస అవసరాలను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్మానించినట్టు చెప్పారు. వీటితో పాటు మొత్తం 13 తీర్మానాలను శనివారం నాటి మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించి నట్టు రాఘవులు తెలిపారు. ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు చెప్పారు. ఈ తీర్మానంపై జరిగిన చర్చల్లో 53 మంది ప్రతినిధులు పాల్గొన్నారని, మొత్తం 174 సవరణలు అందాయని చెప్పారు. చర్చకు పొలిట్‌బ్యూరో సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్ సమాధానం ఇచ్చారని, అనంతరం మహాసభ ఆమోదించిందని చెప్పారు. క్రిస్టియన్లపై సంఘ్‌పరివార్ చేస్తున్న దాడులను ప్రస్తావించగా అటువంటి సంఘటనలను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

జమ్మూ కాశ్మీర్ ప్రజలకు అండగా నిలవండి : తరిగామి

కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన జమ్మూ కాశ్మీర్ ప్రజలకు అండగా నిలవాలని సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యుడు తరిగామి విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆకాంక్షలను కేంద్రం తీవ్రంగా దెబ్బ తీసిందని, సొంత దేశంలోనే శరణార్థుల్లా బతకాల్సిన పరిస్థితిని తీసుకు వచ్చిందని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత పరిస్థితులు ఘోరంగా మారాయని, ప్రజల చేతుల్లో నుంచి భూమి కార్పొరేట్ల చేతుల్లోకి పోతోందని అన్నారు. ఎన్నుకున్న ప్రభుత్వానికి కనీస హక్కులు కూడా లేవని చెప్పారు. జమ్మూకాశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు : సీపీఐ(ఎం) డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

లేకపోవడం, వివిధ వత్తుల్లో ప్రవేశించే అవకాశాల్లో ఆంక్షలు, విద్య నిరాకరణ వంటి అంశాల కారణంగా ఆర్థికంగా వీరికి ఎదగలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.' అని తీర్మానంలో పేర్కొన్నారు. 'రాజకీయంగా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఈ కులాల ఆర్థిక విస్మరణను ఎదుర్కోవడంలో అత్యంత కీలకంగా మారాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15(4), 16(4), 46, 335 ఆధారంగా ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడానికి మార్గం ఏర్పడింది. అయితే ఈ రిజర్వేషన్లు ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితమ య్యాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు లోనూ తీవ్ర లోపాలు జరిగాయి. అనేక రిజర్వ్ చేసిన ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. 2023లోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యో గాల్లో 10 లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయి. వీటిలో అత్యధికం రిజర్వ్ ఉద్యోగాలే. రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ, ప్రభుత్వరంగ సంస్థల్లోనూ ఇదే పరిస్థితి. నూతన సరళీకరణ ఆర్థిక విధానాలతో, రిజర్వేషన్ వర్తించే ప్రభుత్వరంగ ఉద్యోగాల సంఖ్య తీవ్రంగా తగ్గిపోయింది. 1990లలో సుమారు 2 కోట్ల ప్రభు త్వ ఉద్యోగాలు (కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలు, సెమీ -ప్రభుత్వ రంగాలు కలిపి) ఉండగా, 2012 నాటికి ఈ సంఖ్య 1.7 కోట్లకు పడిపోయింది. అంటే 30 లక్షల ఉద్యోగాలు తగ్గిపోయాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిణామం మరింత వేగంగా జరిగింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలపై సమగ్ర గణాంకాలను ప్రచురించడం మానే సింది. అయినప్పటికీ, రైల్వేలు, పోస్టులు, బ్యాంకులు వంటి రంగాల్లో ఉద్యోగాలు పెద్దఎత్తున తగ్గినట్టు గణాంకాలు చూపుతు న్నాయి. 1990ల మధ్యకాలంలో పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో 10 లక్షలకు పైగా ఉద్యోగులు ఉండగా, 2024 నాటికి ఇది 7.5 లక్షలకు తగ్గిపోయింది. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 4.5 లక్షల ఉద్యోగాలు తగ్గాయి (అంటే 35 శాతం తగ్గుదల). రైల్వేలో 80,000, పోస్టల్ శాఖలో 40,000, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 90,000 ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఈ తగ్గుదల అధికంగా గ్రూప్ సి, గ్రూప్ డి ఉద్యోగాల్లో నమోదైంది. 2014-15 నుంచి 2022-23 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వంలో తగ్గిన ఉద్యోగాల్లో 86 శాతం ఈ ఉద్యోగాలే. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నియామకాలు వీటిలోనే ఎక్కువ జరిగాయి. ఈ విధానాల కారణంగా ప్రభుత్వ సంస్థలలో ఔట్‌సోర్సింగ్, ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా ఉద్యోగుల నియామకం పెరిగింది. విద్యారంగ ప్రయివేటీకరణ వల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ నియామకాలు పెరగలేదు. ఫలితంగా ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయుల నిష్పత్తి భారీగా తగ్గింది. 2023-24లో ఎస్టీ ఉపాధ్యాయులు కేవలం 7.7 శాతం, ఎస్సీ ఉపాధ్యాయులు 12.6 శాతం మాత్రమే ఉన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఈ కులాల ఉపాధ్యాయులకు అవకాశం మరింత తక్కువగా కేవలం 13 శాతం మాత్రమే ఉంది.' అని తీర్మానం పేర్కొంది. ' ప్రభుత్వ నిధులతో రూపొందించే ఉపాధి పథకాల్లోనూ రిజర్వేషన్లు అమలు కావడం లేదు. ఉదాహరణకు, 2024 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఉపాధి పథకాల నిమిత్తం రూ.1.73 లక్షల కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించింది. ఇందులో 20 లక్షల మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించాల్సి ఉంది. అయితే ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్ అమలయ్యేలా ఎటువంటి నిబంధనా లేదు. నూతన ఉదారవాద విధానాల్లో ప్రయివేటీకరణ, కాంట్రాక్టు విధానం ప్రధానంగా ఉన్నాయి. ఇవి ఉపాధి అవకాశాలను అసంఘటిత రంగానికి తరలించాయి. ఫలితంగా రిజర్వేషన్లు ఒక సామాజిక న్యాయం సాధించే సాధనంగా ఉండలేకపోయాయి. ఈ నేపథ్యంలో ప్రయివేటు రంగం మొత్తానికి రిజర్వేషన్లను వర్తింపజేయాలని, అన్ని గుర్తింపు పొందిన సంస్థలకు విస్తరిం చాలని. ప్రతి ప్రయివేట్ కంపెనీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే నిబంధనను రూపొందించి, అమలు చేయాలి' అని సీపీఐ(ఎం) తీర్మానంలో డిమాండ్ చేసింది.

మరిన్ని తీర్మానాలు...

- వక్ఫ్ సవరణ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలన్న తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. దీనిని కేంద్ర కమిటీ సభ్యులు ఎలమరిం కరీం ప్రతిపాదించగా, మరో కేంద్ర కమిటీ సభ్యులు అంజుకుమార్ బలపరిచారు.
- జమ్మూకాశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్రహోదా కల్పించడం, ప్రజాస్వామ్యాన్ని బలపర్చడం వంటి చర్యలు తక్షణం తీసుకోవాలి. ఈ తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి ప్రవేశపెట్టగా, మరో కేంద్ర కమిటీ సభ్యులు ఉదయ్ నర్కార్ బలపర్చారు.
- క్యూబాకు సంఘీభావం తెలపడంతోపాటు, ఆ దేశంపై అమెరికా విధించిన అన్ని అమానవీయ ఆంక్షలను ఎత్తివేయాలన్న తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్ ప్రతిపాదించగా, మయూఖ్ బిశ్వాస్ బలపర్చారు.
- ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించే యత్నాలను ప్రతిఘటించాలి. ఈ తీర్మానాన్ని సుదీప్ దత్త ప్రతిపాదించగా, ప్రమోద్ ప్రధాన్ బలపరిచారు.
- డీప్ సీ మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ కేంద్ర కమిటీ సభ్యులు థామస్ ఐజాక్ తీర్మానాన్ని ప్రతిపాదించగా ఆలీ కిషోర్ పట్నాయక్ బలపరిచారు.
- మహిళలు, పిల్లలపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా తీర్మానాన్ని మరియం థావలే ప్రవేశపెట్టగా, సురేంద్రమల్లిక్ బలపరిచారు.
- యువత డ్రగ్స్‌కు అలవాటు పడటానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిస్తూ తీర్మానాన్ని సీసీ సభ్యులు సుఖ్విందర్ సింగ్ షేఖాన్ ప్రతిపాదించగా, అరుణ్‌మెహతా ప్రతిపాదించారు.
- ఎల్‌జీబీటీక్యూకు సమాన హక్కుల తీర్మానాన్ని సీసీ సభ్యురాలు యు.వాసుకి ప్రతిపాదించగా, కె.నీల బలపర్చారు.
- అంగవికలాంగులకు గౌరవం, న్యాయం కల్పించాలన్న తీర్మానాన్ని ఝాన్సీరాణి ప్రతిపాదించగా, సామ్య గంగూలీ బలపర్చారు.
- యూజీసీ రూపొందించిన ముసాయిదా నిబంధనలను వ్యతిరేకిం చాలన్న తీర్మానాన్ని రాజీవ్ కున్వార్ ప్రతిపాదించగా, వీపీ సాను బలపర్చారు.



సాంస్కృతిక వేదిక వద్దకు వస్తున్న ప్రకాశ్‌రాజ్



కర్నాటక కళాకారుల నృత్య ప్రదర్శనలు



ప్రదర్శనలకు ఆటంకంగా వర్షం

క్రైస్తవులపై పెరుగుతున్న 'సంఘ్' దాడులు

సీతారాం ఏచూరి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి



మధ్యప్రదేశ్‌ను క్రైస్తవులపై దాడులకు ప్రయోగశాలగా సంఘ్ పరివార్ శక్తులు మార్చుకున్నాయని ఆ రాష్ట్ర సీపీఐ(ఎం) కార్యదర్శి జస్వీందర్ సింగ్ చెప్పారు. నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లో సంఘ్‌పరివార్ శక్తులు చెలరేగిపోతున్న తీరును వివరించారు.


-'జబల్పూర్‌లో విహెచ్‌పి గుండాలు మలయాళీ క్రైస్తవ పూజారు లపై దాడి చేశారు. ఇది మైనారిటీలపై గత కొన్నేళ్లుగా జరుగుతున్న అణచి వేతలకు కొనసాగింపే. మధ్యప్రదేశ్‌లో సాధారణంగా ముస్లింలు సంఘ్ పరివార్ దాడులకు గురవుతుంటారు. అయితే ఆదివాసీ ప్రాంతాల్లో మాత్రం ఇప్పుడు క్రైస్తవులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు.' అని ఆయన వివరించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా చురుకుగా పోరాడుతున్నట్లు చెప్పారు.

'2024 జనవరి 22న, ప్రధాని రామ్ మందిరాన్ని ప్రారంభించిన రోజే, జ్హబువా జిల్లాలో చర్చ్‌ను సంఘ్ పరివార్ కూల్చివేసింది. . గోడలపై "జై శ్రీరామ్" అని రాశారు. మరో చర్చ్‌పై కాషాయ జెండా ఎగురవేశారు. ఎప్పుడూ లేని విధంగా నర్మదా నదికి కుంభ మేళా నిర్వహించి క్రైస్తవ చర్చ్‌లను ధ్వంసం చేశారు.' అని ఆయన తెలిపారు. 'దీని అర్థం ముస్లింలపై దాడులు జరగడం లేదని కాదు. వారిపై మరింత ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయి. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ఈ దాడులన్నింటి వెనుక పోలీసులు ఉన్నారు. ఇటీవలే ఇండోర్ జిల్లాలోని మ్హౌ పట్టణంలో ఊరేగింపు సందర్భంగా ఒక మసీదు మీద దాడి జరిగింది. దాడి చేసిన వారి పేర్లు ఇచ్చినా, ఎఫ్ఐఆర్‌లో "గుర్తు తెలియని వ్యక్తులు" అనే నమోదు చేశారు. అదే సమయంలో, 13 మంది ముస్లిం యువకులపై అబద్ధపు కేసులు బనాయించి, వారి ఇండ్లు బుల్డోజర్లు పంపించి కూల్చేశారు. ఇన్ని దాడులు జరగుతున్నా సీపీఐ(ఎం) తప్ప బాధితుల తరపున మరే పార్టీ మాట్లాడటం లేదని అన్నారు.

'వక్ఫ్' తరువాత చర్చిపై సంఘ్ దృష్టి

సీతారాం ఏచూరి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

పినరయి విజయన్



వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించిన అనంతరం చర్చిపై సంఘ్‌పరివార్ దృష్టి సారించిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. మదురైలో సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభ జరుగుతున్న సీతారాం ఏచూరి నగర్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించడం ద్వారా నరేంద్రమోడీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల రాజ్యాంగ హక్కులపై తీవ్రమైన దాడి చేసిందని చెప్పారు. దాని తరువాత దేశ వ్యాప్తంగా ఉన్న క్యాథలిక్ చర్చిపై సంఘ్ పరివార్ దాడికి దిగుతోందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మౌత్‌పీస్ 'ఆర్గనైజర్'లో ప్రచురితమైన ఒక వ్యాసం ఈ విషయాన్ని ధృవీకరిస్తోందని పినరయి విజయన్ చెప్పారు. 'సంఘ్ లక్ష్యాలను ఆ వ్యాసం స్పష్టంగా ప్రతిబింబిస్తోంది' అని ఆయన అన్నారు. చర్చి ఆస్తుల విషయాలను అసందర్భంగా ప్రస్తావించడమే కాకుండా, ఆ వ్యాసం ద్వారా తన శ్రేణులకు చర్చి పట్ల వ్యతిరేక సంకేతాలను ఉద్దేశ పూర్వకంగానే పంపుతోందని ఆయన అన్నారు. ఆర్గనైజర్ వెబ్‌సైట్‌లో ఉంచిన ఆ వ్యాసాన్ని ప్రస్తుతం తొల గించినప్పటికీ, సంఘ్ పరివార్ అసలు ఉద్దేశాలు స్పష్టంగా వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ యొక్క అసలైన ఆలోచనా ధోరణులకు ఆ వ్యాసం అద్దం పట్టిందని చెప్పారు. మెజార్టీ వాదం పేరుతో సంఘ్ పరివార్ మతోన్మాదాన్ని రెచ్చ గొడుతోందని, మైనార్టీ మతాలను లక్ష్యంగా చేసుకుంటోందని అన్నారు. క్రమంగా వారిని అణచివేయాలన్న విస్తృత కార్యాచరణలో భాగంగానే ఈ తరహా చర్యలు చోటుచేసుకుం టున్నా యని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వానికి సంకేతంగా ఉన్న భారతీయ సంస్కృతిపైనా, రాజ్యాంగంపైన సంఘ్ పరివార్ శక్తులు చేస్తున్న ఈ దాడులను ఎదుర్కొనేందుకు ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఐక్యంగా స్పందించాలని ఆయన కోరారు.

నిర్విరామంగా వాలంటీర్ల సేవలు

- మహాసభ కోసం జనవరి నుంచే రంగంలోకి..

ఇదొక గొప్పఅనుభూతి : వాలంటీర్ల ఇన్‌చార్జి ఏ.వీ.సింగార వేలన్

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి



ఎక్కడా ఎలాంటి అవాంతరాల్లేకుండా మహాసభ సజావుగా సాగటంలో వారి పాత్ర కీలకం. అధ్యక్షవర్గం నుంచి పరిశీలకుడి దాకా ఎవరికి ఏ అవసరమొచ్చినా క్షణాల్లో తీరుస్తూ ఏ చిన్న అసౌకర్యం కలగకుండా చూస్తూ ఆ కామ్రేడ్లు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ నిర్విరామంగా సేవలందిస్తూ 'శభాష్' అనిపించుకుంటున్నారు. వారే వాలంటీర్లు. తమిళనాడులోని మదురైలో సీపీఐ(ఎం) 24వ మహాసభ నిర్వహణ కోసం వీరు జనవరి నుంచే రంగంలోకి దిగారు. దాదాపు మూడు నెలలపాటు శ్రమించి... నిధుల సమీకరణ, ప్రచారం, గోడల మీద రాతలు తదితర కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేశారు. మహాసభ ప్రాంగణంలో సౌకర్యాలను కల్పించటం, వాటి నిర్వహణ, ప్రతినిధులకు స్వాగతం పలకటం, వారి బస, రవాణా, వివిధ ప్రదర్శనల ఏర్పాటు, వైద్య సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికల ఏర్పాట్లు తదితర పనులను 425 మంది వాలంటీర్లు తమ భుజాన వేసుకున్నారు. వీరిలో 50 మహిళా వాలంటీర్లు కూడా ఉన్నారు. తమిళనాడులోని అన్ని ప్రాంతాలకు చెందిన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ, ఐద్వా సంఘాల నుంచి చురకైన కార్యకర్తలను వాలంటీర్లుగా నియమించారు. వీరిలో సీఐటీయూకు చెందిన వంద మంది వాలంటీర్లు రవాణా సౌకర్యాల బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మరో వంద మంది వాలంటీర్లు మహాసభ ప్రాంగణం, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం బాధ్యతలను చూస్తున్నారు. ప్రతినిధులు రావటానికి వీలుగా కాన్ఫరెన్సు హాల్‌కు ఉన్న ఆరు గేట్లు, ఒక వీపీఐ గేటు దగ్గర మరికొంతమంది బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మరో వైపు ప్రతినిధుల సహాయార్థం ఇంగ్లీషు, హిందీ, తెలుగు, మళయాళం భాషలు తెలిసిన 30 మంది వాలంటీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. కాగా ఉదయం ప్రతినిధులు వచ్చేసరికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు వీలుగా ప్రతీరోజూ పది మంది వాలంటీర్లను రాత్రి విధుల్లో నియమించారు. రొటేషన్ పద్ధతిలో రోజుకో బృందం ఈ రకంగా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. మహాసభల కోసం పనిచేయటం తమకు గొప్ప అనుభూతిని మిగిల్చిందని వాలంటీర్ల ఇన్‌చార్జి ఏ.వీ. సింగార వేలన్ తెలిపారు. పార్టీ, ప్రజా సంఘాల సమన్వయంతో తాము ఈ పనులన్నింటినీ జయ ప్రదంగా చేపడుతున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

వ్యవసాయ మార్కెటింగ్ నేషనల్ ఫ్రేమ్‌వర్క్ పాలసీని ఉపసంహరించండి

సీపీఐ(ఎం) తీర్మానం

సీతారాం ఏచూరి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

వ్యవసాయ మార్కెటింగ్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నేషనల్ ఫ్రేమ్‌వర్క్ పాలసీని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు 24వ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కృష్ణప్రసాద్ ప్రవేశపెట్టగా, కేంద్ర కమిటీ సభ్యులు కరుమలయాన్ బలపరిచారు. 'పోరాడుతున్న రైతు ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా, కొత్తగా తీసుకువస్తున్న ఫ్రేమ్ వర్క్ పాలసీ రైతులపై కార్పొరేట్ దాడిని మరింత ఉధృతం చేసే ప్రయత్నం. దీనిని మహాసభ తీవ్రంగా ఖండిస్తోంది. రైతుల పోరాటాల కారణంగా రద్దైన వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన తీసుకువచ్చే కుట్ర ఇది. రైతులు ముందుకు తీసుకువచ్చిన ప్రధాన డిమాండ్లయిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణమాఫీ, సమగ్ర పంటల బీమా, వ్యవసాయంపై ప్రభుత్వ పెట్టుబడుల పెంపు, రుణ సౌకర్యాలు వంటివాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ఈ ముసాయిదా ను తీసుకువచ్చారు. రాజ్యాంగంలోని 246వ ఆర్టికల్ ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర అంశం అయినా కూడా కేంద్రం దీనిని తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరిస్తోందని తీర్మానం పేర్కొంది. ఇది ప్రభుత్వ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని, సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయాలని, చిన్న, మధ్యస్థ రైతులను ప్రయివేట్ వ్యాపార దోపిడీకి అప్పచెప్పాలని ప్రయత్నం చేస్తోంది.' అని తీర్మానం పేర్కొంది. 'ప్రయివేట్ హోల్‌సేల్ మార్కెట్ల ఏర్పాటు, కార్పొరేట్ సంస్థలు నేరుగా రైతుల నుంచి పొలాల దగ్గరే కొనుగోలు చేయడం , సంప్రదాయ మార్కెట్ యార్డులను కార్పొరేట్ గోదాములుగా మార్చడం రాష్ట్రవ్యాప్తంగా ఏకీకత మార్కెట్ ఫీజు, లైసెన్స్ విధానం తీసుకురావడం వంటివి నూతన ప్రతిపాదనల్లో ఉన్నాయని తీర్మానంలో పేర్కొన్నారు.

పంజాబ్‌లో లుధియానా, హర్యాణాలో సిర్సాలో ఇప్పటికే రిలయన్స్, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలు పెద్ద స్థాయిలో గోదాములు, ప్రయివేట్ రైలుట్రాకులు నిర్మించాయని, ఇది రైతులను కార్పొరేట్లకు అప్పజెప్పడమేనని తీర్మానంలో తెలిపారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, బ్రాండింగ్‌తో పాటు మిగతా ప్రక్రియలు చేసి ఎక్కువ లాభాలు పొందే వ్యూహం దీని వెనకు ఉందని, ఇది రైతులను వినియోగదారులను ఇద్దరినీ దోచుకునే విధానమేనని తెలిపారు. ఈ విధంగా వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన వల్ల రైతుల అప్పులు, ఆత్మహత్యలు పెరుగుతాయని, రైతాంగం మరింత పేదరికంలోకి నెట్టబడుతోందని తీర్మానం ఆవేదన వ్యక్తం చేసింది. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల కబ్జాకు వదిలిపెట్టడంతో పాటు, ప్రధాని మోడీ ప్రమోట్ చేస్తున్న కార్పొరేట్ సంస్థకు అప్పజెప్పే దుర్మార్గమైన వ్యూహం ఉందని, ఇది దేశంలో ఆహారకొరతకు దారి తీస్తుందని తీర్మానం వివరించింది. దీనిని వెనక్కి తీసుకునేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని రైతులకు సీపీఐ(ఎం) మహాసభ పిలుపునిచ్చింది.



నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం సాగిస్తే విజయం తథ్యం - విలియం షేక్స్‌పియర్



సంపాదకీయం

దేశానికి 'అనన్య' పాఠం!

ఈ దృశ్యం చూడగానే ప్రపంచ నరమేధ ఇజ్రాయిల్ గాజాపై సాగిస్తున్న భీకరబాంబుల వర్షం నుంచి తప్పించుకుని, శిథిలాల కింద పుస్తకాల బ్యాగును సంకన పెట్టుకుని, గాజాలో వీధుల వెంట పరుగెత్తిన చిన్నారి గుర్తుకొచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో తమ గుడిసె కాలుతుంటే ఓ బాలిక స్కూల్ బ్యాగును పట్టుకుని ఏడుస్తూ పరుగెత్తడం అందరి మనసుల్ని కలిచి వేసింది. ఈ వీడియో భారత అత్యున్నత న్యాయస్థానాన్ని కలవరపాటుకు గురిచేసింది. అంతకన్నా ముందు 'బుల్డోజర్' కూల్చివేతలపై యోగీ సర్కార్‌కు మొట్టికాయలు వేసింది. ఇక్కడే ఒక పసివాడని మనసు అనన్య దేశానికి ఒక పాఠం చెప్పింది! చట్టవ్యతిరేకమైన, రాజ్యాంగ విరుద్ధమైన బుల్డోజింగ్‌ను 'డబులింజన్‌సర్కార్' ఒక సంస్కృతిగా మార్చింది. దళితులు, ముస్లిం మైనార్టీల లక్ష్యంగా ప్రారంభమై 'బుల్డోజింగ్ జస్టిస్' పేరుతో పేదల ఇండ్లను కూల్చేస్తున్నది. ఈ కూల్చివేత పర్వం భావి భారత పౌరులుగా ఎదగాల్సిన చిన్నారుల హృదయాలకు ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నది పాలకులు గమనించకపోవడం శోచనీయం. దేశాన్ని ఏలే పెద్దమనుషులు మాట మాట్లాడితే 'బేటి బచావో..బేటి పడావో' అంటూ సాగించే ఉపన్యాసం ఈ చిన్నారి వేదనకు కారణం అన్వేషించగలదా? ఈ ఘటన నుంచి గుణపాఠం నేర్వగలదా?

ఆ ఎనిమిదేండ్ల బాలిక పేరు అనన్య. యూపీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నది. కూలీ పనులు చేసుకుని బతికే కుటుంబం. గతనెల 21న అంబేద్కర్‌నగర్‌లో ఇండ్ల కూల్చివేత వారిని నిలువ నీడ లేకుండా చేసింది. యాభై ఏండ్లుగా ఆక్రమణలో ఉంటున్న గుడిసె మంటల్లో కలిసింది. దీన్ని చూస్తున్న బాలిక తన పుస్తకాల సంచిని భద్రంగా పట్టుకుని పరుగులు పెట్టింది. స్కూలు నుండి వచ్చిన తర్వాత తమ గుడిసెను ఆనుకుని వున్న పశువుల పాకలో పుస్తకాల సంచి పెట్టింది. ఆక్రమణలో ఉన్నాయనే పేరుతో కొందరి ఇండ్లు కూలగొడుతుండగా మంటలు చెలరేగాయి. వారి గుడిసె కూడా నిప్పంటుకుంది. ఒక్కసారిగా తన పుస్తకాలు కాలిపోతాయేమోననే భయంతో చిన్నారి పరుగెత్తింది. తల్లి వారిం చినా వినలేదు. అవి కాలిపోతే మళ్లీ స్కూల్లో దొరకవని భయపడింది. ఆ చిన్నారి వీడియో వైరల్ అయ్యాక ఆమెతో చాలామంది మాట్లాడారు. 'కలెక్టర్ కావాలని..దేశాన్ని రక్షించాలని' చెప్పి దేశం మీద తన అభిమానాన్ని చాటింది.

అంతకన్నా ముందు సుప్రీంకోర్టు ప్రయాగ్‌రాజ్‌లో 2021లో బీజేపీ ప్రభుత్వం డెవలప్‌మెంట్ అథారిటీ ఆరు ఇండ్లను బుల్డోజర్లతో కూల్చి వేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. యూపీ గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్ హత్య తర్వాత అతని స్థిరాస్తుల్ని ప్రభుత్వం కూల్చివేసింది. 'అతిక్ ఇండ్లనుకుని పొరపాటు వేరేవారివి కూల్చామని' అధికారులు చెప్పారు. వాస్తవానికి ఇండ్ల కూల్చివేతల బాధితుల్లో ఓ లాయర్, ఓ ప్రొఫెసర్ కూడా ఉన్నారు. ప్రొఫెసర్, లాయర్, మరో ముగ్గురు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ కోర్టు వారి పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో వారు సుప్రీం గడపతొక్కాల్సి వచ్చింది. అనేక వాదనల తర్వాత మంగళవారం సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి మొట్టికాయలేసి తుదితీర్పును వెలువరించింది. 'ఈ తీరు మమ్మల్ని ఎంతో దిగ్భ్రాంతికి గురిచేసింది.ఈ కూల్చివేతలు పూర్తిగా అమానవీయం, చట్టవిరుద్ధం. ఎవరైనా ఆశ్రయం పొందేందుకు భారత రాజ్యాంగం హక్కు కల్పించింది. రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్‌లో అది స్పష్టంగా ఉందని డెవలప్‌మెంట్ అథారిటీ గుర్తుంచుకోవాలి.' అని పేర్కొంది. దీంతో పాటే 'మీరు కూల్చి వేసిన ఇంటి బయట ఓ చిన్నారి ఏడుస్తున్న వీడియో ఎంతో హృదయ విదార కంగా ఉంది. ఈ వీడియో చూసి ప్రజలు అనేక మంది కలత చెందారు.ఈ తరహా కూల్చివేతలను వెంటనే ఆపేయాలి. కూల్చివేతలు ఫ్యాషన్ కాకూడదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

అంతేకాదు, ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించే ప్రతీకార ధోరణికి స్వస్తి చెప్పాలని, అధికారులే న్యాయమూర్తుల పాత్ర పోషిం చటం సరైంది కాదని స్పష్టం చేసింది. అక్రమ నిర్మాణాల పట్ల వ్యవహరించాల్సిన విధి విధానాలను కూడా ప్రకటించి, అవి దేశం మొత్తానికి వర్తిస్తాయని చెప్పింది. అయినప్పటికీ పాలకులు పట్టించుకుంటే కదా! యోగి ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఇలా తలంటడం ఇదే మొదటిసారి కాదు, బుల్డోజింగ్ అన్యాయాన్ని తలకెత్తుకున్న ప్రతిసారీ మొట్టికాయలు వేస్తూనే ఉంది. అయినా, బుద్ధితెచ్చుకోని సర్కార్ అదే అనాగరిక ధోరణిని సాగిస్తున్నది. ఇది క్రమంగా బీజేపీ పాలిత రాష్ట్రాలన్నింటికీ పాకించింది. దేశంలో ముస్లింల ఇండ్లను కూలగొట్టడం ప్రారంభించి, ఆ తర్వాత ప్రభుత్వ వ్యతిరేక కార్యక్ర మాలు, నిరసనల్లో పాల్గొన్న సామాన్యుల ఇండ్లను నేలమట్టం చేస్తూ వచ్చింది. మొన్నిమధ్య మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ 'మీ ఇంటి మీదకు బుల్డోజర్లను పంపిస్తాం' అన్నాడు. ఈ వ్యాఖ్యల్ని పరిశీలిస్తే అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని చట్టాలను వారి చుట్టంగా భావిస్తున్నా రన్నమాట! ఇలా.. మతం మాటున జరుగుతున్న కూల్చివేతలపై దేశంలో ఇంకా పెద్ద ఎత్తున చర్చ జరగాలి. ఉత్తరప్రదేశ్‌లో జరిగింది ఘటనగా కా కుండా, దేశానికి పొం చిన ముప్పుగా పరిగణించాలి. అనన్య లాంటి చిన్నారికి జరిగిన 'భావోద్వేగ గాయం' మరెవరికి జరగకుండా బాసటగా నిలవాలి.

వక్ఫ్‌బిల్ టు నాగపూర్.. వివాదాల పరివార్!



తెలకపల్లి రవి

ప్రధాని నరేంద్ర మోడీ ఈ పదవి చేపట్టిన తర్వాత పదకొండేండ్లకు మార్చి 30న నాగపూర్‌లోని ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించటం జాతీయ స్థాయిలో కచ్చితమైన రాజకీయ సంకేతాలిచ్చింది. ఔరంగజేబు సమాధికి సంబంధించిన నాగపూర్‌లో అల్లర్లు జరగటం, పార్లమెంట్లో వక్ఫ్‌బిల్లు ఆమోదం, కాశీ మథురల్లో మసీదు మందిర వివాదాల్లో ఆరెస్సెస్ కార్యకర్తలు పాల్గొనవచ్చునని దాని కీలక ద్వితీయ నాయకుడైన దత్తాత్రేయ హోసబులే కాషాయ జెండా ఊపడం ఒక వరసలోవే. త్వరలో జరిగే బీహార్, యూపీ, గుజరాత్, బెంగాల్, కేరళ ఎన్నికలకు ముందు బీజేపీ సంఘ పరివార్ హిందుత్వ ఎజెండాను ఉధృతం చేయబోతున్న సూచనలే.

పార్లమెంట్‌లో వక్ఫ్‌బిల్లు మీద జరిగిన హోరాహోరీ పోరాటం ఒక విషయాన్ని స్పష్టం చేసింది రాజ్యాంగం 25 నుంచి 28 అధికరణాల వరకు మత స్వేచ్ఛకు ఇస్తున్న ప్రాథమిక హక్కులపై దాడిగా ప్రతిపక్షాలు ఈ బిల్లును ఎదుర్కొన్నాయి. అయితే హోంమంత్రి అమిత్ షా, బిల్లును ప్రతిపాదించిన న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు మాత్రం ఇదేదో పేద ముస్లింలకు మేలు చేయడానికి తెచ్చినట్టు గొప్పలు పోయారు. కానీ వారి భాష, ఇచ్చిన ఉదాహరణలు చూస్తే రాజకీయ కోణం స్పష్టమవుతుంది. 'ఈ పార్లమెంటు భవనం కూడా వర్క్ వక్ఫ్ కిందకే వస్తుందని వారు వాదిస్తారని' రిజుజు ముస్లింలను ఉద్దేశించి అన్నారు. చర్చను కాంగ్రెస్ వైపు మళ్లించి 2014 ఎన్నికలకు ముందు ఆ పార్టీ వేలాది ఆస్తులను కట్టబెట్టిందని ఆరోపించారు. దేశ ఆస్తులను ముస్లింలకు అప్పగించడం జరుగుతోందన్న దురాభిప్రాయాన్ని కలిగించి మతాల స్పర్ధగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తున్న అస్త్రమే ఈ చట్ట సవరణ. ముస్లింలు, క్రైస్తవులు, హిందువులు ఎవరైనా భారతీయులైనన్న రాజ్యాంగ స్పృహను దెబ్బ తీసేలా ముస్లిం సంస్థల ఆస్తులు వశపరచుకోవటం పెద్ద విజయంలాగా చూపించటం ఎన్నికల లబ్ధి కోసమే. వక్ఫ్ బోర్డులోని 22 మంది సభ్యులలో నలుగురు ముస్లి మేతరులు ఉండాలని నిర్ణయించటం నిస్సందేహంగా వారి మత భావాలను దెబ్బతీసే అంశం అవుతుంది. ఒకవైపున తిరుపతిలో అన్యమత ఉద్యోగులను కూడా తొలగించాలంటున్న తీరుకు ఇది పూర్తి విరుద్ధం. దేవాలయాలను పూర్తిగా మత సంస్థలకు అప్పగించాలంటూ ఇటీవల విజయవాడలోనే భారీ సమీకరణ జరపటం కూడా చూశాం. రాజ్యాంగం మైనారిటీ మతాలకు ప్రత్యేక రక్షణ కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థ బాధ్యత గుర్తించడం, దేశ సమైక్యతను కాపాడుకోవడం కోసమే. కులమత లింగ వివక్ష లేకుండా పౌరులందరూ ఒకే హక్కులు కలిగి ఉండటం, ప్రజాస్వామ్యం కనుక రక్షణలు ఎప్పుడు తక్కువ సంఖ్యలో ఉన్న వారికే కల్పించబడతాయి. భారతదేశంలో హిందూ ముస్లిం ఐక్యత సామరస్యం భవిష్యత్తు భద్రతకు అత్యవసరమని అరక్షణమైన మర్చిపోకూడదు.

వక్ఫ్‌పై కేంద్రం భాష

2019లో బీజేపీ రెండోసారి అధికారంలోకి రాగానే కాశ్మీర్ 370 అధికరణం రద్దుకు పాల్పడటం వెనుక ఏ వ్యూహం ఉందో మూడోసారి నెగ్గాక వక్ఫ్‌మీద దాడి కేంద్రీకరించటం వెనకా అదే ఉంది. ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీలు మాత్రమే కాక రెండు లౌకిక పక్షాలు కూడా దాన్ని బలపరచటం దురదృష్టకరం. తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా వైసీపీ, అలాగే బీఆర్ఎస్ ఈ బిల్లుపై బీజేపీకి వ్యతిరేకంగా ఓటు చేయడం విశేషం. బిల్లు ఆమోదం పొందాక 'ఇది చారిత్రక మూలమలుపు'అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా అచ్చంగా అలాంటి ప్రకటన విడుదల చేయడం యాదృచ్ఛికం కాదు. తెలుగుదేశం పార్టీ తాము ఏవో సూచనలు చేశామంటూ కొన్ని సంకేతాలివ్వడానికి ప్రయత్నించినా వారి భేషరతుగా మద్దతు ఇవ్వడమే దేశం గుర్తించింది. దక్షిణాది సీట్ల తగ్గింపు, ఈ బిల్లు రెండు విషయాల్లో వ్యవహరించిన దాన్నిబట్టి టీడీపీ అధినేత చంద్రబాబు మోడీని ఏ మాత్రం వ్యతిరేకించరాదని నిర్ణయించుకున్నట్టు 'హిందూ' ప్రత్యేక వ్యాసమే ప్రచురించింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో వుంది గనక బీజేపీ కన్నా దాన్నే ఎదుర్కోవటం కీలకమని భావిస్తున్న బీఆర్ఎస్ కూడా ఈ బిల్లు విషయంలో మాత్రం వ్యతిరేకించి ఓటేయడం మంచి విషయమే. ఇటీవల తిరుపతిలో జరిగిన పరి ణామాలు, ఇప్పుడు పాస్టర్ ప్రవీణ్ మరణంపై సాగుతున్న వివాదం విద్వేషపూరిత వ్యాఖ్యలన్నీ గమనిస్తే చాప కింద నీరులా తెలుగు రాష్ట్రాల్లోనూ మత రాజకీయాలు చొరబడుతున్న తీరు తీరు కళ్లకు కడుతుంది. ఇక్కడ బీజేపీ పెద్ద శక్తి కాకపోయినా వామపక్షాలు ఎక్కువ కేంద్రీకరిస్తున్నాయంటూ మాట్లాడే వాళ్లకు ఈ పరిణామాలే హెచ్చరికలవుతాయి. వక్ఫ్ బిల్లును గజెట్ అయ్యాక సుప్రీంకోర్టులో సవాలు చేస్తామంటున్న



పార్లమెంట్లో వక్ఫ్‌బిల్లు మీద జరిగిన హోరాహోరీ పోరాటం ఒక విషయాన్ని స్పష్టం చేసింది. రాజ్యాంగం 25 నుంచి 28 అధికరణాల వరకు మత స్వేచ్ఛకు ఇస్తున్న ప్రాథమిక హక్కులపై దాడిగా ప్రతిపక్షాలు ఈ బిల్లును ఎదుర్కొన్నాయి. అయితే హోంమంత్రి అమిత్ షా, బిల్లును ప్రతిపాదించిన న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు మాత్రం ఇదేదో పేద ముస్లింలకు మేలు చేయడానికి తెచ్చినట్టు గొప్పలు పోయారు కానీ వారి భాష, ఇచ్చిన ఉదాహరణలు చూస్తే రాజకీయ కోణం స్పష్టమవుతుంది. 'ఈ పార్లమెంటు భవనం కూడా వర్క్ వక్ఫ్ కిందకే వస్తుందని వారు వాదిస్తారని' రిజుజు ముస్లింలను ఉద్దేశించి అన్నారు. చర్చను కాంగ్రెస్ వైపు మళ్లించి 2014 ఎన్ని కలకు ముందు ఆ పార్టీ వేలాది ఆస్తులను కట్టబెట్టిందని ఆరోపించారు. దేశ ఆస్తులను ముస్లింలకు అప్పగించడం జరుగుతోందన్న దురాభిప్రాయాన్ని కలిగించి మతాల స్పర్ధగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తున్న అస్త్రమే ఈ చట్ట సవరణ.

మోడీ పర్యటన విషయానికొస్తే ఆయన నాగపూర్‌లో మాధవ నేత్రాలయను ప్రారంభించటంతో పాటు ఆరెస్సెస్ మూల స్తంభాలైన హెగ్డేవార్, గోల్వాల్కర్‌ల స్మృతి చిహ్నాలను సందర్శించటం, వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్న కార్యక్రమాలే. గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి మాత్రమే వాటిని సందర్శించిన ప్రధానమంత్రి. ఆరెస్సెస్ ప్రచారక్‌గా బయలుదేరిన నేత అయినప్పటికీ నరేంద్ర మోడీ కూడా ఈ పదకొండేండ్లలో అక్కడికి వెళ్లిన దాఖలాలు లేవు. ఆయన వ్యక్తిగత నాయకత్వ శైలి సంఘపరివార్ పెద్దలకు నచ్చలేదని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. కానీ అదంతా పరివార్ పాచిక మాత్రమే. ఆరెస్సెస్ సాంస్కృతిక సంస్థ మాత్రమేనని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలతో సం బంధం లేదనే భ్రమను కొనసాగించే ఎత్తుగడ అది. మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన మంత్రివర్గం మొత్తం శాఖల వారీగా ఆరెస్సెస్ ముందు సమీక్షకు హాజరైంది.

నేపథ్యం ఒకవైపుంటే, అటు నుంచి మతపరమైన స్పందనలు ఎలా ఉంటాయో కూడా చూడాల్సిందే.

నాగపూర్ నాటకాలు

మోడీ పర్యటన విషయానికి వస్తే ఆయన నాగపూర్‌లో మాధవ నేత్రాలయను ప్రారంభించటంతో పాటు ఆరెస్సెస్ మూల స్తంభాలైన హెగ్డేవార్,గోల్వాల్కర్‌ల స్మృతి చిహ్నాలను సందర్శించటం, వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్న కార్యక్రమాలే గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి మాత్రమే వాటిని సందర్శించిన ప్రధానమంత్రి.ఆరెస్సెస్ ప్రచారక్‌గా బయలుదేరిన నేత అయినప్పటికీ నరేంద్ర మోడీ కూడా ఈ 11 ఏళ్లలో అక్కడికి వెళ్లిన దాఖలాలు అసలు లేవు. ఆయన వ్యక్తిగత నాయకత్వ శైలి సంఘపరివార్ పెద్దలకు నచ్చలేదని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి కానీ అదంతా పరివార్ పాచిక మాత్రమే. ఆరెస్సెస్ సాంస్కృతిక సంస్థ మాత్రమేనని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలతో సంబంధం లేదనే భ్రమను కొనసాగించే ఎత్తుగడ అది. మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన మంత్రివర్గం మొత్తం శాఖల వారీగా ఆరెస్సెస్ ముందు సమీక్షకు హాజరైంది.

గతేడాది అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవ సంప్రోక్షణ కార్యక్రమానికి మోడీ తోపాటు ప్రస్తుత ఆరెస్సెస్ సద్నేత మోహన్ భగవత్ కూడా హాజరయ్యారని గుర్తుంచుకోవాలి.2024 ఎన్నికలకు ముందు దేశానికి హిందూత్వ సంకేతం ఇవ్వడం కోసమే వారి వారి కాంబినేషన్ అక్కడ అవసరమైంది. అయితే ఎన్నికలకు ముందు ఒక ఇంటర్వ్యూలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ 'గతంలో బీజేపీకి తగినంత బలంలేదు కనుక ఆరెస్సెస్ సహకారం తీసుకునేవారుమనీ, ఇప్పుడు సొంతశక్తితో ఎదిగాము కనుక ఆ అవసరం లేదని' వ్యాఖ్యానించారు. తాను ఏదో దైవకార్యం నిర్వహించడానికి పంపబడినట్టు అనిపిస్తుందని, సాధారణ జీవపదార్థంతో ఉన్నట్టు అనుకోనని చెప్పారు. ఈ రెండు ప్రకటనలు ఆరెస్సెస్ వారికి నచ్చలేదనీ కథనాలు నడిచాయి.మొన్నటి ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కోల్పోయి 243 స్థానాలకు పరిమితమైనాక మోహన్ భగవత్ ఇంటర్వ్యూ ఇస్తూ ఎవరికైనా అహంభావం తగదని వ్యాఖ్యానించారు. తాము సేవకులమనే భావన నుంచి దైవ స్వరూపులమని అహంకరించడం ప్రారంభించిన వ్పుడు దెబ్బతింటారని అన్నారు. మామూలుగానే ఆరెస్సెస్ అధినేత కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తమ కేంద్ర కార్యాలయం నుంచి సూక్తులు, సుశబ్దాలు వినిపిస్తుంటారు. ఇవి ఎవరిని ఉద్దేశించినవి అన్నది స్పష్టం చేయరు. భగవత్ మాటలు మోడీపై అభిశంసనలాంటివేనని బడా మీడియా కథనాలు మొదలు పెట్టింది. నిజంగా చెప్పాలంటే సనాతన సంప్రదాయంలోనూ రాజును దైవ ప్రతినిధిగా మొదట చెప్పి ,తర్వాత నేరుగా దేవుడు గానే అభివర్ణించడం చూస్తాం. ఇదంతా ఒక రాజ్యాధిపత్యం వ్యూహం ప్రకారమే జరిగింది. అటు రాజ్యం ఇటు మతం కూడా రాజు చేతుల్లోనే ఉండటానికి అది మార్గం. కాకపోతే మతాధిపతులు సంధాన కర్తలుగా రాజ్య వ్యవస్థకు అనుగుణంగానే తమ పాత్ర నిర్వహించేవారు. ఇప్పుడు ఇప్పుడు మోడీ భగవత్‌ల సంభాషణ అచ్చంగా అదే చెపుతుంది. సంబంధం ఉందని లేదని రకరకాలుగా చెప్పడం నిరంతర తతంగమే. ప్రస్తుత పర్యటనలో కూడా మోడీ ఆరెస్సెస్ తమను ఎంతగా ఉత్తేజపరిచిందో సూటిగా చెప్పారు. ఇది సంస్థతో రాజీ వంటిదని కొ ందరు ఇస్తున్న వివరణ అర్థం లేనిది. ఎందుకంటే అసలు అవి ఎప్పుడు దూరంగా ఉన్నాయి?ఒకప్పుడు వాజపేయినే ఈ మాట అన్నారు- మేము విడిపోయిందెప్పుడు అని. వారి మధ్య ఈ అలుక కినుక దూరం రాయబారం కథలన్నీ ఒక క్రీడలో భాగం. మొన్న మెజార్టి రాలేదుగనక మోడీని మార్చాలని ఆరెస్సెస్ భావిస్తున్నందునే ఆయన సర్దుబాటు కోసం వచ్చారని శివసేన ఎంపి సంజయ్ రౌత్ అంటే నాలుగోసారి కూడా ఆయనే ప్రధాని అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రకటించడం అందులో భాగమే. ఆరెస్సెస్ కార్యకలాపాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడాన్ని అనుమతిస్తూ ప్రభుత్వం కొంతకాలం కిందటే ఉత్తర్వులు జారీ చేసింది. ఒక హైకోర్టు న్యాయమూర్తి దానిపై నిషేధం చెల్లదని ప్రకటించడాన్ని అవకాశంగా తీసుకుని మోడీ సర్కార్ దాన్ని ఎత్తివేసింది.ఇప్పుడు అధికారికంగానే ఆరెస్సెస్‌తో చట్టపటాలు వేసుకొని తిరిగే అవకాశం తనకు తానే ఇచ్చుకుంది.

వాటినీ రగిలిస్తాం!!

ఇక హోసబులే ప్రకటనను బట్టి సంఘపరివార్ కాశి మధుర వివాదాలను ఎగదోయాలని నిర్ణయించుకున్నట్టు చాలా స్పష్టంగా అర్థమవుతుంది.స్థానిక భక్తులు లేదా విభిన్న పక్షాలకు పరిమితమైన ఈ తగాదాలు ఇప్పుడు అధికారికంగా పాలక పరివార్ స్వీకరిస్తుందన్నమాట.గతంలో మోహన్ భగవత్ ప్రతి మసీదును తవ్వడం మన పని కాదని సూక్తులు చెప్పినప్పుడే ఆంతర్యం ఇదేనని మనం చెప్పుకున్నాం. అయోధ్య, కాశీ, మధుర మూడు చోట్ల వివాదాలపై ఉద్యమించాలని తాము గతంలోనే అధికారికంగా నిర్ణయించామని హోసబులే గుర్తు చేస్తున్నారు. ఈ మూడు మాకిస్తే మిగిలిన విభాగాలను పక్కన పెడతామని ఎల్ కె అద్వానీ ఒక దశలో ప్రతిపాదన పెట్టడం కూడా గుర్తు చేసుకోవాలి. 1991 ప్రార్థన స్థలాలు చట్టం ప్రకారం అయోధ్య మినహా మరి ఎక్కడ ఇలాంటి వివాదాలకు ఆస్కారం ఉండకూడదు. 1947 ఆగస్టు15న ఆయా ప్రార్థన స్థలాల్లో ఉన్న యథాతథ స్థితిని కొనసాగించవలసి ఉంటుందని ఆ చట్టం స్పష్టం చేస్తోంది. అయినా సుప్రీంకోర్టు ఇలాంటి పిటిషన్లను విచారణకు స్వీకరించి వివాదాలకు అవకాశం ఇస్తుంది. ప్రతి చోటా తగాదాలు రగిలించబడతాయి. ఇదేదో జాతీయ సమస్య తప్ప దక్షిణాన అందులో తెలుగు రాష్ట్రాల్లో అసలు ఆ పరిస్థితి లేదని చెప్పడానికి ఇప్పుడు ఎవరు సాహసించ బోరు. ఎందుకంటే ఆలయాల వివాదాలు మతమార్పిడులు వీటిని కీలకంగా మాట్లాడే సనాతన వాద నేతగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చారు. తమిళనాడులో అన్నాడీఎంకే మళ్లీ బీజేపీతో చర్చలు ప్రారంభించడం పవన్ కళ్యాణ్ తమిళంలో మాట్లాడుతూ ఇంటర్వ్యూలిస్తూ అక్కడ కూడా రాజకీయంగా రంగ ప్రవేశం చేస్తుండడం విస్మరించలేము.మీ కన్నా మేమే సనాతన ధర్మానికి ఎక్కువగా కట్టుబడి ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కూడా ఒక ప్రకటన చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై సందేహాలు సంవాదాలను కేవలం వైసీపీ, టీడీపీ తగాదాగా, ఘర్షణగా చూపించే ప్రయత్నాలు కూడా తీవ్రంగా జరుగుతున్నాయి ఇక తెలంగాణలో రాజాసింగ్ వంటి వారు బీజేపీకి దూరంగా ఉన్నట్టు మాట్లాడుతూనే ప్రతి సందర్భంలో మతాలు మధ్య చిచ్చు రాజేస్తున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ వివాదాలకు పేరు మోశారు. వక్ఫ్‌నుంచి టీటీడీ వ్యవహారాల వరకూ ప్రతిదీ వివాదాస్పదమై మత రాజకీయాలను మన ముంగిట్లోకి తెచ్చి నిలబెడుతున్నదని గుర్తించటం, అప్రమత్తం కావడం తప్పనిసరి. ■

నేను అడవితల్లిని...





జంధ్యాల రఘుబాబు
9849753298

'ఇక్కడేదో అడవిలాగుందే, పోతూ పోతూ ఉంటే చెట్లు ఎక్కువవుతున్నాయి. ఎప్పుడూ చూడలేదే ఈ ప్రదేశం, చూద్దాం..లోపల ఏముందో..' అనుకుంటూ సాగుతున్నాడు కిషన్. 'అరే ఏదో జంతువుల శబ్దాలు కూడా వినిపిస్తున్నాయి' అని చుట్టూతా చూశాడు. తన దోస్తులు యాద్‌గిరిని, దస్తగిరిని కూడా పిలుచుకొచ్చింటే ఇంకా బాగుండేది అనుకున్నాడు లోపల. పోనుపోను అందంగా కనిపిస్తోంది, భయమూ వేస్తోంది, అందుకే మిత్రులు గుర్తొచ్చినట్టున్నారు.

నిజంగా మస్తుగా ఉంది వాతావరణం, ఇంత ఎండకాలంలో కూడా చల్లగా ఉందిక్కడ అని పొరపాటున బయటికే అనేశాడు. ఇంతలో

"అవును" అన్న శబ్దం వినిపించింది. చుట్టూ చూశాడు. ఎవ్వరూ లేరు.

"నేను అడవిని మాట్లాడుతున్నా" అంటూ మళ్లీ మాటలు.

"వామ్మో నేను నిజంగా అడవిలోకే వచ్చినట్టున్నానే" అన్నాడు.

"నిజమే నీవు అడవికే వచ్చావు మానవా" అని అడవి పలికింది.

"నీకు మాటలు కూడా వచ్చా"

"వినాలే కాని ఎన్నో మాట్లాడతాను మానవా"

"సరే కాని ఇంతకుముందెప్పుడూ నీ గొంతు వినపడలేదే, నాకేమైనా కల పడిందా అన్న అనుమానమొస్తోంది"

"కల కాదు కిషన్, నిజమే ఇది"

"నా పేరు....?"

"నీ పేరే కాదు ఈ భూమిపై ఉన్న అందరి పేర్లూ తెలుసు నాకు"

"ఐతే నా దోస్తుల పేర్లు చెప్పు?"

"యాద్‌గిరి, నర్సింగ్, దస్తగిరి, దామోదర్ ......" అలా ఎన్నో పేర్లు చెప్పింది అడవి

"వామ్మో నీవు మామూలు దానివి కాదు!"

"అదేమో కాని మీరు మామూలుకంటే కూడా ఇంకా దిగజారిపోయారు"

"మేమా"

"మీరు అంటే మానవులు అని అర్థం"

"బతికించావు, అందరిలోకే నన్నుకూడా కలిపావనుకున్నాను"

"కలిపే చెబుతున్నాను"

"????"

"మంచివాళ్లయినా ప్రశ్నించకుంటే నేను చెప్పిన మానవుల్లోకి కలిపేస్తానంతే"

ఇంతలో అటుగా నెమళ్ళు, జింకలు దౌడ్ తీశాయి.

"ఇప్పుడైనా నమ్ముతవా, ఇది అడవి అని ఇంకా ఏమైనా సాక్ష్యం కావాలా?"

"అడవే, నేను ఒప్పుకుంటున్నాను కాని నాది ఒక అనుమానం"

"ఏమిటది"

"ఇన్ని అడవులు కొట్టేస్తున్నారే మానవులు, నీకు బాధగా లేదా"

"హ్హ .. హ్హ. హ్హ" అంటూ నవ్వింది అడవి

"ఏమిటమ్మా అలా నవ్వుతున్నావు, బాధగా లేదా"

"బాధగా ఉండాల్సింది నాకు కాదు, మీకు కిషన్ మానవా. అడవులు నాశనమైతే జంతుజాలం తగ్గిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, అకాల వర్షాలు, ఎండాకాలంలో విపరీతమైన ఎండలు, వడగాడ్పులు, సునామీలు ఒకటేమిటి మీరు అడవులను నరికేసి సంపాదించుకున్న ఆస్తులన్నీ నాశనమైపోతాయి. నీకు అర్థమైందా ఇప్పుడు ఎవరు నవ్వాలో ఎవరు ఏడ్వాలో?"

"అవునమ్మో నీవు చెప్పింది అక్షరాలా నిజం"

"అసలు అడవిలో కోతినుండి మెల్లగా మైదానాలకు పోయి నా ముద్దు బిడ్డడు డార్విన్ చెప్పినట్టు మనుషులుగా మారారే, కన్నతల్లినే మరచిపోతారా, మానవత్వం లేని మనుషులే మిగిలారా"

"మేమేమీ మరవలేదమ్మా, నేనసలు జింకలు, నెమళ్ల కనిపిస్తున్నాయంటే అదేపనిగా వచ్చాను, పర్యావరణ ప్రేమికులు మా మానవుల్లో కూడా చాలామంది ఉన్నారు"

సురుకు

"సెహభాష్ కిషన్ మానవా, మీరైనా కష్టపడి ఈ భూమితల్లిని కాపాడుకొండి, అందుకు అడవులను కాపాడుకోవడం చాలా చాలా ముఖ్యం.

"దీన్ని కూడా రాజకీయం చేసి మావోళ్ళు తాము పండగ చేసుకుంటున్నారు అడవితల్లీ. తాము ఉన్నప్పుడు ప్రాజెక్టులకని, రోడ్లకని చెట్లు కొట్టేసినోళ్లే ఇప్పుడు పర్యావరణ సంరక్షకుల్లా మాట్లాడుతున్నారు"

"వాళ్లు చేయాలనుకున్నది పర్యావరణ పరిరక్షణ కాదు, తమ రాజకీయ పరిరక్షణ అని నాకెప్పుడో అర్థమయింది. పర్యావరణానికై అరుంధతీరాయ్ లాంటి వాళ్లు ఉద్యమాలు చేస్తూనే ఉన్నా సామాన్య ప్రజలు ఒక జట్టుగా దిగితే కాని నన్ను, పర్యావరణాన్ని రక్షించలేరు. గంగా నదిలో శవాల గురించి కాకుండా ఇతర విషయాలను దేశభక్తులు మాట్లాడుతున్నారు. నీకవన్నీ ఎరుకేకద కిషనా"

"అవునమ్మా కెనడాలో ఒక్కో మనిషికి తెమ్మిదివేల చెట్లు, రష్యాలో నాలగువేల ఐదువందలు, ఆస్ట్రేలియాలో మూడు వేలపైన, బ్రెజిల్లో ఒక వేయి ఐదువందలు, అమెరికాలో ఏడువందలపైన ఇలా ఉంది పరిస్థితి. మనదేశంలో మనిషికి ఇరవై ఎనిమిది చెట్లే ఉన్నాయమ్మా. ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, ప్రజలు అందరూ కదిలి చెట్లు పెంచితే మనం కెనెడాను కూడా దాటచ్చు అంత స్థలముంది"

"స్థలాల కోసం, రాష్ట్రాల్లో అధికారాల కోసం నిత్యం పోట్లాడుకునే మీనాయకులకు అంత తెలివి ఉందంటావా?"

"అవునమ్మా అనుమానమే!!??"

"పొలాల్లోకి ఏనుగులు రావడం మామూలే, ఈమధ్య ఇంట్లోకి, వీధుల్లోకి సింహాలు, పులులు కూడా వస్తున్నాయి. ఎందుకిదంతా. వాటికున్న అడవి వాటికుంటే అవెందుకొస్తాయి చెప్పు?"

"బాగా చెప్పావు అడవి తల్లీ, బుద్ధొచ్చింది"

"బుద్ధి రావలసింది అందరికీ, పాలకులతో సహా, వాళ్లు ఏ పార్టీ వాళ్లయినా సరే"

"అవును అడవి తల్లీ, ఈమాట వంద శాతం నిజం"

"అసలు భూమంటూ ఒకటుంటే కద మనుషులుండేది. మనుషులుంటేనే కద ప్రభుత్వాలు ఉండేది. ఈ చెట్లు, తరువాత నీళ్లు భూమి మీద లేకుండా పోతే మనుషుల మనుగడే ప్రశ్నార్థకమై పోతుంది. అందుకే కళ్లు తెరవండి".

"బాధగా ఉండాల్సింది నాకు కాదు, మీకు కిషన్ మానవా. అడవులు నాశనమైతే జంతుజాలం తగ్గిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, అకాల వర్షాలు, ఎండాకాలంలో విపరీతమైన ఎండలు, వడగాడ్పులు, సునామీలు ఒకటేమిటి మీరు అడవులను నరికేసి సంపాదించుకున్న ఆస్తులన్నీ నాశనమైపోతాయి. నీకు అర్థమైందా ఇప్పుడు ఎవరు నవ్వాలో ఎవరు ఏడ్వాలో?"
"అవునమ్మో, నీవు చెప్పింది అక్షరాలా నిజం"

రిపోర్టర్స్ డైరీ

అక్బరుద్దీన్ చెప్పిన సత్యం!

హైదరాబాద్ అంటే ముందుగా గుర్చొచేది చార్మినార్. ఆ తర్వాత ఎన్నో చారిత్రాత్మక కట్టాలు. వీటితోపాటు హైటెకొసిటీ. వీటిని చేసేందుకు దేశ, విదేశాల నుంచి పర్యటక ప్రేమికులు వస్తుంటారు. పోతుంటారు. అటువంటి పర్యటకులకు హైదరాబాద్ అనగానే మరొకటి గుర్తొస్తుంటుంది. వామ్మో హైదరాబాద్ ట్రాఫిక్ అని గుండెలు బాదు కుంటారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఆయా ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలకు నగరానికి వస్తున్న నేపథ్యంలో పట్టణీకరణ కూడా పెరుగుతున్నది. అందుకే ట్రాఫిక్ సమస్య పెను సవాల్‌గా మారింది. మొన్నటికి మొన్న పెద్ద వాన పడితే దాదాపు మూడున్నర గంటలపాటు ట్రాఫిక్ జామ్‌తో జనం అల్లాడిపోయారు.ఇలాంటి పరిస్థితిని రోజు గమనిస్తున్న ఎంఐఎం నేత, చంద్రాయన్‌గుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఇటీవల అసెంబ్లీలో ఓ సత్యం చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల వైఫల్యం ఉందని ఘంటా పదంగా చెప్పుకొచ్చారు. ఎక్కడైతే ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారో అక్కడ ట్రాఫిక్ నియంత్రణ బాగా జరుగుతుందని చెప్పారు. ఎక్కడైతే సెల్‌ఫోన్లో నిమగ్నమై ఉంటున్నారో అక్కడ ప్రయాణికులు హద్దులు దాటు తున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా సీసీ కెమెరాలను నమ్ముకుని తమ డ్యూటీలను మరచిపోతున్నారు. సెల్‌ఫోన్లో వీడియోలు చూస్తూ...కూర్చొంటున్నారని హాట్ కామెంట్ చేశారు. ఎందుకంటే ప్రతి చౌరస్తా పోలీసుల కంట్రోల్‌లో ఉంటే అక్కడ ప్రమాదాలు తక్కువగా ఉన్నాయి. ట్రాఫిక్ జామ్‌లు కావు. స్పీడ్ రైడర్స్ కూడా ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉంటారు. ప్రతిఒక్క ప్రయాణికుడి మనోగతం కూడా అదే.

-గుడిగ రఘు

గోషామహల్ గోడు

బీజేపీలో గోషామహల్ గోడు వినిపిస్తున్నది. ఎక్కడ చెడితో తెలియదు కానీ ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ మాత్రం 'తగ్గేదెలే లే' అన్నట్టు సొంత పార్టీ నేతలపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఆ పార్టీ నేతలపై హాట్ కామెంట్లు చేస్తున్నారు. దీంతో ఆయనకు సొంత పార్టీలో దారులు మూసుకుపోతున్నాయనే చర్చ జరుగుతున్నది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజాసింగ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అయినా సరే బీజేపీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయడం లేదు. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయకుండా నేనేందుకు పోతా అన్నట్టు ఆయన వ్యవహరిస్తున్నారు. అన్ని దారులను మూసివేస్తే ఆయనే ఏదో దారి వెత్కుకుని పోతారనే ఉద్దేశంతో పార్టీ నేతలు ఉన్నారు. కానీ ఆయన బయట ఉండి నేతల తీరును ఎండగడుతున్నారు. ఆ పార్టీలో ఎప్పటివరకు ఈ పరిస్థితులు ఉంటాయో తెలియదు. ఇంకా ఎన్ని మాటలు వినాల్సి వస్తుందో తెలియదు. అయితే ఆయన రాజకీయ ప్రస్థానం టీడీపీలో మొదలైంది. టీడీపీ, బీజేపీ పార్టీల్లో ఆయన కార్పొరేటర్‌గా గెలిచారు. ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఆయన మనస్త త్వానికి అనుకూలంగాఉన్న బీజేపీలో ఆయనకు ప్రతికూల పరిస్థితులు ఉన్నాయి.ఆయన ఇతర పార్టీల్లోకి పోతారా? లేదా అనేది చూడాల్సిందే.

- ఎస్.వెంకన్న

మాంద్యానికి ట్రంప్ ఆజ్యం

- సంక్షోభానికి 60 శాతం అవకాశం
- యూఎస్‌లో ఉద్యోగాలుండవ్
- జెపి మోర్గాన్ అంచనా





వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించనున్నారని అంతర్జాతీయ సంస్థలు గగ్గోలు పెడుతోన్నాయి. వాణిజ్య యుద్ధానికి తెర లేపి ఇప్పటికే స్టాక్ మార్కెట్లను కుప్పకులేలా చేసిన ట్రంప్ విధానాలు మరిన్ని ప్రమాదాలను సృష్టించనుందని హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది చివరి నాటికి ఆర్థిక మాంద్యం చుట్టుముట్టనుందని భావిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ చర్యలు ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యంలోకి నెట్టబోతున్నాయని దిగ్గజ బహుళజాతి ఆర్థిక సేవల సంస్థ జెపి మోర్గాన్ విశ్లేషించింది. ట్రంప్ చర్యల వల్ల అమెరికాలో మాంద్యం వచ్చే అవకాశం 60 శాతానికి చేరుకుందని అంచనా వేసింది. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది చివరి నాటికి మాంద్యంలోకి ప్రవేశించే అవకాశం ఉందని విశ్లేషించింది. సంక్షోభం రావడానికి గతంలో 40 శాతం అవకాశాలుండగా.. ఇది ఇప్పుడు 60 శాతానికి చేరిందని పేర్కొంది.

యూఎస్ వాణిజ్య యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అతిపెద్ద ప్రమాదంగా మారిందని తెలిపింది. ఈ పరిణామాలు స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)పై తీవ్ర పరిణామాన్ని చూపే అవకాశం ఉందని జిపి మోర్గాన్ సీఈఓ, ఆర్థిక నిపుణులు మైఖేల్ ఫెరోలి తెలిపారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ 2025 చివరి నాటికి మాంద్యంలోకి జారుకోనుందన్నారు. ఫలితంగా ఉద్యోగ నష్టాలు తప్పవని తన నివేదికలో వెల్లడించారు. 2025 ద్వితీయార్థంలో జీడీపీ తగ్గుముఖం పడుతుందని తెలిపారు. మూడవ త్రైమాసికంలో 1 శాతం, నాలుగవ త్రైమాసికంలో 0.5 శాతం తగ్గుదల ఉంటుందని జెపి మోర్గాన్ అంచనా వేసింది. ఇది నిరుద్యోగానికి దారి తీయనుందని స్పష్టం చేసింది.

జెపి మోర్గాన్ రిపోర్ట్ ప్రకారం.. అమెరికాకు దీటుగా ఇతర దేశాలు వేసే టారిఫ్‌లతో యూఎస్‌లో వస్తు ధరలు 1-1.5 శాతం వరకు పెరుగుతాయి. దీంతో ద్రవ్యోల్బణం పెరగనుంది. ఇదే విధానాలు కొనసాగితే అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగ సృష్టి నిలిచిపోవడంతో పాటు, ఉన్న ఉద్యోగాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించొచ్చు. మాంద్యం వల్ల అమెరికాలో ఉద్యోగాలు ఊడిపోనున్నాయి. ఆర్థిక సంక్షోభం వల్ల నిరుద్యోగ రేటు 5.3 శాతానికి పెరిగే అవకాశముంది. కొత్త ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయి. ఇందుకు ట్రంప్ విధిస్తున్న అధిక సుంకాలే ప్రధాన కారణం.

మరిన్ని సంస్థల హెచ్చరిక..

జెపి మోర్గాన్‌తో పాటు బార్క్లేస్, బోఫా గ్లోబల్ రీసెర్చ్, డ్యూష్ బ్యాంక్, యూబీఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్ వంటి ప్రముఖ ఆర్థిక పరిశోధనా సంస్థలు ట్రంప్ చర్యలను తప్పుబట్టాయి. అధిక టారిఫ్‌లు అమెరికా ఆర్థిక వ్యవస్థను పతన దిశగా నెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించాయి. ఈక్విటీ మార్కెట్లు ఇప్పటికే ఒత్తిడిలోకి జారుకున్నాయని హెచ్‌ఎస్‌బిసి పేర్కొంది. యూఎస్ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించాయి. ఎస్అండ్‌పీ గ్లోబల్ కూడా అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారిపోయే అవకాశాన్ని 35 శాతానికి పెంచింది. గోల్డ్‌మన్ సాచ్స్ వంటి కంపెనీలు అమెరికా ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లడం ఖాయమని ఇటీవలే పలు రిపోర్టుల్లో తెలిపాయి.

40 ఏండ్ల కనిష్టానికి దిగుమతులు..

ప్రపంచ దేశాల నుంచి అమెరికాకు చేసుకునే దిగుమతులు 20 శాతం కన్నా ఎక్కువగా పడిపోవచ్చని యూఎస్ ఆర్థికవేత్త జోనాథన్ పింగిల్ పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాల్లో దిగుమతుల స్థాయి 1986కు ముందు స్థాయి కనిష్టానికి క్షీణించొచ్చన్నారు. అంటే దాదాపు 40 ఏండ్ల కనిష్ట స్థాయికి దిగుమతులు పడిపోనున్నాయి. అమెరికా కేంద్ర బ్యాంక్ యూఎస్ ఫెడరల్ చైర్మెన్ జెరోమ్ పావెల్ సైతం ట్రంప్ విధిస్తున్న సుంకాలపై ఆందోళన వ్యక్తం చేశారు. అధిక టారీఫ్‌లు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డారు. ట్రంప్ వాణిజ్య విధానంలో తీవ్ర సంక్షోభం చోటు చేసుకోవచ్చనే అంచనాల్లో ఇటీవల అమెరికా సహా ప్రపంచ మార్కెట్లన్నీ తీవ్ర పతనాన్ని చవి చూస్తోన్న విషయం తెలిసిందే.

అమెరికాకు జేఎల్‌ఆర్ ఎగుమతులు నిలిపివేత..!

లండన్ : టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) బ్రిటన్‌లో తయారయ్యే కార్లను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయనుంది. ట్రంప్ తమ దేశంలోకి దిగుమతయ్యే వాహనాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ట్రంప్ సుంకాలను ఎలా తగ్గించుకోవాలనే దానిపై ఆ సంస్థ ఆలోచన చేస్తున్నట్టు టైమ్స్ ఓ కథనంలో పేర్కొంది. 2024 మార్చి వరకు 12 నెలల కాలంలో జేఎల్ఆర్ మొత్తంగా 4.30 లక్షల కార్లను విక్రయించింది. ఇందులో నాలుగో వంతు అమెరికాలో అమ్మకాలు చేసింది.

హ్యావ్‌మోర్ కొత్త క్యాంపెయిన్



హైదరాబాద్ : ప్రముఖ ఐస్‌క్రీమ్ బ్రాండ్లలో ఒక్కటైన లాట్టీ వెల్‌ఫుడ్ కంపెనీలో భాగమైన హ్యావ్‌మోర్ కొత్త ప్రచార క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. క్రికెటర్ హర్థిక్ పాండ్యాతో కలిసి నటీ తమన్నా భాటియా నూతన ప్రచారంలో పాల్గొననున్నారని పేర్కొంది. 'సో టేస్టీ యు వన్నా మోర్' నినాదంతో హ్యావ్‌మోర్ క్యాంపెయిన్ సాగనుందని వెల్లడించింది.

రూ.15వేల కోట్ల ఐపీఓకు టాటా క్యాపిటల్

ముంబయి : టాటా గ్రూపునకు చెందిన ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ టాటా క్యాపిటల్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానుంది. ఇందుకోసం ప్రతిపాదిత పత్రాల (డీఆర్‌హెచ్‌పీ)ను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. కొత్త షేర్ల జారీ, ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో నిధుల సమీకరణ జరగనుందని ఆ సంస్థ వెల్లడించింది. ఆర్‌బీఐ వద్ద ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందిన సంస్థలు 2025 సెప్టెంబర్‌లోగా లిస్టింగ్ కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే టాటా క్యాపిటల్ ఇష్యూకు రానుంది. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో టాటా సన్స్‌కు 93 శాతం వాటా ఉంది.

బ్యాట్‌రెతో ఇవి91 భాగస్వామ్యం

బెంగళూరు : బీ2బి వాహన ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ సంస్థ బ్యాట్‌రేతో విద్యుత్ వాహనాల అగ్రిగేటర్ ఇవి91 టెక్నాలజీస్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. సంయుక్తంగా 10,000 ఇవిలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించాయి. తద్వారా పట్టణ, గ్రామీణ రవాణ రెండింటి భవిష్యత్తును పునర్నిర్వచించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నాయి. అత్యున్నత స్థాయి ఇవి స్కూటర్లను అందించడమే తమ లక్ష్యమని బ్యాట్‌రే వ్యవస్థాపకుడు, ఎండీ నిశ్చల్ చౌదరి పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా మరిన్ని ఇవిలను రోడ్డుపైకి తీసుకురావడం సహాయపడుతుందని ఇవి 91 వ్యవస్థాపకుడు, సీఈఓ అరుణ్ కుమార్ తెలిపారు.

ఐటీసీ ఆశీర్వాద్ మసాలలకు నానీ ప్రచారం



హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ ఐటీసీ లిమిటెడ్ తన ఆశీర్వాద్ మసాలలు బ్రాండ్ అంబాసిడర్‌గా నటుడు నానీని నియమించుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఆయన ప్రచారాన్ని ఉపయోగించుకోనున్నట్టు ఐటీసీ లిమిటెడ్ స్పైసెస్ బిజినెస్ హెడ్ పియూష్ మిశ్రా పేర్కొన్నారు. మసాలాల విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోనున్నట్టు వెల్లడించారు.

థామస్‌కుక్‌తో జాగల్ జట్టు

హైదరాబాద్ : ప్రయాణ, వ్యయ నిర్వహణ పరిష్కారాల సంస్థ థామస్‌కుక్ ఇండియాతో భాగస్వామ్యం కుదర్చుకున్నట్టు జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్ తెలిపింది. థామస్‌కుక్ కార్పొరేట్ ట్రావెల్, వ్యయాల నిర్వహణలో డిజిటల్ పరివర్తనకు ఈ ఒప్పందం మద్దతు చేయనుందని జాగల్ సీఈఓ, ఎండీ అవినాష్ గోడ్‌కింది పేర్కొన్నారు. కార్పొరేట్ ట్రావెల్‌ను మరింత స్మార్ట్‌గా, సామర్థ్యంగా మార్చడానికి టెక్నాలజీని అందించనున్నామన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



(ఫైల్)

న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదముద్ర వేశారు. దీంతో వక్ఫ్‌బిల్లు చట్టంగా మారింది. ఈ బిల్లుకు పార్లమెంట్ ఉభయసభలు ఆమోదం తెలిపిన విషయం విదితమే. అయితే ఓవైపు ముస్లిం వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.మరోవైపు సుప్రీంకోర్టులోనూ పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. సెలవులు దినాలు కావటం..సుప్రీంకోర్టులో వక్ఫ్‌బిల్లుపై ఇంకా వాదనలు జరగలేదు. ఈలోపు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయటం గమనార్హం.

అణగారిన వర్గాల హక్కుల కోసం కొట్లాడిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్

- ఆయన తీసుకొచ్చిన గ్రీన్ రెవల్యూషన్‌తోనే వ్యవసాయ రంగం అభివృద్ధి : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- బీజేపీ ఆఫీసులో బాబు జగ్జీవన్ రామ్ జయంతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన జీవితాంతం అణగారిన వర్గాల హక్కుల కోసం కొట్లాడిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కొనియాడారు. ఆయన తీసుకొచ్చిన గ్రీన్ రెవల్యూషన్‌తోనే దేశంలో వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కిందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ దళితుల హక్కులను కాపాడుతూ, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసే విధంగా పాలన అందించారని గుర్తుచేశారు. ఆయన ఒక గొప్ప విద్యావేత్త, సామాజిక స్పృహ కలిగిన మానవతావాది, పరిపాలనదక్షుడు, రచయిత, అభ్యుదయవాది అని కొనియాడారు. నైతిక విలువలు కలిగిన నాయకుడిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ పాలనను వ్యతిరేకిస్తూ అందరికీ సమాన హక్కుల కోసం పోరాటం చేశారని కొనియాడారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ తరువాత దేశాన్ని పాలించే సత్తా బాబూ జగ్జీవన్ రామ్‌కు ఉన్నప్పటికీ దళితుడనే కారణంతో ఆ పదవి దక్కకుండా చేశారనీ, ఎమర్జెన్సీ పెట్టి అరాచకం సృష్టించారని విమర్శించారు. రేషన్‌బియ్యాన్ని కేంద్రం ఉచితంగా ఇస్తుంటే రాష్ట్రంలో తామే సొంతంగా ఇస్తున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతున్నదన్నారు. ప్రధాని ఫొటో పెడితే మీకున్న అభ్యంతరమేంటని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో కాంగ్రెస్ అమానుషంగా వ్యవహరించిందనీ, వర్సిటీ స్కాలర్ విద్యార్థి రోహిత్‌పై అక్రమ ఆయుధాల కేసు పెట్టి అతని జీవితాన్ని నాశనం చేయడం దుర్మార్గమని విమర్శించారు. విద్యార్థులపై పెట్టిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో భూములమ్మి రూ.20 వేల కోట్లు దోచుకున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతల నుంచి ప్రజలను రక్షించాలి

- జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నుంచి ప్రజలను రక్షించాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా ప్రభుత్వాన్ని కోరారు. అధిక వేడి నుంచి కాపాడేందుకు రక్షణ చర్యలను తీసుకోవాలని సూచించారు. శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో మార్చి నుంచే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయని వివరించారు. ఏప్రిల్, మేలో ఇవి మరింత పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారని అన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులతో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులపై అధిక ప్రభావం ఉంటుందన్నారు. ఎండలో పనిచేయడం వల్ల డిహైడ్రేషన్‌కు గురవుతారని అన్నారు. కావున మధ్యాహ్నం పని చేయకుండా ఆదేశాలు జారీచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలపైన అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఉంటుందన్నారు. అవసరమైతే తప్ప వారు ఎండలో తిరగ కూడదని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు చెలిమెల రాజేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎ రామచంద్రయ్య, ఆనంద్ కుమార్, రవీందర్ రెడ్డి, ఎం శ్రీనివాస్, పి రజిని, ఎస్పీ లింగస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, ఎస్ శ్రీనివాస్, రాహుల్, పవన్, కురుమయ్య సుదర్శన్, విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షం...రాజ్యాంగ విరుద్ధం

- మత స్వయంప్రతిపత్తిని కాలరాస్తోంది
- వక్ఫ్ బిల్లును సవాలు చేస్తూ సుప్రీంలో ఆప్ ఎమ్మెల్యే పిటిషన్



న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ బిల్లును సవాలు చేస్తూ ఢిల్లీకి చెందిన ఆమ్‌ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అమానుల్లా ఖాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ బిల్లు ఏకపక్షంగా ఉన్నదని, రాజ్యాంగ విరుద్ధమైనదని ఆయన ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 (ప్రాథమిక హక్కుల విధింపునకు పరిష్కారాలు) కింద ఆయన ఈ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ బిల్లు ముస్లింల మతపరమైన, సాంస్కృతిక స్వయంప్రతిపత్తిని కాలరాస్తోందని అమానుల్లా ఖాన్ ఆ పిటిషన్‌లో తెలియజేశారు. మైనారిటీల హక్కులను హరించడంతో పాటు ఏకపక్ష కార్యనిర్వాహక జోక్యానికి వీలు కల్పిస్తోందని వివరించారు. 'రాజ్యాంగంలోని 14, 15, 21, 25, 26, 29, 30, 300-ఏ కల్పించిన ప్రాథమిక హక్కులను ఈ బిల్లు ఉల్లంఘిస్తోంది. దీనికి ఇంకా రాష్ట్రపతి ఆమోదం లభించలేదు. కానీ అందులోని నిబంధనలు ముస్లింలలో పెద్ద ఎత్తున ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మతపరమైన స్వయంప్రతిపత్తిని, వక్ఫ్ సంస్థలకు రాజ్యాంగం కల్పించిన రక్షణను నీరుకారుస్తోందని వారు కలత చెందుతున్నారు. ఆస్తి వక్ఫ్‌కు చెందినదా కాదా అని నిర్ధారించేందుకు ఈ బిల్లు ప్రభుత్వానికి అధికారాన్ని కట్టబెడుతోంది. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం ఏదైనా ఆస్తి వక్ఫ్‌కు చెందినదా కాదా అని నిర్ణయించే అధికారం వక్ఫ్ బోర్డుకు ఉంది. వక్ఫ్ ట్రిబ్యునల్ దానిని రద్దు చేస్తేనో లేదా సవరిస్తేనో తప్ప బోర్డు నిర్ణయమే ఫైనల్. అయితే ఇప్పుడు ఈ బిల్లు ట్రిబ్యునల్‌కు ఉన్న ఆ అధికారాన్ని జిల్లా కలెక్టరుకు అప్పగించింది. అధికారాన్ని బదలాయించడం, ట్రిబ్యునల్ స్టే అధికారాలకు కత్తెర వేయడం నిష్పాక్షిక విధానాన్ని నిరాకరించడమే అవుతుంది' అని పిటిషనర్ తెలిపారు.

వక్ఫ్ బోర్డుల ప్రాతినిధ్యంలో చేసిన మార్పులను కూడా పలువురు వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్ర స్థాయి వక్ఫ్ బోర్డులలో ఒక ముస్లిమేతర సీఈఓను, కనీసం ఇద్దరు ముస్లిమేతర సభ్యులను అనుమతించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. వీరిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. 'సెక్షన్ 9, 14 ప్రకారం వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ మండలిలో ముస్లిమేతర సభ్యులను తీసుకోవడం విభజనకు దారితీస్తుంది. అందులో హేతుబద్ధత కూడా లేదు' అని ఖాన్ తన పిటిషన్‌లో ఆరోపించారు.

వక్ఫ్ (సవరణ) బిల్లు రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ సుప్రీంకు ఎపిసిఆర్

వక్ఫ్ (సవరణ) బిల్లు 2025 రాజ్యాంగ చెల్లుబాటను సవాల్ చేస్తూ అసోసియేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఎపిసిఆర్) అనే ఎన్‌జిఓ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 'ఈ బిల్లు మన ప్రజాస్వామ్య, లౌకిక చట్రం యొక్క పునాది అయిన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 25, 26, 300ఎలను నేరుగా ఉల్లంఘిస్తుంది' అని పిటిషన్‌లో ఎపిసిఆర్ ఆమోదించింది. యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిసియేన్సి అండ్ డెవలప్‌మెంట్ బిల్లు 2025గా పేరు మారనున్న వక్ఫ్ (సవరణ) బిల్లు 2025లో ప్రతిపాదించిన సవరణలు అనవసరమైనవే కాకుండా ముస్లిం సమాజం యొక్క మతపరమైన వ్యవహారాల్లో ఆందోళనకరమైన జోక్యం కూడా అని పిటిషన్ విమర్శించింది. ఖురాన్ సూచనలు, ప్రవక్త మొహమ్మద్ కాలం నుంచి వస్తున్న ఆచారాల ప్రాథమిక ఉద్దేశ్యాన్ని నీరుగార్చడమే ఈ బిల్లు లక్ష్యమని పిటిషన్ విమర్శించింది.

తెలంగాణలో పెట్టుబడులను ప్రోత్సహించండి

- రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాలు అందిస్తుంది : లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల ప్రతినిధులకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించి పెట్టుబడులు పెట్టేలా స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల అధికార ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. శనివారం బంజారాహిల్స్ పార్క్ హయత్‌లో గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం(జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇండియా-లాటిన్ అమెరికా, కరీబియన్ కంట్రీస్ బిజినెస్ కాంక్లేవ్" రెండో ఎడిషన్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం తరపున పారిశ్రామికవేత్తలకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షులు ట్రంప్ తీసుకున్న నిర్ణయం మనకు మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జహీరాబాద్ నిమ్జ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆరు అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయనీ, వీటిలో మూడు కొరియా కంపెనీలున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోని టైర్ 2,3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆగ్రో ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించి అన్నదాతలను వ్యాపారవేత్తలుగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జీఐబీఎఫ్ ప్రతినిధులు జోషి, చక్రవర్తి, డా.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా బలగాల తాజా దాడిలో 18మంది మృతి

కీవ్ : ఉక్రెయిన్‌పై రష్యా బలగాలు తాజాగా జరిపిన దాడిలో 18మంది మరణించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వస్థలమైన క్రివై రిగ్‌లో శుక్రవారం నివాస ప్రాంతంపై జరిగిన క్షిపణి దాడిలో 18మంది మరణించగా, 61మంది గాయపడ్డారని ఆ ప్రాంత గవర్నర్ శనివారం తెలిపారు. మృతదేహాలను వీధిలో వరసగా పడుకోబెట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఆకాశంలోకి పెద్ద ఎత్తున పొగ మేఘాలు కమ్ముకుంటున్నాయి. మంటల్లో దగ్ధమవుతున్న కారు ఒకటి ఆ వీడియోలో కనిపిస్తుండగా, సాయం కోసం కేకలు పెట్టడం కూడా వినిపిస్తోంది. మరణించిన వారిలో 9మంది చిన్నారులే వున్నారని గవర్నర్ టెలిగ్రామ్‌లో తెలిపారు.

గ్యాస్ వినియోగదారుల బదిలీపై స్టే

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



ఆయిల్ కంపెనీలు తీసుకువచ్చిన గ్యాస్ వినియోగదారుల బదిలీ, మార్కెట్ పునర్నిర్మాణం, ప్రాంతాల వారీగా నిర్వహణ విధానాన్ని నిలిపి వేస్తూ హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజన్సీల మధ్య జరిగిన ఒప్పంద పత్రాలను సమర్పించాలని ఆదేశించింది. వినియోగదారుల బదిలీ విదానం కొనసాగింపునకు సంబంధించి ఏజన్సీలు లేవనెత్తిన అభ్యంతరాలపై కౌంటర్లు దాఖలు చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది. ఫిబ్రవరి 21న ఆయిల్ కంపెనీలు తీసుకువచ్చిన వినియోగదారుల బదిలీ విదానాన్ని సవాలు చేస్తూ శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ సహా 33 గ్యాస్ ఏజన్సీలు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ ఎన్వీ శ్రవణకుమార్ విచారణ చేపట్టారు పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఏ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ ఏండ్ల తరబడి ఏజన్సీలు సిలిండర్లను విక్రయిస్తున్నాయని తెలిపారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి, సిబ్బంది నియామకాలు చేపట్టి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ఈ దశలో కొత్త విధానం తీసుకొస్తే ఏజెన్సీలకు నష్టం వస్తుందని పేర్కొన్నారు. 2018 జనవరి 4న మార్కెట్ పునర్నిర్మాణం, వినియోగదారుల బదిలీ విధానాన్ని ప్రవేశపెట్టగా పంపిణీదారులు పలు హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారని వివరించారు. బాంబే హైకోర్టు ఈ విధానం ఏకపక్షం, అసమంజమని పేర్కొంటూ కొట్టివేయడంతో అన్ని హైకోర్టులు అదే రకమైన ఉత్తర్వులు జారీచేశాయన్నారు. ఆయిల్ కంపెనీలు సుప్రీం కోర్టును ఆశ్రయించగా, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. ఈ దశలో మళ్లీ వినియోగదారులు బదలాలయింపు విధానాన్ని తీసుకువచ్చాయన్నారు. గ్యాస్ కంపెనీల తరఫున సీనియర్ న్యాయవాది బి మయూరురెడ్డి వాదనలు వినిపిస్తూ పిటిషన్ వేసే అర్హత ఏజన్సీలకు లేదన్నారు. ఏజన్సీలకు కంపెనీలతో సంబంధంలేదనీ, కంపెనీ సిలిండర్లను ఏజన్సీల ద్వారా విక్రయాలు మాత్రమే చేస్తున్నారని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కొత్తవిధానం వల్ల ప్రస్తుత పంపిణీదారులు కస్టమర్లను మరొకరికి వదులుకోవాల్సి వస్తుందనీ, పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి నడుపుతున్న సంస్థల నుంచి వినియోగదారులను మరొకరికి పంపుతున్నారన్నదే ఏజన్సీల అభ్యంతరమని పేర్కొన్నారు. ఏజన్సీలు సరైన సేవలందించలేదని కంపెనీలు ఎక్కడా పేర్కొనలేదన్నారు. కాబట్టి గ్యాస్ కంపెనీలు తీసుకువచ్చిన కొత్త విధానంపై మూడు వారాలపాటు స్టే మంజూరు చేస్తున్నట్టు మధ్యంతర ఉత్తర్వుల జారీ చేశారు.

రిజిస్ట్రేషన్ల తిరస్కరణ సబబే-హైకోర్టు

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ జాగీరు గ్రామంలో సర్వే నెం.250లో జనచైతన్య హౌసింగ్ ప్రయివేటు లిమిటెడ్‌కు సంబంధించిన మూడు ప్లాట్ల రిజిస్ట్రేషన్లను సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించడానికి హైకోర్టు సమర్థించింది. అది నిషేధిత జాబితాలో ఉన్నందున రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించడం సబబేనని పేర్కొంది. శేరిలింగంపల్లి సబ్‌రిజిస్ట్రార్ మూడు సేల్ డీడ్లను రిజిస్ట్రేషన్లు చేసేందుకు నిరాకరించడాన్ని జనచైతన్య హౌసింగ్ ప్రయివేటు లిమిటెడ్ హైకోర్టులో సవాల్ చేసింది. దీనిపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వేదుల వెంకట రమణ వాదనలు వినిపిస్తూ 2004లో వక్ఫ్‌బోర్డు సీఈఓ లేఖ ఆధారంగా సర్వే నెంబర్ 250లోని భూములను నిషేధిత జాబితాల్లో ఉంచారన్నారు. మణికొండ జాగీరులోని 1654 ఎకరాలకు సంబంధించిన వివాదంలో ఇవి వక్ఫ్‌బోర్డుకు చెందవని అన్నారు. ప్రభుత్వానివేనని సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందన్నారు. తమవి కాని భూములు గురించి వక్ఫ్‌బోర్డు లేఖ రాస్తే, దాని ఆధారంగా సబ్ రిజిస్ట్రార్ తమ సేల్ డీడ్లను రిజిస్ట్రేషన్ చేయకపోవడం అన్యాయమని వాదించారు. 2013లో జీహెచ్ఎంసీ ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఆధారంగా హక్కులు పొందడానికి ప్రయత్నించరాదన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి సుప్రీంకోర్టు ఆ భూములు ప్రభుత్వానికి చెందినవని పేర్కొన్నదనీ, వక్ఫ్‌బోర్డుకు హక్కులు లేవన్న కారణంగా ఇక్కడ పిటిషనర్ హక్కులు కోరడం సరైంది కాదన్నారు. జనచైతన్య పిటిషన్‌ను న్యాయమూర్తి కొట్టేశారు.

ఏపీలోనే పనిచేయండి : క్యాట్ తీర్పు

ఐఏఎస్ అధికారిణి వాణీప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌లోనే పని చేయాలని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) తీర్పు వెలువరించింది. అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వ సిబ్బంది మరియు శిక్షణా విభాగం జారీ చేసిన ఉత్తర్వులను సమర్థించింది. తనను తెలంగాణలోనే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. కొందరు క్యాట్‌ను ఆశ్రయించి ఉపశమనం పొందారు. క్యాట్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేంద్రం తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... ఈ వివాదంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీ అప్పగించింది. దీనిపై కేంద్రం దీపక్ ఖండేకర్ కమిటీని ఏర్పాటు చేసింది. అధికారుల విజ్ఞప్తులను తోసిపుచ్చుతూ ఎక్కడి వారు అక్కడికే వెళ్లాలని కమిటీ నివేదిక ఇచ్చింది. తక్షణమే ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర కేడర్ నుంచి రిలీవ్ కావాలని అక్టోబర్ 16లోగా కేటాయించిన రాష్ట్రంలో రిపోర్టు చేయాలని అక్టోబర్ 9న అధికారులను డీవోపీటీ ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ వాణీప్రసాద్ క్యాట్‌ను ఆశ్రయించారు.

విచారణ చేపట్టిన తొలిరోజే వాణీప్రసాద్ ఏపీకి వెళ్లాలని ట్రిబ్యునల్ మధ్యంతర ఆదేశాలిచ్చింది. హైకోర్టు కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో ఆమె ఏపీకి వెళ్లి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వాణీప్రసాద్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో డాక్టర్ బస్వరాజ్ పట్నే(జ్యుడిషియల్), వరుణ్ సింధుకుల్ కౌముది(అడ్మినిస్ట్రేషన్) బెంచ్ మార్చి 4న తీర్పు రిజర్వు చేసింది. వాణీప్రసాద్ ఏపీలోనే పని చేయాలని గురువారం తీర్పు వెలువరించింది.



జగ్జీవన్‌రామ్ కృషి చరిత్రలో నిలిచిపోతుంది

- మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. యువత మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శనివారం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలు నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షులు ఎర్ల కాడి సూర్యం ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. ముందుగా బాబూ జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర సమర యోధుడని, కుల, రహిత సమాజం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అన్నారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు. దాదాపు 10సార్లు ఎంపీగా గెలిచారని గుర్తు చేశారు. కేంద్ర మంత్రిగా వివిధ శాఖల్లో పని చేశారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హరిత విప్లవం తీసుకొచ్చి రైతులకు ప్రత్యేక వెసులుబాటు ఇచ్చారన్నారు. పీఎఫ్ విధానం, పోస్ట్ ఆఫీస్ ఏర్పాట్లు, కార్మిక శాఖ మంత్రిగా కార్మికుల వేతనాల పెంపు, పని విధానం, లాంటి ఎన్నో సరికొత్త మార్పులు తీసుకొచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారన్నారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

గీతంలో ప్రతిష్టాత్మక ఏస్-2025 అవార్డుల ప్రదానం

- ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



నవతెలంగాణ-పటాన్‌చెరు

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ శనివారం ప్రతిష్టాత్మక ఏస్-2025 అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొత్తం 52 అవార్డులను గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-స్టూడెంట్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ ప్రదానం చేశారు. పాఠ్యేతర కార్యకలాపాలు, క్రీడలు, సమాజ సేవ, నాయకత్వంలో అసాధారణ ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. వారితోపాటు ఉత్తమ సహాయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్ సీసీ క్యాడెట్ల సహకారాన్ని గుర్తించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈ వాణిజ్య యుద్ధంలో ఎవరూ గెలవరు

- యూఎన్ చీఫ్ హెచ్చరిక



ఐక్యరాజ్య సమితి : 'వాణిజ్య యుద్ధంలో విజేతలంటూ ఎవరూ వుండరు' అని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ హెచ్చరించారు. అమెరికాతో వాణిజ్యం జరిపే కొన్ని భాగస్వామ్య దేశాలపై అధిక టారిఫ్‌లను విధించడంతో పాటూ కనీసం 10శాతం పరస్పర సుంకాలను విధిస్తూ ట్రంప్ తీసుకువచ్చిన ఉత్తర్వులపై అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్ విధానంపై యూఎన్ చీఫ్ స్పందన గురించి ప్రశ్నించగా, ఆయన ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ మాట్లాడుతూ, పై వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనడానికి ఏ మాత్రమూ సన్నద్ధంగా లేని దేశాల గురించే తమ ఆందోళన అంతా అని ఆయన చెప్పారు. ఈ వాణిజ్య యుద్ధం వల్ల ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయని అన్నారు. అమెరికా విధించిన టారిఫ్‌ల వల్ల అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ చాలా ప్రమాదకరమైన దశలోకి నెట్టబడుతోందని అంక్టాడ్ (వాణిజ్యం, అభివృద్ధిపై ఐక్యరాజ్య సమితి సదస్సు) శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. దీనివల్ల అభివృద్ధికి ముప్పు పొంచి వుందని, పెట్టుబడులు, ప్రగతి ముఖ్యంగా అత్యంత బలహీనమైన ఆర్థిక వ్యవస్థలు దెబ్బ తింటాయని హెచ్చరించింది. అమెరికా టారిఫ్‌లకు దీటుగా ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ కూడా పెద్ద ఎత్తున కొత్త టారిఫ్‌లు విధిస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని పేర్కొంది.

డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు నైజీరియన్స్ అరెస్ట్

- రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-రాజేంద్రనగర్

చాలా కాలంగా డ్రగ్స్ అమ్ముతున్న ముగ్గురు నైజీరియన్లను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నార్కోటెక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపిన వివరాల ప్రకారం.. సన్ సిటీలో డ్రగ్స్ అమ్ముతున్న ముగ్గురు నైజీరియన్లను నార్కోటిక్ బ్యూరో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మూడు నెలలుగా వీరిపై నిఘా పెట్టి శనివారం అదుపులోకి తీసుకున్నారు. వీరు భారత్‌లోనే కాకుండా అమెరికాలో కూడా డ్రగ్స్ అమ్ముతున్నారు. ఈ డ్రగ్స్ వ్యాపారం పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. కస్టమర్లకు డ్రగ్స్ సరఫరా చేయడానికి యువతులను నియమించుకున్నారు. టోలిచౌకిలో ఒక యువతి డ్రగ్ సరఫరా చేస్తుండగా పట్టుకున్నారు.

ఫార్మా భూముల్లో ఫెన్సింగ్ ఆపాలి

- ఫార్మా రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి
- మేడిపల్లిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-యాచారం

రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ భూముల్లో చేపట్టిన ఫెన్సింగ్‌ను వెంటనే ఆపి, ఎన్నికల ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పి.అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్తలో ఫార్మా భూముల విషయంలో సీపీఐ(ఎం) నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలవంతంగా ఫార్మాసిటీ భూముల్లో ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. కోర్ట్ ఆర్డర్‌ను ధిక్కరించి మేడిపల్లిలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను దింపి ఫార్మా భూములకు హద్దు రాళ్ల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకున్న రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బలవంతంగా రెండు మండలాల్లో భూసేకరణ చేపట్టిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాట మార్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఫార్మా రైతులకు ఎకరాకు 121 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. 2,800 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని అధికారులను కోరారు. వారికి ఆ భూమిపై పూర్తి హక్కులు కల్పించాలన్నారు. ఫార్మాసిటీ బాధిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మేడిపల్లి, కుర్మిద్దలో తమ పార్టీ ఇంటింటి సర్వే నిర్వహించిందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి జీపు జాతాను కూడా చేపట్టిందని చెప్పారు. సమస్యలు పరిష్కరించే వరకూ తమ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఆలంపల్లి జంగయ్య, ఎండీ జహంగీర్, ఆలంపల్లి యాదయ్య, వడ్డెమోని భూషణ్, ఆలంపల్లి పెంటయ్య, గడ్డం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

- ముఖ్యమంత్రి ఆమోదం
- ఎర్త్ సైన్సెస్‌గా మైనింగ్ కళాశాల అప్ గ్రేడ్ : సీఎం రేవంత్‌కు మంత్రి తుమ్మల ధన్యవాదాలు

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మారుస్తున్నట్టు ప్రకటించారు. సీఎం ప్రకటనతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రమ ఫలించింది.

సహజ వనరులు, మెరుగైన అవకాశాలు ఉన్న మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్ గ్రేడ్ చేయాలని మంత్రి తుమ్మల పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రాలు అందచేసిన విషయం తెలిసిందే. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు సీఎం సానుకూలంగా స్పందించి యూనివర్సిటీని మంజూరు చేస్తూ ప్రకటన జారీ చేశారు. దీంతో మంత్రి సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సహజ వనరులు, మినరల్స్ ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి లభించనుంది. దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెం జిల్లాలో మంజూరు చేయడం ఉమ్మడి జిల్లాకు లభించిన గొప్ప గౌరవంగా చెప్పొచ్చు.

300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపుదిద్దుకోనుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారనుంది. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడం ద్వారా వేలాదిమంది యువ శాస్త్రవేత్తల ఇక్కడి నుంచే దేశ భవిష్యత్‌కు బాటలు వేయనున్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి

- లొంగిపోయినవారికి పునరావాసం కల్పిస్తాం : మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి
- లొంగిపోయిన 86 మందికి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ- కొత్తగూడెం

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని, పోలీసుల ఎదుట లొంగిపోయిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని మల్టీ జోన్-1 ఐజీపీ (ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. భద్రాద్రి జిల్లాకు చెందిన 81 మంది, ములుగు జిల్లాకు చెందిన ఐదుగురు మావోయిస్టు సభ్యులు శనివారం ఆయా జిల్లాల పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విలేకర్ల సమావేశంలో ఐజీ మాట్లాడుతూ.. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కింద చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. మావోయిస్టులు వారి ఉనికి చాటుకునేందుకు అమాయకులైన కొంత మందిని టార్గెట్ చేయడం సరికాదన్నారు. చిన్న వయసులో ఉన్న వారికి మాయమాటలు చెప్పి దళంలోకి తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే మావోయిస్టుల ఉనికి పెద్దఎత్తున తగ్గిపోయిందన్నారు. అనేక మంది దళాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన నాయకులు, దళ సభ్యులు లొంగిపోతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఏడాది 224 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో భద్రాద్రి జిల్లాకు చెందిన 203 మంది, ములుగు జిల్లాకు చెందిన 21 మంది ఉన్నట్టు తెలిపారు. శనివారం 86 మంది లొంగిపోగా, వారిలో 26 మంది మహిళలు, 60 మంది పురుషులు ఉన్నారని తెలిపారు. ఇందులో నలుగురు ఏసీఎంలు ఉన్నారని, వారికి ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, ఐదుగురికి రూ.5 లక్షల చొప్పున, సభ్యులకు రూ.25 వేల చొప్పున పునరావాసం కింద చెక్కులు అందజేసినట్టు వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మందు పాతరలు పేలి అనేక మంది సామాన్య ప్రజలు చనిపోయారని అన్నారు. మందు పాతరలను గుర్తించేం దుకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చర్ల పరిసర ప్రాంతంలోని పూసుగుప్ప వద్ద బాంబును గుర్తించి నిర్వీర్యం చేశామన్నారు. తెలంగాణలో అండర్ గ్రౌండ్‌లో సుమారు 95 మంది మాత్రమే మావోయిస్టులు ఉండి ఉంటారని అబి.ప్రాయ పడ్డారు. వారితో చర్చించి ప్రజాజీవనంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామ న్నారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ములుగు ఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, ఖమ్మం ప్రొహిబిషన్ ఐపీఎస్ అధికారి రుత్విక్‌సాయి కొట్టె, 141 బెటాలియన్ కమాండెంట్ కమల్ వీర్, 81 బెటాలియన్ కమాండెంట్ ప్రీత, హిమాన్షు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయానికి కేంద్రం చేయూత

- సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్లాలి
- కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్
- ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రీయ రైతు సమ్మేళనం



నవతెలంగాణ-శంకర్‌పల్లి

సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం తరఫున సాంకేతికంగా.. ఆర్థికంగా చేయూతనందిస్తామని కేంద్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ తెలిపారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ముందుకెళ్లాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనం నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి హాజరయ్యారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, విజయవాడ ఎమ్మెల్యే సుజనాచౌదరి, డాక్టర్ షేక్ ఎన్‌మీరాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించే విధంగా పల్లె సృజన వారు స్టాల్స్ ఏర్పాటు చేయడం చాలా బాగుందన్నారు. రోజురోజుకూ ఎన్నో కొత్త రోగాలు వస్తున్నాయని, వీటిని కొంతమేరకైనా తగ్గుంచుకోవాలంటే సేంద్రీయ ఎరువుల ద్వారా వ్యవసాయం చేసి ఆహార ఉత్పత్తులు పెంచాలని సూచించారు. 10 ఏండ్లుగా సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే విధంగా ప్రధాని మోడీ అనేక కార్యక్రమాలు తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ ప్రయత్నం నిరంతరం కొనసాగిస్తామన్నారు. రైతులు శాస్త్రీయ టెక్నాలజీ సహాయంతో వ్యవసాయం చేస్తే ఉత్పత్తులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తే అందరికీ మంచి జరుగుతుందన్నారు. మనదేశంలో వ్యవసాయమే జీవనాధారం అని చెప్పారు. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందనీయమన్నారు. విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసంధానం చేసుకొని సేంద్రీయ వ్యవసాయానికి సహకరించాలని కోరారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బయోగ్యాస్ ప్లాంటు ప్రస్తుతం ప్రజలకు ఎంతో అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ చైర్మెన్ వెంకటేశ్వర్లు, కన్వీనర్ మాణిక్యరెడ్డి, సైంటిస్టులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య

నవతెలంగాణ-జన్నారం

ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత పెట్టి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూలీలకు అన్యాయం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని చింతగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న స్థలంలో మంచినీటి సౌకర్యం లేదన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయా లన్నారు. పనులు చేసిన ఉపాధి హామీ కూలీలకు వెంటనే కూలి డబ్బులు చెల్లిం చాలన్నారు. బీజేపీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి యత్నిస్తోందన్నారు. ఉపాధి హామీ చట్టంతో భూమిలేని నిరుపేదలు, కూలీలకు ఎంతగానో ఉపయోగమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కనికరపు అశోక్, నాయకులు అంబటి లక్ష్మణ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాధిక, పోశమల్లు పాల్గొన్నారు.

టన్నెల్‌లో వెంటిలేషన్ పనులు కొనసాగింపు

- మట్టి తవ్వకాలు, డీ-వాటరింగ్ ప్రక్రియ వేగవంతం



నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ, టన్నెల్‌లోని ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలను ప్రత్యేక అధికారి శివశంకర్ సహాయక బృందాల ఉన్నతాధికారులతో కలిసి పర్యవేక్షించారు. సొరంగంలో జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యలను వేగవంతం చేసినట్టు తెలిపారు. టన్నెల్ లోపల సిల్ట్ తొలగింపు పనులు, మట్టి తవ్వకాలు, ఊట నీటిని బయటకు తరలించే ప్రక్రియ, కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టిని బయటకు చేరవేసే ప్రక్రియ సమాంతరంగా జరుగుతున్నట్టు శివశంకర్ వివరించారు.

నీటి పారుదల శాఖ అధికారులు నిరంతరం పరిస్థితులను గమనిస్తూ, సహాయక బృందాల ఉన్నతాధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. శనివారం మట్టి తవ్వకాలకు అనుగుణంగా వెంటిలేషన్ ప్రక్రియను ముందుకు కొనసాగిస్తున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్ కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ విత్తనాన్ని కాపాడుకోవాలి

- శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- రెండో రోజు కొనసాగిన విత్తన పండుగ



నవతెలంగాణ-ఆమనగల్

స్థానిక సంప్రదాయ విత్తనాన్ని కాపాడుకుంటూనే, సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగించే పద్ధతులను అన్వేషించాలని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ నిర్వహిస్తున్న విత్తన పండుగ శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయంలో జీవనోపాధి, ఆరోగ్యం ఉంటుందని యువతకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం యువతని ఆకట్టుకోవాలన్నారు. వాళ్లకు నమ్మకం కలిగిస్తేనే మనం వ్యవసాయాన్ని కాపాడుకోగలుగుతామని చెప్పారు. దానికి స్వదేశీ పద్ధతులు, విత్తనం మంచిదని, అయితే ప్రపంచ పోటీని కూడా తట్టుకునేలా వ్యవసాయ విధానాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విత్తనాల స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫార్మర్ కమిషన్ కేటీఎస్ రెడ్డి, సిజిఆర్ వ్యవస్థాపకులు లీల లక్ష్మారెడ్డి, దొంతి నరసింహారెడ్డి, వ్యవసాయ నిపుణులు సునంద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల తర్వాత వంతు క్రైస్తవులదే

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష ఎంపీలు మాట్లాడుతూ, వక్ఫ్ బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఇక క్రైస్తవులతో సహా ఇతర కమ్యూనిటీలపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని విమర్శించారు.

కేథలిక్ చర్చ్‌లు వర్సెస్ వక్ఫ్

'భారత్‌లో ఎవరికి ఎక్కువ భూమి వుంది? కేథలిక్ చర్చిలు వర్సెస్ వక్ఫ్ బోర్డుపై చర్చ ' అనే శీర్షికతో ఆర్గనైజర్‌లో వ్యాసం వచ్చింది. భారతదేశంలో కేథలిక్ చర్చిల అధీనంలో 7కోట్ల హెక్టార్లకు పైగా భూమి వుందని, అది, ప్రభుత్వేతర భూ యజమానుల్లో ఇదే అతి పెద్దదని ఆ వ్యాసం పేర్కొంది. ఈ భూమి విలువ రూ.20వేల కోట్లు వుంటుందని అంచనా వేసినట్లు తెలిపింది. భారతదేశంలో రియల్ ఎస్టేట్ రంగంలో వక్ఫ్ బోర్డు కన్నా ఎక్కువగా చర్చి కీలక పాత్ర పోషిస్తోందని వ్యాఖ్యానించింది.

ప్రభుత్వం తర్వాత దేశంలో రెండో అతిపెద్ద భూ యజమాని అంటే వక్ఫ్ బోర్డేనని అందరిలోనూ సాధారణంగా ఒక నమ్మకం వుందని, కానీ వాస్తవిక డేటాతో ఈ నమ్మకం సరిపోలడం లేదని పేర్కొంది. కేథలిక్ చర్చి అతిపెద్ద ప్రభుత్వయేతర భూ యజమానిగా ఆవిర్భవించిందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూముల సమాచార వెబ్‌సైట్ నుండి సేకరించిన డేటాను ఈ వ్యాసంలో పొందుపరిచారు.

ఈ వ్యాసం లక్ష్యమేంటి ?


ఈ వ్యాసం లక్ష్యం ఏమిటని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఇతర మైనారిటీలను లక్ష్యంగా చేసుకునే బిజెపి వైఖరికి ఇదొక చక్కని ఉదాహరణ అని విమర్శించారు. దీనిపై తాను ఇప్పటికే ప్రజలను హెచ్చరించానన్నారు. క్రిస్టియన్లపై తన దృష్టిని మళ్లించేందుకు బిజెపికి ఇక ఎక్కువ సమయం పట్టదని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాంగ్రెస్ నేతలు రమేష్ చెన్నితాల కూడా ఆర్ఎస్ఎస్ మేగజైన్ ప్రచురించిన వ్యాసాన్ని తీవ్రంగా విమర్శించారు.

కాగా ఈ వివాదంపై స్పందిస్తూ మేగజైన్ సంపాదకులు ప్రఫుల్ కేట్కర్, ఆ వ్యాసం చాలా పాతదని చెప్పారు. వక్ఫ్ బిల్లు తర్వాత దాన్ని బయటకు లాగారని విమర్శించారు.

రేషన్ కార్డుల్లో గందరగోళం


- పేర్లు తారుమారు
- మార్పులు.. చేర్పుల్లోనూ తప్పులు
- అసలు పేర్లు కనిపించకపోగా.. ఉన్నవీ మాయం
- కొందరి పేర్లు ఇతరుల కార్డుల్లో నమోదు
- లబ్దిదారుల్లో ఆందోళన
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అధికారులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, సిరికొండ



ఇన్నాండ్లు రేషన్‌కార్డులు లేక బాధపడితే.. ఇప్పుడు కొత్త కార్డులు వచ్చాయన్న సంతోషం కన్నా ఆందోళనే ఎక్కువైంది. కొత్త కార్డుల జారీ కంటే ముందు మార్పులు, చేర్పులకు సంబంధించి కార్డుల్లో పేర్లు తారుమారు కావడం.. అసలు పేర్లు కనిపించకపోవడం.. ఉన్నవి మాయం కావడం.. కొందరి పేర్లు ఇతరుల కార్డుల్లో నమోదు కావడం తదితర చిత్ర విచిత్రాలు కనిపిస్తున్నాయి. అసలు లబ్దిదారుల పేర్లు కార్డుల్లో కనిపించకపోవడం.. వారి పిల్లల పేర్లు ఇతరుల కార్డుల్లో ఎక్కడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పౌరసరఫరాలశాఖ అధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వీటిని సరిచేసేందుకు సర్కారు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో నూతన రేషన్ కార్డుల జారీలో జరిగిన గందరగోళంపై ప్రత్యేక కథనం..

సిరికొండ మండల కేంద్రానికి చెందిన కత్తెర్ల సురేష్ భార్య పేరు మీద కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేశారు. ఇందులో వారి ఇద్దరి పిల్లల పేర్ల కోసం పెట్టారు. అయితే మంజూరైన కొత్త కార్డులో భార్యాభర్తల పేర్లు రాకపోగా.. పిల్లలిద్దరి పేర్లు వారి సమీప కుటుంబ సభ్యుల కార్డులో యాడ్ అయ్యాయి. ఇలాంటి పరిస్థితి జిల్లాలో అనేక మందికి ఎదురుకావడంతో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ సర్వత్రా గందరగోళానికి దారితీస్తోంది.



గందరగోళంగా జారీ ప్రక్రియ..

కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ చేపట్టడంతో ఆదిలాబాద్ జిల్లాలో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రజాపాలన సభలతోపాటు మీసేవలోనూ దరఖాస్తులు అందించారు. కొత్త కార్డులతోపాటు పాతవాటిలో పిల్లల పేర్లు చేర్పించడం వంటి వాటికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలో అన్నీ కలిపి 90వేల మంది దరఖాస్తులు అందించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు లబ్దిదారులను గుర్తించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి పంపించారు. ముందుగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించింది. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో కుటుంబ సభ్యుల పేర్ల చేర్పులకు సంబంధించి 14,900 కార్డులు జారీ అయినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు లబ్దిదారుల పేర్ల మీద కొత్త కార్డులు జారీ కావడం లేదని అంటున్నారు.

కొత్త కార్డులో మా పేర్లు రాలేదు
రాథోడ్ రవీందర్, సిరికొండ

రేషన్ కార్డు కోసం ప్రజాపాలన సభలో దరఖాస్తు చేశా. రెండు నెలల కింద జాబితాలో పేరు వచ్చింది. దీంతో అమ్మ పేరు మీద ఉన్న పాత రేషన్‌కార్డులో నుంచి మా పేర్లు తొలగించుకున్నాం. తీరా కొత్త కార్డులో మా భార్యాభర్తల పేర్లు రాలేదు. పిల్లల పేర్లు మాత్రం మా తల్లిదండ్రుల కార్డులో నమోదయ్యాయి. అధికారులు వీటిని సరిచేయడంతోపాటు కొత్త కార్డు జారీ చేయాలి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినం
వాజిద్ అలీ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి, ఆదిలాబాద్

కొత్తగా జారీ అవుతున్న రేషన్‌కార్డుల్లో పేర్లు తారుమారయ్యాయన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినాం. కొత్త కార్డులు ఇంకా జారీ కాలేదు. కానీ పేర్ల చేర్పులు, మార్పులకు సంబంధించి మాత్రం వచ్చాయి. ప్రభుత్వం త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తుంది.

ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

నవతెలంగాణ - నాగోల్



నాగోలులోని పీఎంఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహకులు వినీష, దీపికలు ఏర్పాటు చేసిన ఫ్యాషన్ ఫైల్స్ అండ్ సెషన్ ప్రారంభ కార్యమాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలకు సంబంధించిన చీరలు, జ్యువెలరీ మొదలైనవి సరసమైన ధరలకు అనుగుణంగా కస్టమర్లకు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి ఎగ్జిబిషన్ను ముందు ముందు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాచం సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు రౌడీషీటర్ల నగర బహిష్కరణ

పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు





నవతెలంగాణ-హయత్ నగర్

నగరంలో నేరాలకు తావు లేదని,అందుకే రాచకొండ కమిషనరేట్ పరిధిలో నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిని 26(1)యాక్ట్ ప్రకారం నగర బహిష్కరణ చేసినట్లు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు వెల్లడించారు.నల్గొండ జిల్లా కు చెందిన నల్లపోతు రాజేష్ అలియాస్ మెంటల్ రాజేష్ పై 19 కేసులు, 4 మర్డర్ కేసులు ఉన్నాయని చెప్పారు. అదే విధంగా మీర్ పేట కు చెందిన సూరి అలియాస్ సురేందర్ అలియాస్ మోహిన్ పై 21 కేసులు ఉన్నాయని వెల్లడించారు. అందుకే ఆ ఇద్దరిని కూడా నగర బహిష్కరణ చేసామని, వీళు మరల నగరానికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీరిపై రెండు సార్లు పీడీ యాక్ట్ నమోదు చేసిన కూడా నేర విధానంలో వారిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో నగర బహిష్కరణ చేసినట్టు తెలిపారు. నగరంలో నేరస్తులకు స్థానం లేదని సీపీ తెలిపారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే



నవతెలంగాణ -ఎల్బీనగర్

కొత్తపేట్ అంబేద్కర్ బస్తీలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని అంబేద్కర్ బస్తీలో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు.ఈ సందర్భంగా బస్తీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. వర్షపునీరు పోవడానికి సరైన ఔట్ లేట్ లేకపోవడంతో వర్షపునీరుతో బస్తీ మునిగిపోతుంది కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా తదితర సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వెంటనే జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్ కు ఫోన్ చేసి సమస్యలను వివరించారు. వెంటనే ఆ ప్రదేశాలలో పర్యటించి, దానికి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నికలకు ముందు కాలనీ గుండా నూతన డ్రైన్స్ ఔట్ లేట్ కోసం దాదాపు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించడం జరిగిందని గుర్తుచేశారు. కానీ పక్కనే ఉన్న ఎన్.టీ.ఆర్.నగర్ కాలనీ వాసులు అభ్యంతరం తెలపగా పనులు నిలిచిపోవడం జరిగింది అన్నారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డితో మాట్లాడి డ్రైన్స్ సమస్యలకు తగు పరిష్కారం చేయాలని కోరారు. ప్రస్తుతం ఈ ప్రదేశంలో నూతన మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేయించి, ఔట్ లేట్ పనుల్లో భాగంగా మధ్యలో పెద్ద రాయి అడ్డుగా రావడం జరిగిన నేపథ్యంలో దానిని తొలగించి ఔట్ లేట్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బస్తీలో గల్లీలు చిన్నగా ఉండడంతో జీహెచ్ఎం సీ వాహనాలు లోపలికి రాకుండా వీలు లేకుండా ఉందని అన్నారు.అతి త్వరలోనే ఈ పనులు ప్రారంభించడం జరుగుతుంది అని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం జీహెచ్ఎంసీ అధికారులు వచ్చి సమస్య పరిష్కారం కోసం బస్తీలో పర్యటించారు. తగు నివేదికను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మహేష్ రెడ్డి,రాంచందర్,బస్తీవాసులు యాదగిరి,కార్తిక్,రమేష్,నారాయణ, శారదా, ఎల్లమ్మ, నర్సమ్మ, పద్మ, వెంకతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డిని సన్మానించిన సీపీ

గ్రామ రక్షణ కోసం మూడు లక్షల విరాళం అందజేసిన సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

నేర రహిత సమాజ నిర్మాణంలో తన వంతు బాధ్యతను నిర్వర్తించి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు



కోసం రూ.మూడు లక్షల విరాళాన్ని మజీద్ పూర్ మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి అందజేశారు. ఈ మేరకు సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీ ఎస్ శనివారం మజీద్ పూర్ తాజా, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నగరశివారు గ్రామాల్లోని ప్రజలు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లడం, రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనుల మీద వెళ్లినప్పుడు గ్రామంలో జన సంచారం లేని సమయంలో, వేసవి కాలంలో అరుబయట పడుకున్న సమయంలో అపరిచిత వ్యక్తులు చొరబడి దోపిడీ, దొంగ తనాలకు బరితెగించే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వాటిని అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహద పడుతాయాన్నారు. రాచకొండ పోలీస్ ల సూచనల మేరకు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తన స్వంత డబ్బులు 3లక్షల రూపాయలను విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ రక్షణ కోసం తనవంతు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. నేర రహిత సమాజంలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకమైందన్నారు. సీ సీ కెమెరాల ద్వారా దోపిడీ, దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించడం సులభమన్నారు. సంఘ విద్రోహ శక్తులను అరికట్టవచ్చొన్నారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నేను చేసిన సాయాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు నన్ను గుర్తించి సన్మానించి, సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఇక ముందుకూడా గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సహాయం చేయడానికి ముందుంటానన్నారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ ఎస్ హెచ్ ఓ అంజిరెడ్డి, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ రఘుకు ఘన సన్మానం



నవతెలంగాణ - చంపాపేట్

హైదరాబాద్ జిల్లా సౌత్ ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా నూతన బాధ్యతలు చేపట్టిన వి.రఘు ను సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సౌత్ ఈస్ట్ జోన్ కాజా గజవుద్దీన్, జనరల్ సెక్రెటరీ అజాజ్ అహ్మద్ ఖాద్రి, జాయింట్ సెక్రెటరీ మహమ్మద్ రిజ్వాన్, ఇంచార్జ్ నారాయణరెడ్డి, సుభాష్ కుమార్, ఆర్గనైజేషన్ సెక్రెటరీ, సైదాబాద్ డివిజన్ అండ్ పీస్ కమిటీ సభ్యులు శనివారం స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ఆయనకు పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలన్నారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు, పలువురు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఎన్డీపీ నాలా నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ - చంపాపేట్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలో రెడ్డి కాలనీ నందు చేపట్టే ఎస్ఎన్డీపీ నాలా నిర్మాణ పనులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి శనివారం ఎస్ఎన్డీపీ, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షపు నీటి నాలాతో పాటుగా డ్రైనేజీ వ్యవస్థ కూడా అవసరమైన చోట నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎన్డీపీ కింద మంజూరైన రూ.5 కోట్ల 19 లక్షల నిధులతో నాలా అభివృద్ధి పనులు వేగంగా చేపట్టి ప్రజలకు వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కురిసిన భారీ వర్షాల వరదలకు రెడ్డి కాలనీ పరిసర ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎస్ఎన్డీపీ ఈ.ఈ రవిశంకర్, డి.ఈ.ఈ అనురాధ, ఏ.ఈ శివ చైతన్య, నాక్ ఇంజనీర్ అవినాష్ రెడ్డి, జలమండలి మేనేజర్ రమ్య భారతి, రెడ్డి కాలనీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ జయేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సామ నర్సింహారెడ్డి, గోపి, నందు, ఉపేందర్, వెంకట్ రెడ్డి, అంబయ్య, రమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ -హయత్ నగర్

వ్యక్తి అదృశ్యం అయిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. హయత్ నగర్ ఎస్ ఐ నెహ్రూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. హయత్ నగర్ లోని మిదాని కాలనీలో నివాసం ఉంటున్న అరిషర్ల పల్లి మచ్చేందర్. ఆరు నెలల కిందట అతనికి వివాహం అయింది. ఇక అప్పటినుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతుండడంతో 13 నవంబర్ 2024నాడు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్ళిపోయాడు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పేదల ఇంట్లో సన్న బియ్యం ఆనందాలు

ఎమ్మెల్యే రంగారెడ్డి

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పేదల ఇంట్లో సన్న బియ్యం ఆనందాలు వెళ్ల విరుస్తున్నాయని, ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొందని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శనివారం అబ్దుల్లాపూర్ మెట్ మండలం కేంద్రంలోని రేషన్ షాప్ లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలనేది ప్రజా ప్రభుత్వం ఉద్దేశమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ బరోసా మొదలగు పథకాలను అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం చేయలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలు సంతోషంగా ఉండాలని సన్న బియ్యం పంపిణీకి సీఎం. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు.నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా 3 లక్షల వరకు స్వయం ఉపాధి కల్పించడం కోసం రుణాలను అందిస్తున్నామని తెలిపారు.ఇలా అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, డీఎస్ఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ లు సుదర్శన్ రెడ్డి, సునీత, ఎంపీడీఓ శ్రీవాణి, మార్కెట్ కమిటీ చైర్మెన్లు చిలుక మధుసూదన్ రెడ్డి, గురునాథ్ రెడ్డి, సింగల్ విండో చైర్మెన్లు, మాజీ జడ్పీటీసీ బింగిదాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు బుర్ర మహేందర్ గౌడ్, బుర్ర చంద్రం, ఊషయ్య, శివశంకర్ కాంగ్రెస్ కార్యకర్తలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నవతెలంగాణ -చంపాపేట్

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐసీఏఆర్ క్రీడా సీనియర్ శాస్త్రవేత్త గిరిజనేని అన్నారు. శనివారం హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని రవీంద్రభారతి పాఠశాలలో ప్రిన్సిపల్ పరిమళ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీఏఆర్ క్రీడా సీనియర్ శాస్త్ర వేత్త వి.గిరిజ వేని హాజరై చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడాలని సూచించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పేద అమ్మాయి వివాహానికి అండగా ఉప్పల



నవతెలంగాణ-నాగోల్

ఓ నిరుపేద అమ్మాయి వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త సహాయ, సహకారాలు అందజేసి అండగా నిలిచారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు మండలం కార్మిక చెందిన సరస్వతి -నరసయ్య ల కుమార్తె క్రాంతి వివాహానికి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని కోరుతూ శనివారం నాగోలు డివిజన్లోని ఉప్పల శ్రీనివాస్ గుప్తను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్పందించిన ఉప్పల శ్రీనివాస గుప్త వారి ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకుని మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహానికి తన వంతుగా ఉప్పల ఫౌండేషన్ ద్వారా పూస్తే, మట్టెలు ,చీర, గాజులను అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ కేంద్రం లైఫ్ టైమ్ మెంబర్ కాసనగోటి రాజశేఖర్ గుప్త , అమ్మాయి తల్లీదండ్రులు పాల్గొన్నారు.

'బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కేటాయించాలి'



నవతెలంగాణ - చంపాపేట్

రాష్ట్రంలో రానున్న ప్రతి ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించి, బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు రాజ్యాధికారం కట్ట బెట్టాలని విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు యెచ్చు సునీల్ అన్నారు. శనివారం హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూములు, అగ్రవర్ణాల చుట్టూ అధికారం కాకుండా సమాజంలో ఉన్న పీడిత ప్రజలు అధికారంలోకి రావాలని, వారి సమస్యలను వాళ్లే పరిష్కరించుకునే ఆయుధం ఈ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అందజేయాలని అన్నారు. గ్రేటర్ హైదరాబాదును ఒక యూనిట్ లాగా తీసుకొని రానున్న బల్దియ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించి, వారిని గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఇజ్జగిరి కమలాకర్, జీహెచ్ఎంసీ అధ్యక్షులు భాగవతుల సాయి మహేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సాత్విక రెడ్డి, పాక నవీన్ బాబు, అనిల్ గోకికార్, నందాల అనిల్, వగ్గు వినయ్ , అనికేత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేర నిరూపణలో ప్రత్యేక పాత్ర సీసీ కెమెరాలది

దేశంలో అత్యధిక కెమెరాలు ఉన్న రాష్ట్రం తెలంగాణ : సీపీ





నవతెలంగాణ-హయత్ నగర్

నేర నిరూపణలో ప్రత్యేక పాత్ర సీసీ కెమెరాలదని, దేశంలో అత్యధిక కెమెరాలు ఉన్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు అన్నారు. శనివారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీ టీవీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై 860 కమ్యూనిటీ సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎల్బీనగర్ జోన్ పరిధిలో ఉన్న దేవాలయాల భద్రత కు సంబంధించి ఎనిమిది పోలీస్ స్టేషన్లలో ఉన్న 118 దేవాలయలకు గాను 480 సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారని, 14 కాలనీలు, 4 గ్రామాలకు గాను 380 కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలున్నాయని తెలిపారు. సమాజం పట్ల బాధ్యత తోనే సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి పౌరుడు పోలీసులే, క్రైమ్ విషయంలో మనమందరం భాగస్వాములు కావాలని సూచించారు.

ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానం అని చెప్పారు. మనిషి రోజుకు 8గంటలు పనిచేస్తే.. సీసీ కెమెరాలు 24గంటటూ పనిచేస్తాయని వెల్లడించారు. నేరాలను అరికట్టడంతో సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే రెండు నెలల్లో మరో 360 కమ్యూనిటీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల సహకారంతోనే ఈ కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగలిగాం అని చెప్పారు. రాచకొండ లో మొత్తం రెండు లక్షల, ఇరవై ఒక్కవేల, యాభై తొమ్మిది సీసీ కెమెరాలు ఉన్నాయాని వెల్లడించారు. ఆయన వెంట ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, క్రైమ్ డీసీపీ, ఎస్ బి డీసీపీ, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఎల్బీనగర్ , వనస్థలిపురం ఏసీపీలు కృష్ణయ్య, కాశి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి విశేష సేవలందించిన బాబు జగ్జీవన్ రామ్

- జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి
- జలమండలిలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుక



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో భారత స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎండీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా ఆయన దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. అలాగే కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానమంత్రిగా డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ దేశంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల హక్కులు, అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేశారని అన్నారు. మనం సైతం ఎంతో మంది మహానుభావులను స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయ సాధన కోసం పని చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ నాయకులు జలమండలి ప్రధాన కార్యాలయం నుంచి ఎల్బీ స్టేడియం వద్దనున్న జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీని ఎండీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈఎన్‌సీ- ఆపరేషన్స్ -2 డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ఆపరేషన్స్ -1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, కార్యక్రమం కోఆర్డినేటర్ సీజీఎం పద్మజ, సీజీఎంలు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, వినోద్ భార్గవ, ప్రభు, నాగేందర్, చంద్ర జ్యోతి, కేదారేశ్వరి, జీఎంలు, జలమండలి ఎస్సీ ఎస్టీ, బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా స్వామ్యాన్ని అవహేళన చేస్తున్న కేంద్రం

దేప భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నట్లు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఆరోపించారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పభుత్వం ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న విషయాన్ని, భాగస్వామ్య పక్షాల విధానాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలని సూచించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు మహే శ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు జల్ పల్లి మున్సిపాలిటీలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించినట్టు తెలిపారు. జై భీమ్, జై బాబు జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడయాత్ర ద్వారా దేశ ప్రజలను సమనత్వం, సౌభ్రాత్వంతో చైతన్యవంతం చేశారన్నారు. 11 ఏండ్లుగా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను కాల గర్భంలో కలిపేసే ప్రయత్నం బీజేపీ చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జై బాబు, జగ్జీవన్ రామ్, జై భీమ్ జై సంవిధాన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్,సీనియర్ నాయకులు షేక్ జాంగిర్, మాజీ కౌన్సిలర్లు యాదగిరి, లక్ష్మి నారాయణ, నాయకులు యూసఫ్ ఖాద్రి,తయాబ్ దహని,ఫజిల్ ఖాద్రి, చంద్రమౌళి, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ - సిటీబ్యూరో

అనాథ విద్యార్థులకు మేమున్నామంటూ రిటైర్డ్ ఉద్యోగి అల్లాడి లక్ష్మీనారాయణ సువర్ణ దంపతులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఉదారతను చాటుకున్నారు. వనస్థలిపురం హిల్స్ కాలనీలోని శ్రీ ఆదిత్య ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్లో వి.మహేష్, పి.గోపి అనే అనాథ విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారు. వారి పరిస్థితి తెలుసుకొని ఆ విద్యార్థులకు తమ నివాసంలో పదివేల రూపాయలను బుక్స్ మరియు దుస్తుల కోసం ఆ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ ఆదిత్య స్కూల్ చైర్మెన్ కె ఎస్ వి సుధాకర్ మాట్లాడుతూ .. ఎల్బీనగర్లోని అనాథ విద్యార్థి గృహంలో ఉంటూ ఈ విద్యార్థులకు మా పాఠశాలలో ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల పరిస్థితిని తెలుసుకొని వారికి ఆర్థిక తోడ్పాటు అందించడం చాలా అభినందనీయమని అన్నారు. అనాథ విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయాన్ని ఆ దంపతులు అందిస్తూ ఉండడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, అడ్మిన్ ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు, అనాథ అతిథి గృహ నిర్వాహకులు రాజేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి'



నవతెలంగాణ-నాగోల్

వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రుల వారు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగించుకోవాలని ఎస్ఎంఎస్ డెవలపర్స్ ఎండీ సవిత రెడ్డి, కిమ్స్ సన్ షైన్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శ్రీవిద్య అన్నారు. కిమ్స్-సన్ షైన్ హాస్పిటల్స్ బేగంపేట్ వారి సౌజన్యంతో ఎస్ఎస్ఎస్ డెవలప్ వారి ఆధ్వర్యంలో నాగోల్ లో శనివారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ షుగర్, బిఎంఐ ఈసీజీ, జనరల్ కార్డియో, ఐ, డెంటల్, స్కిన్, ఫిజియోథెరపీ,వివిధ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 100 మంది కంటే ఎక్కువ పాల్గొని వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి సంబంధించిన డాక్టర్లు పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఫిజియోథెరపీ, డెంటల్, ఐ స్పెషలిస్ట్, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజల దాహం తీర్చడానికి చలివేంద్రాలు తోడ్పడతాయి



నవతెలంగాణ- మేడ్చల్

పేద ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని రాజబొల్లారం తండా మాజీ ఎంపీటీసీ అంకితా రవి అన్నారు. మేడ్చల్ చెక్ పోస్ట్ నుండి మజీద్ పూర్ వెళ్లే దారిలో రాజబొల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని క్షేత్రగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమాన్ వద్ద అంకిత రవి ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దారిలో ప్రయాణించే ప్రయాణికులు, ఆలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లుగా వారు తెలిపారు. కార్యక్రమంలో మాలోత్ పాండు నాయక్,మాలోత్ రాజు నాయక్,మాలోత్ రవి నాయక్, కాత్రోత్ సాయికుమార్ పాల్గొన్నారు.

దంత వైద్య సేవలను వినియోగించుకోవాలి

- కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పీహెచ్‌సీలో నిర్వహించే రకరకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు, దంత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారని, దీనిని వినియోగించుకోవాలని కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన దంత వైద్య సేవలకు సంబంధించిన పరికరాలను ఆరోగ్య కేంద్రం చైర్మెన్, కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దంత వైద్య సేవలకు సంబంధిత పరికరాలు పెట్టడం చాలా సంతోషకరం అని డాక్టర్లను ప్రశంసించారు. ప్రజలందరూ దంత సమస్యలకు ఉచితంగా సేవలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమములో డాక్టర్ థెరిసా రెడ్డి, వినోద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ టాప్

- ప్రశంసలు అందుకున్న కమిషనర్ త్రిళేశ్వర్ రావు
- ప్రజల భాగస్వామ్యంతోనే నగర సమగ్రాభివృద్ధి
- మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మొదటి స్థానం దక్కించుకుంది. ఈ ఏడాది రూ.23.72 కోట్లకుగానూ రూ.20.90 కోట్లు వసూలయ్యాయి. దీంతో 88 శాతంతో జిల్లాలో మొదటి స్థానం, కార్పొరేషన్లలో మొదటిస్థానం, రాష్ట్రంలో 10వ స్థానం దక్కించుకుంది. పన్నుల చెల్లించేపులో ప్రజలకు అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించారు. దీంతో ఈ ఘనత దక్కింది. ఇందులో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ డా. శ్రీదేవి చేతులమీదుగా మున్సిపల్ కమిషనర్ త్రిళేశ్వర్ రావు జ్ఞాపికను అందుకున్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ ఘనత దక్కిందని, తద్వారా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో దోహదపడుతుందని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి ఆదర్శంగా నిలిపిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటేశ్వర నగర్ పార్కు ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ వెంకటేశ్వర నగర్ మున్సిపల్ పార్కు సుందరీకరణ పనులు పూర్తికావడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్కు వాకర్స్‌కు, సాయం కాలం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించే డివిజన్ ప్రజలకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర నగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీపతి, వీరభద్రరావు, బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, గుమ్మడి జంపాల్ రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్ గౌడ్, నవీన్ గౌడ్, పూస రమేష్, రామకృష్ణ, దేవేందర్ కుమార్, భూపతి అశోక్, రాంచర్ల బాల నరసింహ, కొయ్యడ జయపాల్, కిరణ్, కుమార్, తిరుపతి, అజయ్, సలీం, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, భాగ్యమ్మ, జ్యోతి, భారతి కాలనీవాసులు తదితరులున్నారు.

త్వరలో అంబేద్కర్ వంతెనపై నుంచి రాకపోకలు



- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

నవతెలంగాణ - చర్లపల్లి

అంబేద్కర్ విగ్రహం వంతెనపై నుండి త్వరలోనే రాకపోకలు ప్రారంభం అవుతాయని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. నాచారం డివిజన్‌లోని భవానీ నగర్ రోడ్డులో నాచారం పెద్ద నాలాపై అంబేద్కర్ విగ్రహం వద్ద రూ.94 లక్షలతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. శనివారం వంతెన పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..వంతెనను నాణ్యాతా ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజల రాకపోకలకు అనుకూలంగా ఉండేలా దాదాపు పది మీటర్ల వెడల్పుతో విశాలంగా నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. పనులను మరింత వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, భూపాల్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, భాను, వాసు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సంధ్యారాణికి ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-అల్వాల్

ప్రభుత్వ బాలికల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి పదవీ విరమణ సందర్భంగా పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయ కుమారి ముఖ్యతిథులుగా హాజరయ్యారు. సంధ్యారాణి 11 ఏండ్లుగా గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలుగా పని చేశారు. ఆమె పాఠశాలలో పనిచేసిన కాలంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని ప్రో కర్మ, ఇతర దాతల సహకారంతో అభివృద్ధి చేశారని విద్యాశాఖాధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాలికల అసిస్టెంట్ హెచ్‌ఎం సునీత, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వసంత, రమేష్, ఎంఈఓ మురళీకృష్ణ, సంధ్యారాణి కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

10 నుంచి 12 వరకు 'విజ్ఞాన్ ప్రజ్వాలాన్-2025'

- విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఘట్కేసర్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఉన్న విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో "విజ్ఞాన్ ప్రజ్వాలాన్ 2025" కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల పోస్టల్, పేపర్ ప్రెసెంటేషన్, ఆటలు, ఇంకా మరెన్నో టెక్నికల్ పోటీలో అన్ని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు అడ్వర్టిస్మెంట్‌లో చూపించిన మొబైల్ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు నాయుడు తెలిపారు.

బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



నేరేడ్‌మెట్‌లో..



ఘట్కేసర్‌లో..



అల్వాల్‌లో..

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
- పలు చోట్ల జగ్జీవన్ రామ్ గ్రహాలకు పలువురు నివాళి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, రావుల అంజయ్య, జేఏసీ వెంకన్న , కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నగర్ డివిజన్‌లో

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వినాయక నగర్ డివిజన్‌లోని బీఆర్ అంబేద్కర్, బాబు జాగ్జీవన్ రామ్‌ల విగ్రహాలకు కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల శ్రీనివాస్, నాయకులు పాండు రంగాచారి, బాలాజీ నేత, మధు, అనిల్ వంశీ, సందీప్, నరేందర్, కృష్ణ, అర్వ రాజు, చంద్ర కాంత్, సూర్య ప్రతాప్, పిఎస్ఆర్ గ్రూప్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ మల్కాజిగిరిలో

ఓల్డ్ మల్కాజిగిరిలోని బొడ్రాయి వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే మర్రి రాజ శేఖర్ రెడ్డి, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌లు నివాళులర్పించారు. శుక్రవారం గుజరాత్‌లోని జాం నగర్‌లో భారత వైమానికి దళ పైలట్ సిద్ధార్థ యాదవ్ మరణానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందు యాదవ్, సునీల్ యాదవ్, జోగు వెంకటేష్, వేణు యాదవ్, వెంకట్ యాదవ్,రవి, ఆచార్య జైకృష్ణ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘట్కేసర్‌లో..

బాబు జగ్గీవన్ రాం జయంతి సందర్భంగా మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమానికి తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే లిమలిపేద్ది సుధీర్ రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ హాజరై బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మామిళ్ళ ముత్యాలు యాదవ్ , కొంతం అంజి రెడ్డి, మాజీ బ్యాంకు డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ , ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు మాజీ సర్పంచ్ వేముల మమతా గౌడ్, తదితరులున్నారు.

ఆల్వాల్‌లో..

ఆల్వాల్ సర్కిల్‌లోని సీఆర్ బ్యాంక్వెట్‌లో, నాగిరెడ్డి నగర్ కాలనీ క్రాస్ రోడ్ సమీపంలో జరిగిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా సమావేశంలో పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు ఆచార్య, జిల్లా నాయకులు చింతల మాణిక్య రెడ్డి, ఎస్. మల్లారెడ్డి, సునీత యాదవ్, అజయ్ రెడ్డి, కార్తీక్ గౌడ్, సూర్య తదితరులు నివాళలర్పించారు.

వెంకటాపురంలోని యాదమ్మ నగర్‌లోలో..

135వ డివిజన్ వెంకటాపురంలోని యాదమ్మ నగర్‌లో నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతికి ఎమ్మెల్యేమర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమ్మవారి గుడి వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్,కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ , మధు, రాము, వెంకటేష్, సురేష్, నరసింహ, పవన్, లోకేష్, సతీష్, రమాదేవి పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్ మండలంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్, గుడ్లపోచంపలిలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పలువురు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, కుండా భానుచందర్,మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మారేపల్లి సుధాకర్, మాజీ కౌన్సిలర్లు హేమంత్ రెడ్డి,బేరి బాలరాజ్, దొడ్ల మల్లికార్జున్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్, నాయకులు మర్రి నర్సింహ రెడ్డి, సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్, తదితరులున్నారు.

చర్లపల్లిలో..

నాచారం రాఘవేంద్ర నగర్‌లో శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. దళిత సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు నల్ల రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ హాజరై జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ కన్వీనర్ కరాటే శ్రీరామ్, మాకుల సంజన్న, దేవులపల్లి యాదగిరి, ఎమ్మార్పీఎస్ అంజి మాదిగ, ఆరెపోగు ప్రమోద్, వేముల మారయ్య, అశోక్, ఏళ్ల సంతోష్, రమేష్,బొడ్డు శివ, బొజ్జ యాదగిరి, దాసరి కర్ణ, హెచ్ఆర్ మోహన్, మామిడాల సంతోష్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, నరసింహ, వాసు, రఫిక్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడలో..

బాబు జాగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకొని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్, అంబేద్కర్ యూత్ కుషాయిగూడ ఆధ్వర్యంలో కుషాయిగూడ కూరగాయల మార్కెట్ యార్డ్ దగ్గరలోని బాబు జాగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి, పండాల శివకుమార్ గౌడ్, పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య యాదగిరి, అనిల్ బాబు, యాపపురం రవి, చల్లా వెంకటేష్, పండాల గణేష్ గౌడ్, చిదం బాల్నర్సింహా వంశరాజ్, హనుమంతు, దయానంద్, క్రాంతి, సాకేత్, బుడంపల్లి వెంకటేష్, ఉల్లిగడ్డ వెంకటేష్, దుసరి శంకర్, బాలరాజు, నీరుడు బాబు, మల్లేష్, శ్రవణ్, లక్ష్మణ్, స్వామి, శ్రీ రాములు, నాని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో..

పోచారం మున్సిపల్ పరిధిలో కాచివాని సింగారంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ 118 జయంతిని కాచవాని సింగారం మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు చుంచు నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ప్రధాన కార్యదర్శి కిన్నెర రత్నాకర్, కిన్నెర రవి, ఎండీ ముస్తఫా, నాగరాజ్, వెంకటేష్, సాయికుమార్, చితులూరి శ్రీనివాస్ గౌడ్, సాయితేజ, మధు ఉన్నారు.



మేడ్చల్‌లో..



చర్లపల్లిలో..



జవహర్ నగర్‌లో..



పోచారంలో..

బాబు జగ్జీవన్ రామ్ జయంతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేరేడ్‌మెట్ ప్రధాన కూడలి ఎక్స్ రోడ్డులో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహా నికి నేరేడ్‌మెట్ షెడ్యూల్డ్ కులాల పరి రక్షణ సంఘం, ఎస్సీఆర్‌పీ సొసైటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరూ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతకుముందు పాత నేరేడమేట్ అంబేద్కర్ భవన్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి అధ్యక్షులు పీఎస్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రధాన కార్యదర్శి గంగాధరి కష్ణ, తదితర కమిటీ సభ్యులు, బస్తీ వాసులు పాల్గొని కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేశారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం

- సెరినిటీ స్కూల్ స్పెషల్ కరస్పాండెంట్

నోముల జంగిరెడ్డి



నవతెలంగాణ-కీసర

విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, విద్య అంటే కేవలం పుస్తకాల చదువు మాత్రమే కాదని, మంచి ప్రవర్తన, సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా తీర్చిదిద్దడం కూడా విద్యా వ్యవస్థ లక్ష్యం అని సెరినిటీ స్కూల్ స్పెషల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. శనివారం నాగారం సెరినిటీ మోడల్ హైస్కూల్లో ఐఐటీ ఫౌండేషన్ పరీక్షల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా నోముల జంగిరెడ్డి, ముఖ్య కార్యదర్శి నోముల వసంత రెడ్డి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా జంగిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి విద్య, జ్ఞానం పెంపొందించడం, అన్ని రంగాల్లో సిద్ధం చేయడమే లక్ష్యమని తెలిపారు. విద్యతో పాటు ఆటల పోటీలు, యోగా, వ్యాసరచన వంటి రంగాలలోనూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుబ్బారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

సాయి సిద్ధార్థ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

- 9 మంది విద్యార్థులకు రూ.25 వేల నగదు అందజేత



నవతెలంగాణ - జవహర్ నగర్

దమ్మాయిగూడలోని సాయి సిద్దార్థ నగర్‌లోని సాయి సిద్దార్థ హైస్కూల్‌లో యూకేజి నుండి ఐదో తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వేడుకలను శనివారం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పిల్లల చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక మాజీ కౌన్సిలర్ ముప్పా శ్రీలత రామారావు పాల్గొని పాఠశాల యాజమాన్యం ప్రకటించిన గతేడాది పదో తరగతి లో 10గ్రేడ్ సాధించిన కీర్తన, బిందు, సహస్ర, బోధిని, ప్రేమ్ చరణ్, సాయి హేమంత్, దీక్షిత, సంయుక్త, గీతిక, జాగృతి, 9 మంది విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.25 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సత్య మాట్లాడుతూ చిన్న తనంలోనే పిల్లలకు మంచి అలవాట్లను నేర్పించాలని, నేటి బాలలే రేపటి పౌరులని గుర్తు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమ తులను అందజేశారు. చిన్న తనం నుంచే పిల్లలకు చదువుతూ పాటు క్రీడలు, వారికీ ఆసక్తి ఉన్నా రంగాలలో వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో నూటికి నూరు శాతం ఉత్తమ ఫలితాలను సాధిస్తామని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పారితోషికం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి తండ్రులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లో తన నివాసం వద్ద నియోజక వర్గ ప్రజలతో శనివారం కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతిపత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సంక్షేమనికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గం ప్రజల స్థానిక సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘం నాయకులు,మహిళ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

వెర్ ఈజ్ ద పార్టీ రెస్టారెంట్ ప్రారంభం..





నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో ఏర్పాటు చేసిన వెర్ ఈజ్ ద పార్టీ రెస్టారెంట్‌ను శనివారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పార్థసారథి, మాదాపూర్ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, భిక్షపతి ముదిరాజ్, మియాపూర్ బీఆర్ఎస్ నాయ కురాలు రోజా, కలిదిండి. కిరణ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులకు అడ్డుకట్ట పడేదెప్పుడు..

- కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలకు కళ్లెం వేసేదెవరు..?
- పది ఫలితాలు రాకముందే అడ్మిషన్లు ప్రారంభం
- ఇంటర్ అడ్మిషన్ల కోసం ఆఫర్ల వెల్లువ
- అయోమయానికి గురవుతున్న తల్లిదండ్రులు
- అడ్డగోలు దోపిడీకి రంగం సిద్ధం చేసిన కార్పొరేట్ సంస్థలు
- నిబంధనలకు నీళ్లొదులుతున్న కార్పొరేట్, ప్రయివేటు స్కూల్స్
- అధిక ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోని విద్యాశాఖ

విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే తమ పిల్లల విషయంలో తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. నగర, శివారు పరిధిలోని పలు ప్రాంతాలల్లో పాఠశాల యాజమాన్యాలు తమ అభీష్టం మేరకు ప్రతి సంవత్సరం ఫీజులను ఇబ్బడి ముబ్బడిగా పెంచేస్తున్నారు. చాలా సందర్భాలలో వీటి నియంత్రణకు తగిన చట్టాలు ఉన్నాయా లేదా అని ఆలోచించకుండా తమ ఇష్టానుసారంగా కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో ఒక్కపూట వస్తులుండి పిల్లల చదువుల కోసం ఆరాటపడుతూ ఓవైపు జీవన పోరాటం చేస్తున్నారు. పెరుగుతున్న ఇంటి అద్దెలతోపాటు నిత్యావసర ధరలు, విద్యుత్ బిల్లులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల భారంతో చిన్నాభిన్నమైన జీవితాలు కుటుంబ భారంతో సతమతమవుతున్నారు.

నవతెలంగాణ-బాలానగర్

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజులు భారీగా పెరిగాయి. పలు స్కూళ్లు, కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను దాదాపు పూర్తి చేశాయి. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ స్కూళ్లతో పాటు కళాశాలలు కొంత పేరున్న స్కూళ్లల్లో క్రితం ఏడాదితో పోలిస్తే 20-25 శాతం మేర ఫీజులను పెంచినట్టు సమాచారం. ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలన్న ప్రభుత్వ ఆలోచన ఆచరణలోకి రాకపోవడంతో ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే గరిష్ఠంగా 10శాతం కంటే తక్కువగానే ఫీజులను పెంచుకోవాలన్న మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాన్ని కూడా ప్రస్తుతం పాటించడం లేదు. దీంతో ఫీజుల చెల్లింపుపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు సంపాదనే ధ్యేయంగా పలు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చటంతో విద్యను కొనలేక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్న పరిస్థితి చోటుచేసుకుంటుంది. పదవతరగతి పరీక్షలు ముగియకమునుపే కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలలు అడ్మిషన్ల పేరుతో అడ్డగోలు ఫీజుల దోపిడీకి తెరలేపారు. ఈ ఏడాది పదో తరగతి చదువు పూర్తికానున్న విద్యార్థుల వివరాలు, ఫోన్ నెంబర్లను తెలుసుకుని అక్కడ దేగల్లాగా వాలిపోతున్నారు. ఇంటర్‌లో చేరేవారికి సంవత్సరానికి దాదాపు రూ.80 వేల నుంచి లక్షల వరకు వసూలు చేస్తున్నారు. . నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతున్నా విద్యాశాఖాధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



యాజమాన్యాలపై చర్యలేవీ..?

నిబంధనలు పాటించని యాజమాన్యాలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వారి ఆగడాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. నర్సరీ నుంచి పదవ తరగతి వరకూ ముందస్తు అడ్మిషన్లకు తెరలేపి అందిన కాడికి దండుకుంటున్నాయి. నర్సరీకే రూ.10 వేల నుంచి రూ. 25 వేల వరకూ ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారు. దీనికి స్కూల్ యూనిఫాం, పుస్తకాలు అదనం. వీటన్నింటిని అంగీకరించి ముందుగానే అడ్మిషన్ ఫీజు మొత్తం చెల్లించాలి. లేకపోతే అడ్మిషన్ ఇచ్చేదే లేదని తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం పదవ తరగతిలోపు విద్యార్థులకు రూ.10 వేలలోపే ఫీజులు వసూలు చేయాల్సి ఉంది. కానీ, ఈ నిబంధన ఎక్కడా అమలుకు నోచుకోవడంలేదు.

ఆగడాలకు అడ్డుకట్ట వేసే వారేరీ.?

తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని ప్రయివేటు స్కూల్స్ వైపు మొగ్గుచూపుతున్నారు. దీని ఆసరాగా తీసుకున్న కార్పొరేట్, ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లొది వసూళ్ల పర్వానికి తెరలేపుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ విద్యా సంస్థ కూడా డొనేషన్లు వసూలు చేయకూడదు. పాఠశాలల్లో, కళాశాలలో తాము వసూలు చేసే ఫీజు వివరాలను తరగతుల వారీగా నోటీసు బోర్డులో ఉంచాలి. కానీ, ఈ నిబంధన ఏ ఒక్క పాఠశాలలో కూడా అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు.

పాఠశాలల దందాలు విపరీతంగాపెరిగిపోతున్నాయి..



ఓల్డ్ బోయిన్ పల్లి, ఫిరోజ్ గూడ, బాలానగర్, రాజు కాలనీ, గౌంనగర్, హైదరాబాద్ నగరంలోని నడిబొడ్డులో ఉన్న ప్రాంతాలలో సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ పేరుతోపేరుతో అనేక పాఠశాలలు విచ్చలవిడిగా పుట్టగొడుగుల్లా వెలిసి వేలకొద్ది ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల జీవితాలతో, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నా పాఠశాలల దందాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. విద్యాశాఖ వారిచేత ఒక బిల్డింగ్ లో పాఠశాల అనుమతిని తీసుకొని అయిదారు బిల్డింగులలో పాఠశాలలను నిర్వహిస్తున్నారు.ఈ పాఠశాలలకు సరైనటువంటి సేఫ్టీ వాల్ లేకపోవడం వలన చాలామంది విద్యార్థిని విద్యార్థులు డ్రగ్స్ మరియు సిగరెట్ లాంటి వ్యసనాలకు లోనవుతు వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఇలాంటి పాఠశాలలను ప్రభుత్వ విద్యాశాఖ వారు తక్షణమే గుర్తించి వాటి ప్రభుత్వ అనుమతిని వెంటనే రద్దు చేయాలి.

-ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జి. కార్తీక్

రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి..



విద్య వ్యాపారంగా మారిపోయింది. పాఠశాలలు విద్యార్థులకు సమగ్ర విద్యను ఇవ్వకుండా రకర కాల పేర్లతో పాఠశాల స్థాయిలోనే ఐఐటీయన్‌లను, మెడి కోలను, ఐఏఎస్‌లను తయారు చేస్తామని ఊదరగొట్టి పిల్లల భవిష్యతును నాశనం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. కారణాలేమై నా సరే ఈ చట్టాన్ని తీసుకొచ్చే విషయంలో వెనకడుగు వేయ కూడదు. ప్రయివేటు పాఠశాలలో, కళాశాలలో అడ్మిషన్, ట్యూ షన్ ఫీజు లేకుండా ఇతర ఫీజులనూ పెంచారు. ఆఖరికి డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగాయని రవాణా చార్జీలనూ పెంచారు. ఫలితంగా విద్యార్థులపై ఆర్థిక భారం పెరుగు తోంది. నిత్యావసర ధరలు పెరిగాయని విద్యా సంస్థలు ఫీజులు పెంచడం సమంజసం కాదు. ఫీజులు ఎందుకు పెంచుతున్నారో రివ్యూ ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు పెంచడాన్ని వెనక్కి తీసుకోవాలి. లేని పక్షంలో భారత ప్రజాతంత యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) విద్యార్థుల, తల్లిదండ్రుల పక్షాన ఉద్యమిస్తుంది.

-బి. చైతన్య రెడ్డి డీవైఎఫ్ఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి

కేసీఆర్‌కు పదేండ్లు పడితే.. రేవంత్‌రెడ్డి పతనానికి 10 నెలలే పట్టింది

- డివిజన్ అధ్యక్షులు, అపై నాయకులు 24 గంటలూ అందుబాటులో ఉండాలి
- లేకపోతే రాజీనామా చేయండి
- బీజేపీ మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా విస్తతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మాజీ సీఎం కేసీఆర్ పతనానికి పదేండ్లు పడితే.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పతనానికి కేవలం 10 నెలలే పట్టిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా విస్తతస్థాయి కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడిచిన 10 నెలలుగా అనేక సమస్యలపై కొట్లాడుతున్నామనీ, హైడ్రా మీద 3 నెలల పాటు కొట్లాడినామని తెలిపారు. గుడికి కూడా నోటీస్ అంటించిపోయిన దుర్మార్గమైనది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అని విమర్శించారు. హెచ్‌సీయూ భూములు తమ తాత జాగీరుగా విక్రయించిన రాష్ట్ర ప్రభుత్వానికి దిమ్మ తిరిగే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. పదవిని పొందేటప్పుడు ఉండే ఆరాటం పని చేసేటప్పుడు కూడా ఉండాలన్నారు. రాజీ పడే ప్రసక్తే లేదనీ, డివిజన్ అధ్యక్షుడు, ఆపైన నాయకులు 24 గంటలూ అందుబాటులో ఉండాలనీ, లేకపోతే రాజీనామా చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుల కోసం విపరీతమైన పోటీ ఉందంటే భవిష్యత్‌లో పార్టీ మరింత బలంగా ఉంటుందనడానికి ఇది సంకేతం అన్నారు. పార్టీ అధ్యక్షులందరూ గొప్పగా పని చేయాలనీ, మచ్చ తేకుండా పని చేయాలనీ, ప్రతి ఒక్కరినీ కలుపుకు పోవాలని విజ్ఞప్తి చేశారు. ఎవరు పోటీ చేసినా వ్యక్తులతో సంబంధం లేకుండా మన గెలుపు కోసం వారు ప్రయత్నం చేస్తారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్రంలో 35 శాతం, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో, ఈ జిల్లాలో 52 శాతం ఓట్లు, ఎల్బీనగర్ నియోజకవర్గంలో 65 శాతం ఓట్లు బీజేపీకి వేశారని తెలిపారు. అతివేగంగా నిధులు తీసుకొచ్చి ఖర్చు చేస్తున్న నియోజకవర్గం మల్కాజిగిరి అన్నారు. మన ఎంపీలు కేంద్రం నుంచి మన దగ్గర ఏం పనులు చేపిస్తున్నారు.. ఎన్ని డబ్బులు తీసుకొస్తున్నారు అనే విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కర్తవ్యం మీ అందరి మీద ఉందనీ, అలా చేస్తేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం గెలవగలం అని సూచించారు. రాజకీయ పార్టీలకు అంతిమ గీటురాయి గెలుపు ఓటములే అన్నారు. వక్ఫ్ బిల్లు అనేక సమస్యలకు పరిష్కారం అందిస్తుందనీ, అనేక మంది 30-40 ఏండ్లుగా భూ సమస్యలపై పడుతున్న బాధలకు పరిష్కారం ఇవ్వనుందని తెలిపారు.

చిరంజీవి హాస్పిటల్‌లో హైబ్రిడ్ వ్యాస్క్యులర్ చికిత్సలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

చిరంజీవి హాస్పిటల్లో హైబ్రిడ్ వ్యాస్క్యులర్ చికిత్సలు, అత్యాధునిక వైద్య సేవలను పేద ప్రజలకు అందు బాటులోకి తేవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చిరం జీవి హాస్పిటల్ అధినేత డాక్టర్ సంజీవరావు అన్నారు. ఇటీవల అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ఇద్దరు పేషెంట్లకు హైబ్రిడ్ చికిత్సలందించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. చికిత్సానంతరం కోలుకున్న ఆ ఇరువురు పేషెంట్లు.. చిరంజీవి హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞ తలు తెలియజేశారు. కేపీహెచ్బీ కాలనీలోని చిరంజీవి హాస్పిటల్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశ ంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ సంజీవరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మరెక్కడా లేని అత్యాధునిక హైబ్రిడ్ వ్యాస్క్యులర్ చికిత్సలను చిరంజీవి హాస్పిటల్లో అందిస్తు న్నామన్నారు. అంతర్జాతీయ స్థాయి హైబ్రిడ్ చికిత్సలతో పేషెంట్ల పాదాలకు.. వారి ప్రాణాలకు రక్షణ కల్పిస్తున్నా మన్నారు. ఇప్పటి వరకు 100కి పైగా అత్యంత క్లిష్టమైన కేసుల్లో హైబ్రిడ్ చికిత్సలందించి మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. హైబ్రిడ్ చికిత్సల్లో గొప్ప మైలురాళ్లుగా నిలిచిపోయే రెండు చికిత్సలను తమ హాస్పిటల్ నందు ఇటీవల విజయవంతంగా నిర్వహించామని అన్నారు. యాంజియోప్లాస్టీ, స్టెంటింగ్, ఓపెన్ సర్జరీలను అత్యాధునిక నైపుణ్యంతో సంయుక్తంగా నిర్వహించడాన్ని హైబ్రిడ్ చికిత్సగా పిలుస్తామని వివరించారు. సిద్ధయ్య అనే పేషెంటుకు ఉదార పొట్ట భాగంలో డీవీటీ సమస్య కారణంగా గతంలో వేరే హాస్పిటల్ నందు ఐవీసీ ఫిల్టర్ అమర్చారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మరెక్కడా ఇంత పెద్ద సంఖ్యలో ఈ చికిత్సలు నిర్వహించలేదని డాక్టర్ సంజీవరావు తెలిపారు. తమ హాస్పిటల్ నందు ఐదువేలకు పైగా వెరికోస్ వెయిన్స్ చికిత్సలు, అనేక అయోటిక్ సర్జరీలు పూర్తి చేసి రికార్డు సృష్టించామన్నారు. రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జరీ సేవలు తమ హాస్పిటల్లో అందుబాటులో ఉన్నట్టు డాక్టర్ సంజీవరావు వెల్లడించారు. ఈ సమావేశంలో హైబ్రిడ్ చికిత్సలతో స్వస్థత పొందిన సిద్ధయ్య, ఫకీరా పాల్గొని.. తమకు చికిత్స నందించి పునర్జీవితం ప్రసాదించిన వైద్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో చిరంజీవి హాస్పిట ల్ వైద్యులు డాక్టర్ లీనా, డాక్టర్ కె.వంశీకృష్ణ, డాక్టర్ శిల్ప, డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం సుభిక్షం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి
- సన్న బియ్యం తింటూ సంతోషం వ్యక్తపరచిన గర్భిణీ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రభుత్వ హయం లోనే రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. శనివారం గాజుల రామారం డివిజన్ పరిధిలోని జయశంకర్ నగర్ కాలనీలో సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వారితో భోజనం చేసిన గర్భిణీ స్త్రీ సన్న బియ్యం చాలా బాగా ఉన్నాయని సంతోషం వ్యక్తపరిచారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రజల సొమ్మును దోచుకుని పబ్బం గడుపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,కి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు లబ్ధిదారులతో కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపా రు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రషీద్ బేగ్, లాల్ మొహమ్మద్, మండవ శివ, మరలింగ, పవన్, మహేష్ గౌడ్, వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

దీక్ష కిడ్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

దీక్ష కిడ్స్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ, యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ మండల రికగ్నిషన్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ చైర్మెన్‌స్కూల్ కరస్పాండెంట్ పి.శివయ్య, వైస్ చైర్మెన్ మండవ శ్రీనివాస గడ్, నర్సిరెడ్డి జనరల్ సెక్రెటరీ రవికుమార్, వీరన్న హాజరయ్యారు. చైర్మెన్ శివయ్య ముఖ్య అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ... సాధారణంగా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు కాన్వొకేషన్ సర్టిఫికేట్ అందించడం జరుగుతుంది. అదేవిధంగా మా పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యను పూర్తి చేసిన చిన్నారి విద్యార్థులకు కాన్వొకేషన్ సర్టిఫికేట్ అందజేయడం చాలా ఆనందంగా ఉందని తన సంతో షాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా మా పాఠశాలలో చది వే విద్యార్థులందరికీ మంచి వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు చిన్నత నం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. దీనికై తల్లి దండ్రులు సహకారం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిం చారు. అదేవిధంగా పాఠశాల వైస్ ప్రిన్సిపల్ వీరేశం మాట్లాడుతూ... మా పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి కూడా అన్ని రంగాల్లో రాణించే విధంగా సమగ్ర అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దడానికి ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.కాన్వొకేషన్ సర్టిఫికేట్ అనంతరం విద్యార్థిని విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి చూపులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ రామ్ చిట్ ఫండ్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న క్రోమ్ షాపింగ్ మాల్ పైన మూడవ అంతస్తులోని శ్రీ రామ్ చిట్ ఫండ్ కార్యాలయంలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవి ంచింది. ఈ ఘటన పై అగ్నిమాపక శాఖ అధికారి జగన్ మోహన్ వెల్లడించిన వివరాలు.. శ్రీరామ్ చిట్ ఫండ్ కార్యాలయంలో ఫ్యాన్ రాత్రి మొత్తం ఆన్‌లో ఉండటం వల్ల, విద్యుత్ వైర్లు కాలిపోయి.. షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్ని ప్రమాదం జరిగి నట్టుగా వెల్లడించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైర్ ఇంజిన్ వాహనంతో మంటలను అదుపులోకి తెచ్చినట్టు తెలియజేశారు. ఈ ప్రమాదంలో ఫర్నిచర్, ఫైల్స్, ఫాల్ సీలింగ్ తగలబడ్డాయి.

జనంపల్లి జన్మదిన వేడుకలు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పీఏసీ చైర్మెన్ అరికెపూడి గాంధీ హాజరై.. శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్,సంజీవరెడ్డి, కార్పొరేటర్ రోజా దేవి, గొట్టుముక్కల భాస్కర రావు, గొట్టుముక్కల పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ పేరు పేరునా పురేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు ఎక్స్‌పోర అవార్డులు



నవతెలంగాణ-బాలానగర్

బోరబండ గాయత్రి నగర్ కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ఎక్స్పోర అవార్డులు గెలుచుకున్నారు.హైదరాబాద్ రవీంద్రభారతి ఎక్స్‌పోర అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జె.డి.లక్ష్మీనారాయణ, కృష్ణవే పాఠశాలల చైర్మెన్ రాజు సంగాని, కర్నల్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎక్స్పోర గొర్గి వెన్ స్టేట్ లెవెల్ మొదటి బహుమతి అఫ్రన్, అహ్మద్, అన్సారీ, రీజినల్ లెవల్‌లో మొదటి బహుమతి ఎస్.కె హద్వీన్, హుస్సేన్, జెడి లక్ష్మీ నారా యణ చేతుల మీదుగా ఎక్స్పోర అవార్డ్స్ అందుకున్నారు. కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ టి.వేణుగోపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

భూకబ్జాదారుల బరితెగింపు..

- హైడ్రా కమిషనర్ వచ్చినా లెక్కేలేదంటున్న భూ బకాసురులు
- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

హమ్ కిసీ సే కమ్ నహి..కౌన్ ఆయాతోభి హమ్ జాన్తే నహి.. అంటూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలో భూకబ్జాదారు లు బరితెగిస్తున్నారని సీపీఐనియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైడ్రా కమిషనర్ ఏవి. రంగనాథ్ ఈ ప్రాంతానికి వచ్చి రెండు రోజులు గడవక ముందే గాజుల రామారం డివిజన్‌లోని సర్వే నెంబర్ 325.లో ప్రభుత్వ భూమిలో పట్ట పగలే అక్రమ నిర్మాణాలు పుట్టగొడు గుల్లా వెలుస్తున్నాయని తెలిపారు. దీంతో ప్రభుత్వ భూమి హారతి కర్పూరంల కరిగిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం జగద్గిరిగుట్టలోని సీపీఐ కార్యా లయంలో భూ కబ్జాదారులు కనీసం భయం లేకుండా నిర్మాణాలు చేప డుతున్న తీరు విస్మయానికి గురి చేస్తుందన్నారు. కుత్బుల్లాపూర్ మండల కార్యాలయం కూతవేటు దూరంలో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరు గుతున్న అధికారులు కనీసం వాటిని ఆపకపోవడం పలు విమర్శలకు తావిస్తుందన్నారు. అధికారులు కబ్జాదారులను అరెస్టు చేసి జైలు కు పంప కుండా వాళ్ళను, లేక వాళ్లకు మద్దతు ఇచ్చే నాయకులు, అధి కారులకు లొంగడమే కారణమని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు తుతుమంత్రాంగ చర్యలు తీసుకోకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో వచ్చే వారం ఈ అధికారులపైన కలెక్టర్,హైడ్రా కమిషనర్‌లకు సీపీఐగా పిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి శనివారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. బాచుపల్లి నివాసి బాలరాజు కు రూ.60వేలు, నిజాంపేట్ కార్పొరేషన్ కొమరమ్మ యాదవ్‌కు రూ.60 వేలు, రమేష్ వరపు వెంకటసూర్య కుమారికి రూ.60 వేలు, టేకుముడి శాంతి ప్రియకు రూ. 60 వేలు, సర్కిల్లోని 125వ డివిజన్ వాసులు సంబోజు మురళి చారికి రూ.60 వేలు, రాముని విజయకు రూ. 40 వేలు, నరసింహారెడ్డికి రూ.47,500, 126వ డివిజన్ కరుణాకర్ రావుకు రూ.60 వేలు, 127వ డివిజన్ మంజులకు రూ.23,500, సూరారం మహమ్మద్ నూర్జంకు రూ.14000, పట్ల రాజిరెడ్డికి రూ.60 వేలు అందజేశారు. ఈ సందర్భంగా హనుమంత రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఈ సహాయం అందించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, బోయిని వెంకటేష్,కొలను జీవన్ రెడ్డి, అంజాద్, 125 వ డివిజన్ అధ్యక్షుడు ఎండీ.లాయక్, గఫార్, అజయ్, అమీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | ఏప్రిల్ 06, 2025 | www.navatelangana.com

తమిళనాడులో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డా.నరేష్



నవతెలంగాణ-ఓయూ

ప్రతిష్టాత్మకమైన న్యూక్లియర్ రియాక్టర్ల ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన ఇందిరా గాంధీ అణు పరిశోధనా సంస్థ, కల్పక్కం తమిళనాడులో జరిగిన మూడు రోజుల కాన్ఫరెన్స్‌లో ఉస్మానియా యూనివర్సిటీ భౌతిక శాస్త్ర పరిశోధకులు డాక్టర్ పల్లాటి నరేష్ తన పరిశోధనలు సమర్పించి ప్రముఖుల మన్ననలు అందుకున్నారు. మెటీరియల్స్ వాటి జీవ, రేడియోధార్మిక అనువర్తనాలపై తను చేసిన పరిశోధనలు మాక్స్ 25 కాన్ఫరెన్స్‌లో వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధనా సంస్థల నుండి అనేకమంది శాస్త్రజ్ఞులు శాస్త్రవేత్తలు హాజరైన ఈ శిబిరంలో పాల్గొని ఉస్మానియా కీర్తిని చాటారు. పల్లాటి ప్రస్తుతం సైఫాబాద్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) గా పనిచేస్తున్నారు..

చలివేంద్రం ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

రహమత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లో బోడి గంగ ప్రసాద్ ఏర్పాటు చేసిన నాయి బ్రాహ్మణ సభలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానం, చలివేంద్ర కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు, కాంగ్రెస్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జీవితం ఆదర్శప్రాయం

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి
- జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్‌కు ఘనంగా నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలిచిన భారత మహానాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని జీహెచ్ ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని, శనివారం జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డా.బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమర యోధుడిగా సామాజిక సమానత్వానికి అంకితభావంతో పనిచేసిన గొప్పనేతయని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని, వారి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం నూతన భారత నిర్మాణంలో కీలకపాత్ర వహించారన్నారు. ఆయన వివిధ మంత్రిత్వ శాఖల్లో పలు బాధ్యతలు చేపట్టి ప్రజాసేవకు అంకితమయ్యారని, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో ఆయన పాత్ర అమూల్యమైనదని వారి సేవలను కొనియాడారు. డా. జగ్జీవన్ రామ్ ఆశయాలు, ఆలోచనలతో ఉద్యోగులు, యువత సమాజంలో సమానత్వం, సౌభ్రాతత్వం పెంపొందేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు వేణు గోపాల్, చంద్రకాంత్ రెడ్డి, వేణుగోపాల్, యాదగిరిరావు, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వ రెడ్డి, సీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, ఏఎంసీ జీవన్ కుమార్, సూపరింటెండెంట్ సక్కు బాయి తదితరులు పాల్గొని జాగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

కిక్కు దిగింది...



- వారంలో 1029 కేసులు
- అధిక సంఖ్యలో చిక్కిన యువకులు
- 41 మంది జైలుకు తరలింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో అధిక శాతం రోడ్డు ప్రమాదాలు వాహనదారుల నిర్లక్ష్యంతోపాటు, మద్యం సేవించి వాహనాలు నడిపించడంతో చోటు చేసుకుంటున్నాయి. మద్యం బాబుల ఆగడాలను కట్టడి చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించి వారిని పట్టుకుంటున్నారు. అయినా కొందరు వాహనదారులు అవేమీ పట్టించుకోకుండా అర్ధరాత్రి వరకు పూటుగా మద్యం సేవించి రోడ్లపై హంగామా సృష్టిస్తున్నారు. అలాంటి వారి ఆగడాలకు ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ ఎనలైజన్‌తో అడ్డుకట్ట వేస్తున్నారు.

వారి సంఖ్యే అధికం

గత నెల 29 నుంచి ఈ నెల 4 వరకు నగర పోలీస్ కమిసనరేట్ పరిధిల్లో (వారం రోజులపాటు) వివిధ ప్రాంతాలల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు. నగర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 1029 మంది మందుబాబులు పోలీసులకు చిక్కారు. వారిపై కోర్టులో ఛార్జిషీట్ నమోదు చేశారు. వారిని నాంపల్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టడంతో 41 మందికి జైలు శిక్ష, జరిమానాలు విధించారు. మిగిలిన వారికి జరిమానాతోపాటు హెచ్చరించి పంపించారు. పట్టుబడిన వారిలో 28 మంది 18 నుంచి 20 మధ్య వయసున్నవారు కాగా, 21 నుంచి 30 వయసు మధ్యగల యువకులు అధిక సంఖ్యలో ఉన్నారు. వారు 419 మందికాగా, 31 నుంచి 40 ఏండ్లవారు 305 మంది పట్టుబడ్డారు. 41 నుంచి 50లోపువారు 180కాగా, 51 నుంచి 60 వయస్సు గల వారు 72, ఇక 61 సంవత్సరాలకు పైబడిన వారు 25కిపైగా ఉన్నారు. అందులో 1025 మంది పురుషులుకాగా నలుగురు మహిళలున్నారు. అందులో 886 మంది ద్విచక్ర వాహనదారులుండగా, 37 మంది ఆటోలు, 102 కార్ల యజమానులున్నారు. 4 హెవీవెహికిల్స్ వారు ఉన్నారు. కొందరి డ్రైవింగ్ లైసెన్స్‌లను సైతం రద్దు చేశారు.

అవసరమైతే కళాశాలలకు సమాచారం..

మద్యం సేవించి వాహనాలు నడిపిస్తూ పట్టుబడిన వారిని కోర్టులో ప్రవేశపెడుతున్నామని జాయింట్ కమిషనర్, ట్రాఫిక్ బాస్ జోయల్ డేవిస్ తెలిపారు. అంతేకాకుండా వారి తల్లిదండ్రులకు, బంధువులకు, స్నేహితులకు సమాచారం అందిస్తున్నామని వివరిం చారు. తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. మరోసారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే కళాశాలలకు సైతం సమాచారం పంపిస్తామన్నారు.

ఘనంగా ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు



నవతెలంగాణ-ఓయూ

అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో భాగంగా రెండో రోజు విద్యార్థుల సజనాత్మక ప్రతిభతో ఠాగూర్ ఆడిటోరియంలో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. శాస్త్రీయ సంగీతం నుంచి సమకాలీన రాగాల వరకు విభిన్న శైలిలో విద్యార్థులు సంగీత విభాగంలో తమ ప్రతిభను ప్రదర్శించారు. భారతీయ, పాశ్చాత్య జానపద సంగీతం మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. బృంద గానం, సోలో, భారతీయ, వెస్టన్, జానపద కళారీతులతో యువతీ యువకులు తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ఓయూ అనుబంధ కళాశాలల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్న విద్యార్థులతో ఠాగూర్ ఆడిటోరియం సందడిగా మారింది. సంగీత విభాగంలో పోటీలకు ప్రఖ్యాత సంగీత నిపుణులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మరోవైపు ఉపన్యాస పోటీలకు కూడా మంచి స్పందన కనిపించింది. విద్యార్థులు తమ ఆధునిక ఆలోచనాత్మక ప్రసంగాలు చేశారు. ఉపన్యాస పోటీలకు ప్రొఫెసర్ బి. మంజుల. డాక్టర్ నవీన్ సౌద న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. 188 కళాశాలల నుంచి 800 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పైగా రెండు రోజుల పాటు జరిగిన ఉస్మానియా అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి జాబితాను వచ్చే వారం ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. జాబితాను నేరుగా ఆయా కళాశాలలకు అందజేయనున్నట్లు వివరించారు. బృంద విజేతలు, వ్యక్తిగత ప్రదర్శనల్లో విజేతలు మరో సారి ఓయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 26న తమ ప్రతిభను మరోసారి ప్రదర్శిస్తారు. ఆ రోజే బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ప్రో.రాజేందర్ నాయక్ పేర్కొన్నారు.

విద్యార్థి వ్యవహారాల డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను విద్యార్థి సంక్షేమ వ్యవహారాల డీన్ ప్రొ. బి రాజెందర్ నాయక్ సమన్వయం చేశారు. ఓయూ యూత్ వెల్ఫేర్ అధికారులు ప్రొఫెసర్ కవితా దేవి, ప్రొఫెసర్ లింగప్పతో పాటు ప్రొఫెసర్ ఎన్. సుశీల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే కుటుంబంలో ఆరుగురి అదృశ్యం..



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల అదృశ్యమైన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తుల ఆచూకీ ఇంకా లభించలేదు. వివరాల్లోకెళ్తే.. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ బోయిన్ పల్లి ఏడుగుళ్ల సమీపంలో నివాసముంటున్న మహేష్, ఉమా దంపతులు తమ ముగ్గురు పిల్లలతో పాటు సంధ్య అనే మరొక కుటుంబ సభ్యురాలు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. మహేష్ బోయిన్‌పల్లిలో నీటి సరఫరా కేంద్రంలో ఆపరేటర్ చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులకు గురువారం మహేష్ బావ బిక్షపతి వారు అదృశ్యమైనట్టు ఫిర్యాదు చేశాడు. మహేష్ ఉమా దంపతులు తమ పిల్లలైన రిషి, చైతు, శివన్‌లతో పాటు సంధ్యను కూడా తమతోపాటు బయటకు తీసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు. ఆరుగురు కుటుంబ సభ్యులు బయటకు వెళ్లినట్టు ఫిర్యాదుదారుడు బిక్షపతికి ఇంటి యజమాని చెప్పినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఒకేసారి ఆరుగురు కుటుంబ సభ్యులు ఇంటి నుండి బయటకు వెళ్లి ఆటో బుక్ చేసుకుని బోయిన్‌పల్లి నుంచి ఇమ్లీబన్ బస్ స్టాప్ వరకు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి ఎటు వెళ్లారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదశ్యం కింద కేసు నమోదు చేసుకున్న బోయిన్‌పల్లి పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా వారి ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



5 నుంచి 15 వరకు
జార్జిరెడ్డి అమరత్వ యాదిలో సంస్మరణ సభలు

- జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ-ఓయూ

ఇండియన్ లెజెండరీ లీడర్, యువ మేధావి,ఓయూ అరుణ తార జార్జిరెడ్డి అమరత్వ యాదిలో ఏప్రిల్ 5 నుంచి 15 వరకు జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంస్మరణ సభలు విస్తతంగా నిర్వహిస్తున్నట్లు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.ఎస్.నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కె.స్వాతి , రాష్ట్ర సహాయ కార్యదర్శి మందా సురేష్‌లిలు తెలిపారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో ఓయూలో ప్రెస్ మిట్ నిర్వహించి మాట్లాడారు. ఓయూ దివంగత విద్యార్థి నేత జార్జి రెడ్డి అమరత్వ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం కోసం విద్యార్థి లోకం పోరాడాలని పిలుపునిచ్చారు. సంస్మరణ సభలు ముగింపుగా ఏప్రిల్ 15 న ఓయూలో రాష్ట్ర స్థాయి సంస్మరణ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. జార్జి రెడ్డి పి. డి.ఎస్.యూ ఓయూ ప్రధాన కార్యదర్శి రుక్మత్ పాషా, గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్షులు ఎం.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.అంజి, సహాయ కార్యదర్శి కోటేశ్వర్, జార్జి రెడ్డి పి.డి.ఎస్.యూ ఓయూ నాయకులు సతీష్, సంతోష్, క్రాంతి, తిరుపతి, రంజిత్, శ్రీను పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శం

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్
- పలు ప్రాంతాల్లో జగ్జీవన్ రామ్‌కు నాయకుల నివాళ్లు



నవతెలంగాణ-కంటోన్మెంట్

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శమనీ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు.జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ : రహమత్ నగర్ సర్కిల్, ఎస్పిఆర్ హిల్స్ బీజేఆర్ నగర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహనికి కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు.కార్పొరేటర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ చేసిన కషిని ప్రముఖంగా ప్రస్తావిం చారు. జగ్జీవన్ రామ్ దేశ మాజీ ఉప ప్రధానమంత్రి అని, ఆయన చేసిన కృషికి భారతరత్నతో సత్కరించారని చెప్పారు. కాంగ్రెస్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.





కంటోన్మెంట్ : బలంరాయి చౌరస్తాలో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డితో పాటు కంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత, మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బంజారా హిల్స్ : ప్రజా సేవలో నిస్వార్థంగా సేవలందించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శమనీ ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయ రెడ్డి తెలిపారు.శనివారం నియోజకవర్గంలోని లైబ్రరీ సర్కిల్ (బడా గణేష్) వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కేక్ కట్ చేశారు. కార్యనిర్వాహకులతో పాటు దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఓయూ : ఓయూ లైబ్రరీ కాంట్రాక్ట్ ఉద్యోగి ఇస్లావత్ వెంకన్న (రాక్ ఆర్టిస్ట్)ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఓయూ సరస్వతి దేవాలయం సమీపంలో తాను రాళ్ళ మీద గీసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. రాజేందర్, రమేష్, గణేష్ ,విజయ్, సుధాకర్ ,ప్రశాంత్ పాల్గొన్నారు.



పంజాగుట్ట నిమ్స్ హాస్పటల్ వద్ద టీసీఓఎస్ తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, ఎంఎస్‌పీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ్రపల్లి శివకుమార్ మాదిగ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు మస్కు యాదగిరి కాజా భాయ్, ఎమ్మార్పీఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకులు మునిరాతి రామకృష్ణ,శ్రీనగర్ కాలనీ సమన్వయకర్త పురుషోత్తం, వెంకటేశ్వర నగర్ డివిజన్ అధ్యక్షులు మారేపల్లి వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



బేగంపేట్ : రాంగోపాల్‌పేట డివిజన్‌లోని రాణిగంజ్ లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



మన అనే మానవత్వాన్ని చాటిన జగ్జీవన్ రాం

- కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపట్

నా అనే స్వార్థం వీడి మన అనే మానవత్వాన్ని చాటిచెప్పిన వ్యక్తి బాబు జగ్జీవన్ రాం అని కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట్ డివిజన్‌లో జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలువేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. వారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రాం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, వారి న్యాయ, సామాజిక సంస్కరణలకు నిరంతర పోరాటం సాగించి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఇటువంటి సంఘ సంస్కర్తలు, స్వచ్ఛ రాజకీయ నాయకులు చాలా అరుదుగా ఉంటారనీ, వారు తరతరాలకీ స్ఫూర్తిదాయకమన్నారు.కార్యక్రమంలో అమీర్‌పేట్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సొంత నిధులతో జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కార్పొరేటర్

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తన సొంత నిధులతో డివిజన్ జీహెచ్‌ఎంసీ వార్డ్ ఆఫీస్ ఎదురుగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ కమిటీ సభ్యులు శనివారం ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల రహిత



జగ్జీవన్ రామ్‌కు డిప్యూటీ మేయర్ నివాళి

నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ శాంతి నగర్ ఇసుక బావిలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహనికి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ,టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ. ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్ రామ్ అన్నారు.అతిచిన్న వయసులోనే తొలిప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వంలో కీలక శాఖల బాధ్యతలను నిర్వహించారన్నారు. తరువాత కాలంలో భారత ఉపప్రధానిగా దేశానికి అద్వితీయమైన సేవలను అందించారని గుర్త చేశారు. దళితులకు రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ హక్కులను ప్రసాదిస్తే, వాటిని చట్టరూపంలో అమలు చేయడానికి జగ్జీవన్ రామ్ కృషి చేశారన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బోరబండ డివిజన్‌లోని బోరబండ బస్ స్టాప్ వద్ద జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయుని చిత్ర పటానికి బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో వినాయక రావు నగర్ బస్తీ అధ్యక్షులు ఆనంద్, చెట్టి దేవేందర్ ,బాలరాజ్ గౌడ్, రాజు, లక్ష్మణ్ గౌడ్, కాసుల మహేష్, జై భీమ్ యాదయగిరి, శంకర్, మున్నా, ఖలీం, అన్వార్, కష్ణ, ఫెరోజ్, లక్ష్మి నాయక్, మహేశ్వరి, వెంకటలక్ష్మి, వైజయంతి, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ - జూబ్లీహిల్స్ .



శ్రీ రామ నవమి వేడుకలకు అందరూ ఆహ్వానితులే

- కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

రహమత్ నగర్ డివిజన్‌లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. నవమి వేడుకలకు అందరూ ఆహ్వానితులేనన్నారు. శనివారం రహమత్ నగర్‌లోని కార్యాలయంలో డివిజన్ నాయకులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ గౌరవించే పార్టీ అన్నారు. ఎస్పీఆర్ హిల్స్‌లోనిమైదానంలో 6వ తేదీన జరగబోయే శ్రీరామనవమి కళ్యాణాన్ని వైభవంగా, ఆధ్యాత్మికంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం శ్రీరామనవమి వేడుకల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బీసీ పోరు గర్జన విజయవంతం..

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ - బంజారా హిల్స్

గల్లీలో మొదలైన బీసీ ఉద్యమం చరిత్రలోనే మొదటిసారిగా బీసీల పోరుగర్జన మహాధర్నాగా ఈ నెల 2న ఢిల్లీ జంతర్మంతర్ వద్ద విజయవంతంగా నిర్వహించామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. భారతదేశంలోని జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల్లో బీసీ రిజర్వేషన్లపై చర్చకు వచ్చేలా మహాధర్నా జరిగిందన్నారు. ఈ మహాధర్నాకు 29 రాష్ట్రాల ఓబీసీ ప్రతినిధులు,16 రాజకీయ పార్టీల ప్రతినిధులు,వివిధ పార్టీలకు చెందిన 32 మంది ఎంపీలు,హాజరయ్యారని చెప్పారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు అండగా,మద్దతుగా నిలిచేందుకు మహాధర్నాకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసి (ఎంఐఎం), డా.కె.నారాయణ (సీపీఐ), ఎమ్మెల్సీ కోదండరామ్ (టీజేఎస్, మనోజ్, సంజయ్ యాదవ్ (ఆర్‌జేడీ), నారాయణ (ఎన్పీ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ), ఇంద్రజిత్సింగ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ పోరుగర్జన ట్రయల్ మాత్రమేనని, అన్ని రాష్ట్రాల్లో పర్యటించి, ముమ్ముందు బీసీల సత్తా ఏంటో బీజేపీకి చూపిస్తామన్నారు. ఈ పోరుగర్జన స్ఫూర్తితో 29 రాష్ట్రాల రాజకీయ ప్రతినిధులతో ఈ నెలాఖరులో రాజకీయ ప్రిలిమినరీని హైదరాబాద్‌లో నిర్వహిస్తామన్నారు.మే రెండో వారంలో 10లక్షల మందితో బీసీల సింహగర్జన పరేడ్ గ్రౌండ్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నేతలు కనకాల శ్యాం, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, మహిళా విభాగం ప్రధానకార్యదర్శి స్వర్ణ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | ఏప్రిల్ 06, 2025 | www.navatelangana.com



కిషన్ బాగ్ డివిజన్ నందిముస్లాయి గూడ లో బాబు జగ్జీవన్ జయంతి వేడుకలు ఎస్సీఆర్పీ సొసైటీ నాయకులతో కలిసి నివాళి అర్పిస్తున్న బహదూర్ పుర నియోజక వర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిగుళ్ల సాయి కిరణ్..

నవతెలంగాణ-ధూల్ పేట్




బాపు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి సందర్భంగా చూడి బజార్ మాదిగ బంధుమిత్ర సంఘం కమిటీ సభ్యుడు సుమన్ కుమార్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గోషామహల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.యాదగిరి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిటీ నాయకులు..

నవతెలంగాణ-ధూల్ పేట్

అటు శోభయాత్ర.. ఇటు ఐపీఎల్ మ్యాచ్

- ప్రశాంత వాతావరణంలో పూర్తిచేయాలి : సీపీలు
- హైదరాబాద్, రాచకొండ రెండు పోలీస్ కమిషనరేట్లలో భద్రత కట్టుదిట్టం



నవతెలంగాణ-సిటీబ్యూరో

శ్రీరామనవమి శోభ యాత్రతోపాటు నగరంలో ఐపీఎల్ మ్యాచ్ ఒకే రోజు ఉండడంతో హైదరాబాద్, రాచకొండ రెండు పోలీస్‌కమిషనరేట్ల అధికారులు అప్రమత్తమయ్యారు. శ్రీరామ నవమి వేడకల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఇప్పటికే సమీక్షలు నిర్వహించారు. నవమి ఉత్సవాలు, శోభయాత్రలు, ప్రదర్శనలు, ఐపీఎల్ క్రికెట్ పోటీల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, భద్రతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో శ్రీరామనవమి శోభ యాత్ర పూర్తిచేయాలని నగర సీపీ డీజీ సీవీ ఆనంద్, రాచకొండ సీపీ, ఐజీ సుధీర్‌బాబు కోరారు. శ్రీరామ నవమి శోభా యాత్ర 2010లో ప్రారంభమై అనతి కాలంలోనే దేశ వ్యాప్తంగా ఖ్యాతి పొందిందని గుర్తు చేశారు. శ్రీరామనవమి శోభా యాత్ర సీతారాం బాగ్ నుంచి హనుమాన్ వ్యాయామ శాల వరకు కొనసాగుతుందన్నారు. మధ్యాహ్నం 1గంటకు ప్రారంభించే శ్రీరామ నవమి శోభా యాత్ర శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఇదిలావుండగా ఉప్పల్‌లో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని, శ్రీరామనవమి, క్రికెట్ మ్యాచ్‌లు ఒకే రోజు ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రారంభం నుండి ముగింపు వరకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. పలు ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధించామని, శోభా యాత్ర శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు, ఉత్సవ సమితి నిర్వాహకులు పోలీసు వారితో సహకరించాలన్నారు. ఇతర వర్గాలను కించ పరిచే విధంగా పాటలు, స్పీచ్‌లు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులను కోరారు.

యువతరం సమైక్యంగా సన్నద్ధం కావాలి

- కేవీపీఎస్ నగర నాయకులు మహేందర్, కేవీపీఎస్ జిల్లా మాజీ కార్యదర్శి జి.రాములు



నవతెలంగాణ-అంబర్‌పేట

దేశానికి పట్టిన చీడ కులవివక్ష అంటరానితనం నిర్మూలించడానికి యువతరం సమైక్యంగా సన్నద్ధం కావాలని కేవీపీఎస్ నగర నాయకులు మహేందర్, కేవీపీఎస్ జిల్లా మాజీ కార్యదర్శి జి.రాములు అన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రావ్ 117 వ జయంతి సందర్భంగా అంబర్‌పేట జోన్ గోల్నాక చౌరస్తాలో ఉన్న, ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి బి.సుబ్బారావు మాట్లాడు తూ 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతీ నెలలో చివరి రోజు ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత గల ప్రభుత్వం దానిని విస్మరిస్తుందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులలో ప్రధానమైన భాగం ప్రతి వారంలో ఒకరోజు కుల వివక్ష నిర్మూలన కోసం ప్రభుత్వ అధికార యంత్రాంగం ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు దానిని సైతం గాలికొదిలేశారని తెలిపారు. నేటికి రాష్ట్రంలో దేవాలయ ప్రవేశాలు లేని గ్రామాలు బతుకమ్మ ఆడనీయకపోవడం, క్షవరం చేయకపోవడం రచ్చబండల మీద కూర్చోనియకపోవడం వాటర్ ట్యాంకుల దగ్గర నీళ్లు పట్టుకొనియ్యకపోవడం, పట్టణాలలో దళితులకు ఇండ్లు అద్దెకి ఇవ్వకపోవడం వంటి కుల వివక్ష రూపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. వీటిని నిర్మూలించడానికి అనేక చట్టాలు ఉన్నప్పటికీ దళితులను కేవలం ఓటు బ్యాంకు లాగా వాడుకొని వివక్షపై ప్రభుత్వాలు వారి బాధ్యతను విస్మరిస్తున్నా రని విమర్శించారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో కుల వివక్షపై అధ్యయనం నిర్వహించి పూలే, అంబేద్కర్ జయం తులను పురస్కరించుకొని ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలకు సిద్ధమవుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయకులు సోమయ్య,రాయిస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలి



- ఓబీసీ మహిళా సెంట్రల్ కమిటీ అధ్యక్షురాలిగా డాక్టర్ పోశం సునీత శ్రీనివాస్'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఓబీసీ మహిళా కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, దానకర్ణ చారీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ మహిళా సెంట్రల్ కమిటీ అధ్యక్షురాలిగా డాక్టర్ పోశం సునీత శ్రీనివాస్ ఎన్నికైన సందర్భంగా ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎం.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల మహిళలను నేటి పాలకులు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.మహిళా బిల్లు పాస్ కావడం కోసం గత రెండు దశాబ్దాలుగా జాతీయ ఓబీసీ మహిళా సమాఖ్య పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసి అందులో మహిళలకు 50 శాతం ఇవ్వాలని కోరారు.పోశం సునీత మాట్లాడుతూ ఓబీసీల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తామన్నారు .పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు బీసీ మహిళ బిల్లులో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు యు.చిన్నయ్య, కె.పరమేష్, రాము, సుజాత, శిరీష, శ్రీనిధి, మట్టా జయంతి తదితరులు పాల్గొన్నారు.

'ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ చేయరాదు'



నవతెలంగాణ-ముషీరాబాద్

ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ చేయరాదు అని జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు.రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఓర్సు ఇంద్రసేనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ ముఖ్య అతిథిగా హజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నీటికొరతతో పంటలు కోతకు వచ్చే సమయానికి పంటలు ఎండిపోతున్నాయి. దీనితో రైతులు తీవ్రమైన ఆవేదనతో వున్నందున తక్షణమే ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కొరకు కృషి చేయాలన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ఆధారంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి సరియైన గిట్టుబాటు ధరను ఇవ్వాలి, పంటలకు బీమా కల్పించి నష్ట పరిహారం చెల్లించాలి. రైతుల ఆత్మహత్యలను నివారించాలి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రభుత్వాలు కల్తీ విత్తనాల పరిశ్రమలపై ఉక్కుపాదం మోపి, కల్తీ విత్తనాల తయారీదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైతుల నుండి ఎట్టి పరిస్థితుల్లో ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ చేయరాదు, ఒకవేళ భూసేకరణ తప్పని పరిస్థితిలో చేయాల్సి వస్తె భూసేకరణ చట్టం 2013 ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూసేకరణ చట్టం 2013 కు చేసినటువంటి సవరణలను(రైతుల భూములు కంపనీల కోసం సేకరించేటప్పుడు అట్టి రైతు అంగీరారం అవసరం లేదు)వెంటనే రద్దు చేయాలన్నారు. హెచ్‌సీయూ భూములను తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలని తెలిపారు. రైతు సమస్యలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే భావసారూప్యంగల ప్రజాసంఘాలతో, రాజకీయ పార్టీలతో కలిసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాశం యాదగిరి, ప్రొఫెసర్ వినాయకరెడ్డి, సరస్వతీ న్యాయవాది, రైతు సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి ఒంగూరు నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్నాటి మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి సోమిడి శ్రీనివాస్,ఏలేశ్వరం వెంకటేష్, మెడీభావి ప్రభానంద్, వివిధ రైతుసంఘం నాయకులు, ప్రజాసంఘాలు తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్స్ లాగే హీ టీమ్స్ ఏర్పాటు చేయాలి



- పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సైకాలజిస్టును నియమించాలి
- తెలంగాణ సీనియర్ అడ్వకేట్ మామిడి వేణుమాధవ్, బిగ్ బాస్ ఫేమ్ ఆర్జే శేఖర్ బాషా

నవతెలంగాణ - ముషీరాబాద్

మహిళల రక్షణకు షీ టీమ్స్ ఉన్న విధంగా పురుషుల హక్కుల కోసం హీ టీమ్స్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సీనియర్ అడ్వకేట్ మామిడి వేణుమాధవ్, బిగ్ బాస్' ఫేమ్, ఆర్జే శేఖర్ బాషా, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నేషనల్ డైరెక్టర్ జహంగీర్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనుమల జగన్, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ దాస్, రఘునాథ్ అన్నారు. శనివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద లా స్టూడెంట్ కెవిన్ కృష్ణ ఆధ్వర్యంలో 'పురుషుల మీద తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురైన బాధితుల పేరిట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ. సమాజంలో పురుషులకు రక్షణ లేకుండా పోయిందని వాపో యారు. మహిళలు తప్పుడు కేసులు పెట్టి వేధించడం వల్ల పురుషులు ఆత్మహత్య చేసుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. కొందరు మహిళలు వ్యక్తిగత కారణాలతో పురుషులపై ఆధిప త్యాన్ని కొనసాగించాలని కేసులు పెట్టడం బాధిస్తుందన్నారు. అందుకు అనుగుణంగా మానసిక స్థితిని అవగాహనపరిచే విధంగా పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సైకాలజిస్టును నియమించాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తెలంగాణ హ్యూమన్ రైట్స్ లోకాయుక్త న్యాయమూర్తులు పదవిని వెంటనే భర్తీ చేయాలన్నారు. హ్యూమన్ రైట్స్ లోకాయుక్తలో పెండింగ్ కేసుల త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ పెట్టవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో లా స్టూడెంట్స్ క్రాంతి కుమార్, ప్రశాంత్, మిత్ర పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పరిరక్షణ ఉంటుందని ప్రముఖ రాజ్యాంగ నిపుణులు, న్యాయవాది, తమిళనాడు ఎంపీ.విల్సన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం, ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయానికి 42 శాతం బీసీ రిజర్వేషన్లు దిక్సూచి' అనే అంశంపై శనివారం హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సద స్సుకు బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మెన్ టి.చిరంజీవులు అధ్యక్షత వహించగా... ఎంపీ విల్సన్, ఆల్ ఇండియా ఓబీ సీ కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ వంగాల ఈశ్వరయ్య, మాజీ అడ్వకేట్ జనరల్ బీఎస్.ప్రసాద్, ప్రముఖ డాక్టర్ పుంజాల వినయ్ కుమార్, ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మెన్ రాజు, దేవరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ విల్సన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ మౌలిక స్వరూపానికి అనుకూలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు తీసుకువచ్చే పాలసీలు, చట్టాలను కోర్టులు కొట్టివేయ లేవని ఆయన వివరించారు.1994 సంవత్సరం నుంచే తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయ ని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. తమిళనాడులో సామాజిక న్యాయ ఉద్యమ ఫలితంగా నేడు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయా నికి తమ రాష్ట్ర సీఎం ఛాంపియన్‌గా నిలిచారని చెప్పారు. .రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం వల్ల ఒక పెద్ద గోడ నిర్మించినట్టు అవుతుందని వివరించారు. ప్రస్తుతం భార తదేశంలో డీలిమిటేషన్ చేయడం వల్ల దక్షిణ భారతదేశంలో ఎంపీల సంఖ్య తగ్గి రేపు చట్టాలు తయారు చేయడంలో చాలా నష్టం జరుగుతుందన్నారు. ఓబీసీ కమిషన్ మాజీ చైర్మెన్, జస్టిస్ వంగాల ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో చట్టం చేయకుండా జీవోలు తెస్తూ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు తెస్తే ఆయా హైకోర్టులు, సుప్రీంకోర్టు కొట్టివేసిన పలు తీర్పులను పుటంకిస్తూ వివరాలు చెప్పారని, రాజ్యాంగం, చట్టాలు, రిజర్వేషన్లపై అవగాహన లేని వారు తమను విమర్శిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ ఆధారాలతో కూడిన కులగణన లెక్కలు చట్టాలు లేకుండా జీవోలు తెస్తే కోర్టులు కొట్టివేశాయని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీ ఉద్యమకారులు, సంఘాలు వివిధ రాజకీయ పార్టీల బీసీ నేతలందరూ ఏకమై బీసీల రిజర్వేషన్లు అమలుకై పోరాటాలు చేయాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మెన్ టీ.చిరంజీవులు పిలుపు నిచ్చారు. సంఘాల మధ్య నేతల మధ్య మనస్పర్ధలు వీడి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అందుకు అనుగుణంగా ఉద్యమం చేయాలని కోరారు.ఈ సందర్భంగా మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఇంటలెక్చువల్స్ కోర్ కమిటీ సభ్యులు, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, కె.వి.గౌడ్, కోలా జనార్దన్, అవ్వారు వేణు, కొండల గౌడ్, బొమ్మ రఘురాం, ఒంటెద్దు నరేందర్, కిరణ్, వీరస్వామి, శ్రీకాంత్, శీను పాల్గొన్నారు.



బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని హెచ్.ఎ.ల్ లో ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని, డిఫెన్స్ మినిస్టర్ దళిత జన బాంధవులు మాజీ ఉప ప్రధాని డా బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని హెచ్.ఎ.ల్ అంబేద్కర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు.

నవతెలంగాణ-బాలానగర్

నవచిత్రం



ఘనంగా 'మ్యాడ్ స్క్వేర్' విజయోత్సవ వేడుక

"నవ్వించడం అనేది చాలా గొప్ప వరం. మనకు ఎన్నో బాధలున్నా, ఎన్ని కష్టాలున్నా ఒక మనిషి వచ్చి మనల్ని నవ్వించగలిగితే ఈ కష్టాల నుంచి బయటకు వెళ్ళిపోదాం కదా అనే ఆలోచన మన అందరికీ ఉంటుంది. అలా నవ్వించగలిగిన మనిషి చాలా అరుదుగా దొరుకుతారు. అలాంటి అరుదైన దర్శకుడు కళ్యాణ్ శంకర్ మనకు దొరికాడు. 'మ్యాడ్ 2'తో ఇంతటి భారీ విజయాన్ని అందుకున్న కళ్యాణ్‌కి కంగ్రాచ్యులేషన్స్. ఒక చిత్రాన్ని హిట్ చేసిన తర్వాత సీక్వెల్‌గా అంతకంటే గొప్పగా ప్రేక్షకులను రంజింపజేయడం చాలా కష్టం. కానీ కళ్యాణ్ అది సాధించగలిగాడు' అని హీరో ఎన్టీఆర్ అన్నారు.

బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఈ సినిమా ఇటీవల విడుదలై భారీ వసూళ్లతో అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో శిల్పకళా వేదికలో విజయోత్సవ వేడుకను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు హీరో ఎన్టీఆర్, దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఎన్టీఆర్ మాట్లాడుతూ, "అత్తారింటికి దారేది'లో ఒక డైలాగ్ ఉంటుంది. మీ వెనకాల కనబడని ఒక శక్తి ఉంది అని, వీళ్ళందరి వెనుక ఆ కనబడని శక్తే మా నాగవంశీ. సినిమా అంటే చాలా ప్యాషన్ తనకి. మాట కఠినంగా ఉంటుంది కానీ, మనసు చాలా మంచిది. ఆ మంచితనమే తనని కాపాడుతుంది. వంశీతో త్వరలో ఒక సినిమా చేయబోతున్నాను. మా చినబాబు చిన్నితల్లి హారిక నిర్మాతగా మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

'రేయి లోలోతుల సితార..'



రష్మిక మందన్న

హీరో దీక్షిత్ శెట్టి, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా దీన్ని నిర్మిస్తున్నాయి. బ్యూటీఫుల్ లవ్‌స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. శనివారం రష్మిక మందన్న బర్త్ డే సందర్భంగా ఈ సినిమా నుంచి విషెస్ చెబుతూ కొత్త పోస్టర్, టీజర్ సాంగ్ 'రేయి లోలోతుల' రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో రష్మిక వారియర్ లుక్‌లో గన్, కత్తితో పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. 'రేయి లోలోతుల' పాటను మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహబ్ బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేయగా, రాకేందు మౌళి క్యాచీ లిరిక్స్ అందించారు. విజయ్ దేవరకొండ, హేషమ్ అబ్దుల్ వాహబ్, చిన్మయి శ్రీపాద ఆకట్టుకునేలా పాడారు. ఈ పాటలో వచ్చే పోయెమ్‌ను డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ రాశారు. 'రేయి లోలోతుల సితార, జాబిలి జాతర, కన్నులలో వెన్నెలలే కురిసే, మదిమోసే తలవాకిట తడిసే, యెద జారెనే మనసు ఊగెనే, చెలి చెంతలో జగమాగెనే, యెద జారెనే మనసా..' అంటూ మంచి లవ్‌ఫీల్‌తో సాగుతుందీ పాట. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉన్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది అని చిత్ర బృందం తెలిపింది.

'ప్రియమార..' సందడి మొదలైంది



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి

ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటిస్తున్న చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'.

ఈ సినిమా నెల 11న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది. దీనికి నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.

తాజాగా శనివారం మేకర్స్ 'ప్రియమార..' అంటూ సాగే సాంగ్ రిలీజ్ చేశారు. రథన్ ఈ పాటను సాంగ్ లవ్లీ మెలోడీగా కంపోజ్ చేశారు. రాకేందు మౌళి రాసిన సాహిత్యం అద్భుతంగా ఉంది. శరత్ సంతోష్, లిప్సిక భాష్యం వోకల్స్ మెలోడీని మరింత ఎలివేట్ చేశాయి. నాయకానాయికలు ప్రదీప్, దీపికల కెమిస్ట్రీ ఆన్-స్క్రీన్ మీద అద్భుతంగా ఉంది.

ప్రదీప్ తొలి చిత్రం లాగానే ఈ సినిమా కూడా విడుదలకు ముందే మ్యూజికల్ హిట్‌గా సంచలనాలు సృష్టిస్తోంది. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

మురళీధర్ గౌడ్, జి.ఎం.సుందర్, జాన్.విజయ్, రోహిణి, ఝాన్సీ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి స్క్రీన్ ప్లే - దర్శకత్వం: నితిన్, భరత్, సంగీతం: రథన్, డీఓపీ : బాలరెడ్డి, ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, ప్రొడక్షన్ డిజైనర్: ఆశిస్తేజ పులాల, కథ - మాటలు: సందీప్ బొల్లా, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్, విశ్వ రఘు, యష్, రామ్, సాహిత్యం: చంద్రబోస్, రాకేందు మౌళి, శ్రీధర్ ఆవునూరి.

ఫీల్ గుడ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్



మంచి ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీలు వచ్చి చాలా కాలమే అవుతోంది. ప్రస్తుతం వెండితెరపై మాస్, యాక్షన్, కామెడీ చిత్రాలే కనిపిస్తున్నాయి.

కానీ స్వచ్ఛమైన వింటేజ్ విలేజ్ లవ్ ఎమోషనల్ డ్రామాలు కనిపించడం లేదు. ఆ లోటుని భర్తీ చేసేందుకు 'కౌసల్య తనయ రాఘవ' చిత్రం రాబోతోంది. రాజేష్ కొంచాడా, శ్రావణి శెట్టి నటీనటులుగా ఏఆర్ మూవీ మేకర్స్ బ్యానర్ పై కుటుంబ మంతా కలిసి చూసే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అడపా రత్నాకర్ నిర్మిస్తున్న ఈ మూవీకి స్వామి పట్నాయక్ కథ, కథనం, దర్శకత్వం బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.

ఈ సినిమాను ఈనెల 11న రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో శనివారం ఆర్కే నాయుడు, చంటి, నిర్మాత రత్నాకర్ సంయుక్తంగా ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో రాజేష్ మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది. ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. 'నిర్మాత రత్నాకర్ ఈ చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. రాజేష్, శ్రావణి, ఆర్కే నాయుడు ఇలా అందరూ అద్భుతంగా నటించారు' అని దర్శకుడు స్వామి పట్నాయక్ చెప్పారు. నిర్మాత రత్నాకర్ మాట్లాడుతూ, 'మా సినిమాకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్. మా చిత్రాన్ని అందరూ చూసి సక్సెస్ చేయండి' అని తెలిపారు.

ఆటలు

పంజాబ్‌కు షాక్


రాజస్థాన్ చేతిలో పరాజయం



ముల్లాన్‌పూర్ : ఐపీఎల్18లో పంజాబ్ కింగ్స్‌కు తొలి పరాజయం ఎదురైంది. భీకర బ్యాటింగ్ లైనప్ కలిగిన పంజాబ్ కింగ్స్ 206 పరుగుల ఛేదనలో చేతులెత్తేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (10) సహా ప్రియాన్ష్ ఆర్య (0), ప్రభుసిమ్రన్ సింగ్ (17), మార్కస్ స్టోయినిస్ (1) వైఫల్యంతో ఏ దశలోనూ పంజాబ్ లక్ష్యం దిశగా సాగలేదు. నెహల్ వధేరా (62), గ్లెన్ మాక్స్‌వెల్ (30) మెరిసినా.. అప్పటికే మ్యాచ్‌పై రాయల్స్ పట్టు బిగించింది. 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసిన పంజాబ్ 50 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. యశస్వి జైస్వాల్ (67), రియాన్ పరాగ్ (43 నాటౌట్) రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 205 పరుగులు చేసింది.

గెలుపు బాట పట్టేనా?

టైటాన్స్‌తో సన్‌రైజర్స్ ఢీ నేడు



నవతెలంగాణ-హైదరాబాద్ : ధనాధన్ దూకుడు మంత్ర జోరులో నిలకడలేమి, బ్యాటింగ్, బౌలింగ్ వైఫల్యంతో ఇబ్బంది పడుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నేడు కీలక మ్యాచ్‌కు సిద్ధమైంది. సీజన్లో సొంతగడ్డపై మూడో మ్యాచ్ ఆడుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండో విజయంపై కన్నేసింది. గత మూడు మ్యాచుల్లో బ్యాటింగ్, బౌలింగ్ వైఫల్యంతో పరాజయం మూటగట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. నేడు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్.. అనికెత్ వర్మ, హెన్రిచ్ క్లాసెన్ మెరిస్తే సన్‌రైజర్స్ ఖాతాలో రెండో విజయం పడినట్టే!. హైదరాబాద్ మియాభాయ్ మహ్మద్ సిరాజ్ సొంత స్టేడియంలో నేడు గుజరాత్ టైటాన్స్ తరఫున బరిలోకి దిగుతున్నాడు.

ఢిల్లీ హ్యాట్రిక్ విక్టరీ

నిన్న బెంగళూర్, నేడు ఢిల్లీ.. చెపాక్‌లో సూపర్ కింగ్స్‌పై మెరుపు విజయం సాధించాయి. 15 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ చెపాక్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ తొలి విజయం సాధించింది. 184 పరుగుల ఛేదనలో సూపర్‌కింగ్స్ తేలిపోయింది. 158/5 పరుగులకే పరిమితమై 25 పరుగుల తేడాతో ఓటమి చెందింది. కెఎల్ రాహుల్ (77) అర్థ సెంచరీ మెరుపులతో తొలుత ఢిల్లీ క్యాపిటల్స్ 183/6 పరుగులు చేసింది. ఐపీఎల్18లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది వరుసగా మూడో విజయం.

సూపర్‌కింగ్స్‌పై క్యాపిటల్స్ గెలుపు
ఢిల్లీ 183/6, చెన్నై 158/5



నవతెలంగాణ-చెన్నై

ఐపీఎల్18లో ఢిల్లీ క్యాపిటల్స్ జోరు కొనసాగుతుంది. బ్యాట్‌తో, బంతితో అదరగొట్టిన ఢిల్లీ క్యాపిటల్స్ చెపాక్ కోటను బద్దలు కొడుతూ 15 ఏండ్ల తర్వాత ఈ స్టేడియంలో తొలిసారి గెలుపు రుచి చూసింది. సీజన్లో హ్యాట్రిక్ విజయం నమోదు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ అజేయ రికార్డును సైతం కొనసాగించింది. ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ చతికిల పడింది. 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులే చేసింది. విజయ్ శంకర్ (69 నాటౌట్, 54 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో మెరిసినా..ఇతర బ్యాటర్లు తేలిపోయారు. ఎం.ఎస్ ధోని (30 నాటౌట్, 26 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) అంచనాలను అందుకోలేదు. రవీంద్ర జడేజా (2), శివం దూబె (18, 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), రుతురాజ్ గైక్వాడ్ (5), డెవాన్ కాన్వే (13), రచిన్ రవీంద్ర (3)లు విఫలం అయ్యారు. 74/5తో పీకల్లోతు కష్టాల్లో ఉన్న సూపర్‌కింగ్స్‌ను విజయ్ శంకర్, ఎం.ఎస్ ధోని నిలబెట్టినా.. వేగంగా పరుగులు సాధించటంలో నిరాశపరిచారు. దీంతో 25 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో విప్‌రాజ్ నిగమ్ (2/27), కుల్దీప్ యాదవ్ (1/30), మిచెల్ స్టార్క్ (1/27) రాణించారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 183 పరుగులు చేసింది. ఓపెనర్ కెఎల్ రాహుల్ (77, 51 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీతో రాణించగా.. అభిషేక్ పోరెల్ (33, 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (21, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), సమీర్ రిజ్వీ (20, 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), ట్రిస్టన్ స్టబ్స్ (24 నాటౌట్, 12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నారు. సూపర్‌కింగ్స్ పేసర్ ఖలీల్ అహ్మద్ (2/25) రెండు వికెట్లతో రాణించాడు. సూపర్‌కింగ్స్‌కు నాలుగు మ్యాచుల్లో ఇది మూడో పరాజయం.

రాణించిన రాహుల్ :

టాస్ నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్ చెపాక్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ధనాధన్ ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (0) డకౌట్‌గా నిష్క్రమించినా.. మరో ఓపెనర్ కెఎల్ రాహుల్ (77) అదరగొట్టాడు. అభిషేక్ పోరెల్ (33)తో కలిసి రెండో వికెట్‌కు రాహుల్ కీలక భాగస్వామ్యం నిర్మించాడు. మిడిల్ ఆర్డర్‌లో అక్షర్ పటేల్, సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్ (24 నాటౌట్) ధనాధన్ మెరుపులతో దంచికొట్టగా.. రాహుల్ మరో ఎండ్‌లో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. పవర్‌ప్లేలో 51/1తో నిలిచిన క్యాపిటల్స్ రాహుల్ అర్థ సెంచరీతో భారీ స్కోరు చేసింది. రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో కదంతొక్కిన రాహుల్ 33 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. ఆఖరు ఓవర్ వరకు క్రీజులో నిలిచిన రాహుల్ కఠిన చెపాక్ పిచ్‌పై క్యాపిటల్స్‌కు 183 పరుగుల స్కోరు అందించాడు. సూపర్ అర్థ సెంచరీతో విజయంలో కీలక పాత్ర పోషించిన కెఎల్ రాహుల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

నేడు భద్రాద్రికి ముఖ్యమంత్రి

సీఎం హోదాలో శ్రీరామనవమికి తొలిసారి..

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో తొలిసారి భద్రాచలంలోని శ్రీరామనవమి వేడుకలకు ఆదివారం హాజరవుతున్నారు. ఆయనతోపాటు ఏడుగురు మంత్రులు కూడా వస్తున్నారు. ఇటీవల భద్రాచలం సమీపంలో ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్‌లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షణలో 1800 మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. 2024 శ్రీరామ నవమి వేడుకలకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి హాజరుకావాల్సి ఉండగా, నాడు పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో హాజరు కాలేకపోయారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హాజరయ్యారు. ఈసారి ముఖ్యమంత్రితోపాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పలువురు ఎమ్మెల్యేలు శ్రీరామనవమికి హాజరు కానున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా వస్తున్నట్టు వార్తలు వచ్చినా చివరి నిమిషంలో ఆయన పర్యటన వాయిదా పడింది. సీఎం పర్యటన కూడా చివరి వరకు సందిగ్ధంగానే ఉంది. హెచ్‌సీయూ భూముల అంశంపై చర్చల నేపథ్యంలో సీఎం పర్యటనపై సందేహాలు నెలకొన్నాయి. శనివారం రాత్రి 7 గంటలకు సీఎంవో నుంచి షెడ్యూల్ విడుదలైంది.

ముఖ్యమంత్రి రాకకు సర్వంసిద్ధం

భద్రాచలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాచలం, బూర్గంపాడు మండలం సారపాకలో అధికారులు హెలీప్యాడ్‌లు సిద్ధం చేశారు. స్వామివారి దర్శనం తర్వాత పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో మిథిలా స్టేడియం మండపంలో వైదిక పెద్దలకు వాటిని సీఎం అందజేస్తారు. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ఆదివారం ఉదయం 8.45 గంటలకు బయలుదేరనున్న సీఎం బూర్గంపాడు మండలం సారపాక హెలీప్యాడ్‌లో 10 గంటలకు దిగుతారు. అక్కడి ఐటీసీ భద్రాచలం గెస్ట్‌హౌస్‌లో కొద్దిసేపు ఉండి 10.40 గంటలకు భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుంటారు. 11.10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్వామివారి కల్యాణ క్రతువును వీక్షిస్తారు. 12.35 గంటలకు బూర్గంపాడు మండలం సారపాక వెళ్లి సన్నబియ్యం అన్నం రుచిచూస్తారు.



ఆదివాసీ ఇంట్లో సన్నబియ్యం అన్నం రుచి..

ముఖ్యమంత్రితోపాటు ఏడుగురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఇతర అధికారులు ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యం అన్నం రుచిచూస్తారు. బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన ఆదివాసీ గిరిజనుడు బోరం శ్రీనివాసరావు ఇంట్లో 12.35 నుంచి 1.10 గంటల వరకు ఉంటారు.

తానీషా నాటి ఆనవాయితీ పునరుద్ధరణ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు శ్రీరామనవమికి హాజరవుతుండటంతో గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన తానీషా ప్రభువు కాలం నాటి ఆనవాయితీ పునరుద్ధరిస్తున్నట్టయిందని చర్చిస్తున్నారు. తెలంగాణ వచ్చాక 2015లో ముఖ్యమంత్రి హోదాలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు తొలిసారి భద్రాచలం శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యారు. 2016లోనూ వచ్చారు. ఆ తర్వాత నుంచి ఆ సంప్రదాయానికి తెరదించారు. సీఎం బదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హాజరవుతూ వచ్చారు. నాడు శ్రీరామదాసు నేతృత్వంలో నిర్వహించే శ్రీసీతారామ కల్యాణ వేడుకకు నాటి నైజాం ప్రభువు తానీషా అధికారిక లాంఛనాలతో హాజరయ్యేవారు. నాడు మొదలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రు లందరూ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప ఈ ఆనవాయితీని కొనసాగించారు. కానీ గత సీఎం కేసీఆర్ దీనికి ఆకస్మికంగా ఫుల్‌స్టాప్ పెట్టడం చర్చనీయాంశంగా మారింది. మొత్తమ్మీద 9 ఏండ్ల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి గత సంప్రదాయానికి తెరదీస్తుండటంపై భక్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం : సీఎం


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమనీ, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. శనివారం జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని బాబూజీ సేవలను సీఎం స్మరించుకున్నారు. పేదరికంలో జన్మించిన ఆయన అంకుఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని గుర్తు చేశారు. జాతీయోద్యమంలో పాల్గొన్నారనీ, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా సేవలు అందించారని.. కార్మిక సంక్షేమానికి పాటుపడ్డారని తెలిపారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు బాబూజీ పోరాడారనీ, దళితుల అభ్యున్నతికి పాటుపడ్డారని గుర్తు చేశారు. బాబూజీ స్ఫూర్తితో ప్రజా పాలన కొనసాగిస్తున్నామనీ, ఆయన ఆశయాలకు అనుగుణంగానే ప్రజా ప్రభుత్వం కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణను అమలు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. నివాళులర్పించిన వారిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు వి హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నారు.



కళ మానవత్వానికి అంకితం

అంజలి ప్రభాకర్... అనేక కళారూపాలను తన చిత్రాల్లో ప్రతిబింబించగల బహుముఖ ప్రతిభాశాలి. చిత్ర కళలోనే కాదు సంగీతం, నృత్యం వంటి వాటిల్లో కూడా ఆమెకు ప్రావీణ్యం ఉంది. అయితే తన చిత్రకళకు మాత్రం ఒక నూతన శక్తిని అందిస్తోంది. జీవిత తత్వాన్ని లోతుగా అర్థం చేసుకోవడం వల్ల ఆమె కళలో అంతరార్థం, స్పష్టత, సున్నితమైన భావోద్వేగాలు కనిపిస్తాయి. ఫ్యాషన్ ఆర్ట్‌లో మాస్టర్స్‌తో పాటు మానసికశాస్త్రం, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన ఆమె చిత్రాల సౌందర్యం, భావ వ్యక్తీకరణలో మరింత పరిపక్వత ప్రతిఫలించింది. ఈనెల 4,5,6 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్‌లో తన కళాఖండాలను ప్రదర్శించడానికి వచ్చిన ఆమె గురించి క్లుప్తంగా...



1975 ఫిబ్రవరి 15న బీహార్‌లో జన్మించిన అంజలి ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో స్థిరపడ్డారు. భోపాల్ అనేక కళారూపాలకు కేంద్రంగా నిలిచి ఆమె కళకు కొత్త స్ఫూర్తినిచ్చింది. ఆమె ఫ్యాషన్ డిజైనింగ్‌లో మాస్టర్స్, ఎం.బి.ఏ (హ్యూమన్ రీసోర్సెస్) పూర్తి చేసి 1993 నుంచి చిత్రకళలో తన నైపుణ్యాన్ని కొనసాగిస్తున్నారు. లియోనార్డో డా విన్సీ, రాజా రవి వర్మ, ఫ్రిడా కాలో వంటి మహా కళాకారులు ఆమెకు ప్రేరణగా నిలిచారు. ప్రస్తుతం ఆమె ఇనోవేటివ్ సంస్థకు ఎండీగా ఉన్నారు. మరోవైపు ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్‌గా అద్భుతమైన కళారూపాలను సృష్టిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో...

కళా ప్రపంచంలో తన ప్రాముఖ్యతను చాటుకుంటున్నారు అంజలి. ఆమె కళలోని సమతుల్యత రంగుల సమన్వయం, ఆకారాల నిర్మాణం, కథనంతో కూడిన వినూత్న దృక్కోణాన్ని ప్రతిబింబిస్తుంది. విజయం, ప్రేమ, ఆధ్యాత్మికత, మానవ సంబంధాలు, సామాజిక సమస్యలు వంటి అనేక అంశాలను తన చిత్రాల్లో భావోద్వేగంతో చిత్రీకరించారు. అందుకే ఆమె చిత్రాలు కళాభిమానులను, కళా సేకరణ కర్తలను ఎప్పటికప్పుడు ఆకర్షిస్తూనే ఉంటాయి. ఆమె కళా కృతులు భారతదేశంతో పాటు అంతర్జాతీయ కళా ప్రపంచంలో ప్రాముఖ్యత పొందాయి.

కళా ప్రదర్శనలు, ప్రచురణలు

అనేక సోలో, గ్రూప్ ప్రదర్శనల ద్వారా ఆమె చిత్రకళ కళా ఆరాధకులకు పరిచయమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 75కు పైగా ప్రదర్శనల్లో పాల్గొని, విశేష గుర్తింపు పొందారు. అనేక పత్రికలు, మ్యాగజైన్లు, ఆర్ట్ జర్నల్‌లు ఆమె కళను విశ్లేషిస్తూ ప్రచురించాయి. ఆమె కళా ప్రయాణాన్ని వివరించే Tunes of Life అనే పుస్తకం కూడా వెలువడింది. ప్రస్తుతం ఆమె 'ఆర్ట్ థెరపీ మహిళల మానసిక ఆరోగ్యంపై ఎలా ప్రభావితం చేస్తుందో' అనే అంశంపై పీహెచ్‌డీ చేస్తున్నారు.

వృత్తి, సేవా కార్యక్రమాలు

కళా, హస్తకళ తరగతులైన NID, NIFT, NATA & B Arch ప్రవేశ పరీక్షలతో పాటు UPSC, MPPSC, రైల్వే ఎస్సీఎస్ కోసం ఆమె కోచింగ్ ఇస్తారు. అలాగే ఆమె ప్రొఫెషనల్ టారో కార్డ్ రీడర్, న్యూమరాలజిస్ట్, లైఫ్ కోచ్ కౌన్సిలర్, హీలర్ హీలింగ్ ద్వారా శారీరక, మానసిక సమస్యల నివారణ నైపుణ్యాలు, వివిధ కళారూపాల్లో నైపుణ్యం, పోర్ట్రెయిట్ స్కెచింగ్, ఫోక్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం, యువ మానసిక శాస్త్రంలో లోతైన అవగాహన, మ్యూరల్ ఆర్ట్, తంజావూరు, మధుబని పెయింటింగ్, క్రిస్టల్ రెజిన్, సెఫోరిక్స్, అబ్‌స్ట్రాక్ట్ చిత్రకళలో నైపుణ్యం, టీమ్ వర్క్‌లో, స్వతంత్రంగా పని చేసే సామర్థ్యం ఆమెకు ఉన్నాయి. ఇంకా ఆమె గ్రాండ్ మాస్టర్ సర్టిఫికేట్ కూడా పొందారు.

కళకు అందిన పురస్కారాలు

అంతర్జాతీయ, జాతీయ పురస్కారాలు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, మెడల్ – కళాకార్ ఫౌండేషన్ (2018), సిల్వర్ మెడల్ – ఆల్ ఇండియా ఆర్ట్ ఫియెస్టా (2018), రాజా రవి వర్మ స్వదేశి శ్రీ అవార్డు (2021), అంబేద్కర్ ఫౌండేషన్ అవార్డు (ప్రొఫెషనల్ కేటగిరీ), గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్ (2022), గోల్డెన్ ఫ్రేమ్ ఎక్సలెన్స్ అవార్డు (2021), కల్చరల్ రివెరెన్స్ ఆర్ట్ అండ్ కల్చర్ మ్యాగజైన్ – పెయింటింగ్ ప్రచురణ (2021), ఆమె జీవిత చరిత్ర ప్రచురణ (2021) జరిగింది.



కళ సందేశాన్ని ఇస్తుంది

అంజలి కళను కేవలం తన కోసమే కాకుండా తద్వారా మహిళా సాధికారతను పెంపొందించడానికి, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నారు. ఆమె చేత సృష్టించబడే ప్రతి కళ ఒక సందేశాన్ని ఇస్తుంది. మనిషి ఆత్మ విశ్వాసం, ఆత్మాభిమానంతో ముందుకు సాగాలని గుర్తు చేస్తుంది. భవిష్యత్తులో ఆమె మరింత పేరు ప్రఖ్యాతులు సంపాదించి, భారతీయ కళా ప్రపంచంలో గొప్ప స్థానాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తూ... ఆమె కళా ప్రయాణానికి అభినందనలు.

- వి.యశోధ

సాటి వారికి భరోసా ఇవ్వాలి...



అమ్మ లేఖ

హలో బంగారు తల్లీ...

ఈ రోజు నీకు ఓ విషయం చెప్తాను. ఇరుగు పొరుగు అంటే మన ఇంటి చుట్టూ ఉండే వారు. పూర్వం ఇరుగు పొరుగు వారు సాయంత్రం అయ్యేసరికి వాకిట్లో కూర్చుని కష్ట సుఖాలు చెప్పుకునే వారు. ఏదైనా వస్తువు ఇంట్లో లేకుంటే పక్కింట్లో అడిగి తెచ్చుకోవడం, చేబదులుగా ఉప్పు, పప్పు తెచ్చుకుంటూ ఉండేవారు. దీనివల్ల మనుషుల మధ్య అనుబంధాలు పెరిగేవి. ఒకరి కొకరు సాయం చేసుకుంటూ ఉండేవారు. ఇప్పుడు కూడా పల్లె టూర్లలో ఎవరి ఇంట్లో అయిన శుభకార్యం అయితే ఇరుగు పొరుగు వచ్చి పనులలో సాయం చేస్తుంటారు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే ఈ నాగరిక ప్రపంచంలో ముఖ్యంగా పట్టణ వాతావరణంలో ఇటువంటి అనుబంధాలు కనిపించవు. మనిషి తన కోసమే బతుకుతున్నాడు తప్ప చుట్టుపక్కల వారితో స్నేహ బాంధవ్యాలు పెంచుకోవడం లేదు. మన చుట్టూ ఉన్నవారితో మనం కలుపుగోలుగా ఉండాలి, కనిపించినప్పుడు పల కరించాలి. అవసరం అయినప్పుడు ఒకరికి ఒకరు సాయ పడాలి. ఈ మధ్య కాలంలో పిల్లలు విదేశాల్లో ఉంటే వృద్ధులైన తల్లిదండ్రులు ఒంటరిగా ఉంటున్నారు. అటువంటి వారి యోగక్షేమాలు కనుక్కోవాలి. ఏదైనా అవసరం అయితే సాయపడాలి. మరి కొన్ని చోట్ల చంటి పిల్లలతో ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటూ, పిల్లలకు ఏమైనా అయితే హాస్పిటల్స్‌కి వెళ్లాల్సి వస్తుంది. అటువంటప్పుడు వారికి కావాల్సిన సాయం చేయాలి.

నా కేందుకు అని అనుకోకూడదు నాన్న. చుట్టు పక్కల వారి పరిస్థితులు గమనించి, గ్రహించి కనిపించినప్పుడు పలకరించి 'ఏదైనా అవసరం అయితే చెప్పండి' అని భరోసా ఇవ్వాలి. కొన్ని అనుకోకుండా జరుగుతాయి. అటువంటప్పుడు సాటి వారి అవసరం ఉంటుంది. కష్ట కాలంలో ఆదుకోవాలి. అది మానసిక స్థైర్యం కావచ్చు, శారీరక సాయం కావచ్చు, ఆర్థిక సాయం కావచ్చు. మనిషి ఒక్కో సారి పరిస్థితుల రీత్యా డీలా పడిపోతాడు. అటువంటప్పుడు ధైర్యం చెప్పాలి. సాయం వేరు, సేవ వేరు నాన్న.

ఈ మధ్య కాలంలో ప్రతి మనిషితో తమ అవసరం కోసమే మాట్లాడుతారు. లేదా నాకేమి అవసరం వాళ్లతో అంటారు. ఇది సరైన పద్ధతి కాదు. అలాగని అవసరాల కోసమే బాంధవ్యాలు పెంచుకోకూడదు. నువ్వు ఇప్పుడు టౌన్ షిప్‌లో ఉంటున్నావు. అక్కడ ఎందరో పెద్దలు, పిల్లలు కనిపిస్తుంటారు. పలకరింపుగా ఒక చిరునవ్వు చాలు నాన్నా. కొన్ని చోట్ల ఇరుగుపొరుగు వారు కలిసి చక్కగా పండుగలు, పార్టీలు చేసుకుంటూ ఉంటారు. సరదాగా బైటకి కలిసి వెళ్తుంటారు. ఇటువంటివి అప్పుడప్పుడు చేస్తూ ఉండాలి. అప్పుడే మనుషుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు పెరుగుతాయి. ఉంటాను...



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి

వీడీసీ ఆగడాలు

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నాయి. కల్లు గీస్తున్నందుకు ప్రతేడాదీ వీడీసీకి కొద్ది మొత్తంలో డబ్బులు చెల్లిస్తుండేవారు. అయితే, ఈసారి పెద్దమొత్తంలో డబ్బులు కట్టాలని వీడీసీ హుకుం జారీ చేయడంతో అంత కట్టలేమని ప్రాధేయపడినా వినిపించుకోలేదు. దీంతో అప్పటి నుంచి గ్రామంలో గౌడ కులస్తులపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. కాగా శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలో అన్ని సామాజిక తరగతుల వారూ చిన్నాపెద్దా అని తేడా లేకుండా ఉత్సవాల్లో పాల్గొంటారు. ఇదే విషయమై శనివారం గ్రామస్తులందరూ కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొనాలని శుక్రవారం మైకులో చాటింపు వేశారు. గౌడ సంఘానికి చెందిన మహిళలు కూడా కుంకుమార్చనలో పాల్గొనడానికి రామాలయంలోకి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు గ్రామ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి.. గౌడ సామాజిక తరగతి మహిళలను పూజలో పాల్గొనకుండా అడ్డుకొని అవమానించారు. దాంతో మనస్తాపానికి గురైన మహిళలు ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమను పూజలు చేయకుండా అడ్డుకొని అవమానించారని ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు తాళ్లరాంపూర్ వెళ్లి విచారణ చేపట్టి, ముగ్గురు గ్రామకమిటీ సభ్యులు, పూజరిపై కేసు నమోదు చేసినట్టు సమాచారం.

హెచ్‌సీయూ భూములు లాక్కున్నట్టు తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని సమావేశంలో చర్చ జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఉన్నవి లేనట్టుగా, లేనివి ఉన్నట్టుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వాస్తవాలు వెల్లడించేలోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని తెలిపారు. నెమళ్లు ఏడ్చినట్టుగా ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్టుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను పోస్టు చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారని సమావేశంలో చర్చ జరిగింది. ఈ భూములపై మొట్ట మొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్‌జా కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలగించి క్షమాపణలు చెప్పారనీ, కానీ మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారని అధికారులు అభిప్రాయపడ్డారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఏఐ ఫేక్ కంటెంట్ ను పసిగట్టేలా అవసరమైన అధునాతన ఫోరెన్సిక్ హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని సీఎం అన్నారు. ఈ సమీక్షలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియాల్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని..

(మొదటిపేజీ తరువాయి)

డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో ఇతరుల వద్ద అప్పులు చేశాడు. అలాగే, మద్యానికి బానిసైన రాజీవ్‌సింగ్ ఠాకూర్ అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. శనివారం తెల్లవారు జామున సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాయ్‌కాట్ అమెరికా

(మొదటిపేజీ తరువాయి)

పైన ధరల లేబుల్ ముద్రించింది. దీంతో వినియోగదారులు అమెరికా వస్తువుల వైపు చూడడం లేదు. గ్రీన్‌లాండ్‌లోని దుకాణదారులు టెస్లా, నెట్‌ఫ్లిక్స్, కోకా–కోలా వంటి అమెరికా ఉత్పత్తులు, సేవలను బహిష్కరించారు. సూపర్ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులు బాగా కనిపించేలా ఏర్పాటు చేశారు. స్థానిక వస్తువుల కొనుగోలులో సెల్‌ఫోన్ యాప్స్ వినియోగదారులకు సహకరిస్తున్నాయి. అమెరికా వస్తువులు, సేవలను ఎలా వదిలించుకోవాలో తెలియజేసేందుకు ఫేస్‌బుక్ గ్రూపులను ఏర్పాటు చేశారు. గత నెలలో ఏర్పాటు చేసిన ఈ గ్రూపులలో ఇప్పటికే వేలాదిగా సభ్యులు చేరారు. 'మేము అమెరికాను, దాని సంస్కృతిని ప్రేమిస్తాము. కానీ అధ్యక్షుడిని ఇష్టపడము' అని ఓ ఫేస్‌బుక్ గ్రూప్ సహ అడ్మినిస్ట్రేటర్ వ్యాఖ్యానించారు. డెన్మార్క్‌లో భాగమైన గ్రీన్‌లాండ్ పట్ల ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని స్థానికులు తీవ్రంగా నిరసిస్తున్నారు. అమెరికా ఉత్పత్తులకు ప్రత్యామ్నాయాలను ఈ గ్రూపులు వినియోగదారులకు సూచిస్తున్నాయి. స్థానికంగా తయారవుతున్న సాఫ్ట్ డ్రింకులు, పాదరక్షలకు విశేష ప్రాచుర్యాన్ని కల్పిస్తున్నాయి. అమెరికా కంపెనీలు, ఉత్పత్తులను బహిష్కరించిన కెనడాను అనేక మంది ఆదర్శంగా తీసుకొంటున్నారు. ఒకప్పుడు అమెరికాకు డెన్మార్క్ చాలా సన్నిహితంగా ఉండేది. అలాంటి దేశం ఇప్పుడు ట్రంప్ పేరెత్తితేనే మండిపడుతోంది. ట్రంప్ ప్రభుత్వంపై మరింత బలంగా పోరాడాలని అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గ్రీన్‌లాండ్ తమదేనంటూ ట్రంప్ పదే పదే చేస్తున్న ప్రకటనలపై ప్రజానీకం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ అనుసరిస్తున్న దుందుడుకు విదేశీ విధానాలపై మండిపడుతున్నారు. అమెజాన్ సబ్‌స్క్రిప్షన్లను, కాలిఫోర్నియా వైన్స్‌ను వారు బహిష్కరించారు. అమెరికా ఉత్పత్తులపైన కోకా-కోలా, ప్రింగిల్స్‌కు స్థానిక ప్రత్యామ్నాయాలను వెతుకుతున్నారు. కెనడాలో వ్యాపారులు వినూత్నంగా తమ షాపులలో అమెరికా వస్తువులను తలకిందులుగా ఉంచుతున్నారు. వినియోగదారులు అమెరికా వస్తువులను సులభంగా గుర్తు పట్టేందుకు వారు ఈ ఎత్తుగడ వేశారు. అయితే కొన్ని దేశాలలో దుకాణాలలో అమ్మకానికి ఉంచుతున్న బ్రాండ్లు ఏ దేశానికి చెందినవో అర్థం కాక వినియోగదారులు తికమక పడుతున్నారు. ఉదాహరణకు బ్రిటన్‌లో విక్రయించే కాడ్బరీ, వాటర్‌స్టోన్స్, బూట్స్ వాస్తవానికి అమెరికా బ్రాండ్లే. కాగా కొన్ని దేశాలలో వినియోగదారులు అమెరికా వస్తువులకు ప్రత్యామ్నాయాల కోసం వెతుకుతున్నారు. యూరప్‌లో కూడా అమెరికా వస్తువుల బహిష్కరణ ఊపందుకుంటోంది. ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ సహా పలు దేశాలలో పెద్ద ఎత్తున బహిష్కరణలు కొనసాగుతున్నాయి.

హిందూత్వ శక్తుల 'డిజిటల్' మాయ

(మొదటిపేజీ తరువాయి)

ఉంటున్నాయి. కోవిడ్–19 లాక్‌డౌన్ సమయంలో ఈ గ్రూపులు ముస్లింలను టార్గెట్‌గా చేసుకున్నాయని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ కమ్యూనికేషన్ వివరించింది. కరోనాకు వారే కారణమంటూ 'కరోనా జిహాద్' వంటి కుట్ర సిద్ధాంతాలకు తెరలేపాయని పేర్కొన్నది. ప్రస్తుత కాలంలో డీప్‌ఫేక్ వీడియోలు, ఎడిట్ చేసిన ప్రసంగాలను షేర్ చేస్తూ ప్రతిపక్ష నాయకులను హిందూత్వ శక్తులు టార్గెట్ చేస్తున్నాయి. వారిని హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తున్నాయి. ఇక గోరక్షణ పేరుతో కొన్ని గ్రూపులు మానవత్వాన్ని మరుస్తున్నాయి. ఇందుకోసం.. అవి సామాజిక మాధ్యమాల పైనే ఆధారపడుతున్నాయి. వాటిలో వచ్చే గాలి సందేశాల ఆధారంగా వ్యక్తులపై, ముఖ్యంగా ముస్లింలపై దాడులకు తెగబడుతున్నాయి.

కఠిన చర్యలు అవసరం

డిజిటల్ వేదికలపై ప్రజాస్వామ్యవాదులైన జర్నలిస్టులు, విమర్శకులు, విద్యావేత్తలు, మేధావుల గొంతులు అణచివేయబడుతున్నాయి. ఇందుకు బీజేపీ ప్రభుత్వాల సహకారమూ ఉంటున్నదని విశ్లేషకులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్ట్ చెకర్ మహ్మద్ జుబేర్‌ను అరెస్ట్ చేసిన విధానమే ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో హిందూత్వ శక్తుల విపరీత ధోరణులు తీవ్ర నష్టాన్ని తీసుకొస్తాయని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. ఈ డిజిటల్ యుగంలో సెక్యులరిజం, విభిన్నతల వైపు భారత రాజ్యాంగ నిబద్ధతను కాపాడుకోవటంలో కఠిన చర్యలు చాలా అవసరమని వారు నొక్కి చెప్తున్నారు.

సమగ్ర రక్షణ సహకారం

(మొదటిపేజీ తరువాయి)

అనుర కుమార దిసనాయకె విస్తృతాంశాలపై చర్చలు జరిపారు. వ్యూహాత్మక సంబంధాలను పెంపొందించడానికి ప్రధానమైన చర్యగా ఈ రక్షణ సహకార ఒప్పందాన్ని భావిస్తున్నారు. శ్రీలంకలో భారత శాంతి పరిరక్షక దళం కార్యకలాపాల తర్వాత దాదాపు నాలుగు దశాబ్దాల అనంతరం ఇరు దేశాల మధ్య రక్షణ సహకార ఒప్పందం కుదిరింది. "మా భద్రతా ప్రయోజనాలు దాదాపు ఒకటేనని మేం విశ్వసిస్తున్నాం. ఇరు దేశాల భద్రత పరస్పరం ముడిపడి వుంది, ఆధారపడి వుంది." అని ప్రధాని మోడీ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రయోజనాల గురించి అధ్యక్షుడు దిసనాయకె ఆలోచిస్తున్నందుకు కృతజ్ఞతలు. రక్షణ సహకారంతో సహా పలు ముఖ్యమైన ఒప్పందాలను స్వాగతిస్తున్నామని మోడీ పేర్కొన్నారు. భారత భద్రతా ప్రయోజనాలకు భంగకరమైన రీతిలో తమ భూభాగాన్ని ఉపయోగించేందుకు శ్రీలంక అనుమతించబోదని దిసనాయకె, మోడీకి హామీ ఇచ్చారు. కీలకమైన సమయాల్లో భారత్ అందించిన సాయానికి, కొనసాగిస్తున్న సంఘీభావానికి తామెంతగానో రుణపడి వున్నామని పేర్కొన్నారు. ట్రింకోమలిని ఇంధన కేంద్రంగా అభివృద్ధిపరచడానికి మరో కీలకమైన ఒప్పందంపై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి. దేశ ఇంధన భద్రతకు సాయపడే సంపూర్ సౌర విద్యుత్ ప్రాజెక్టును ఇరువురు నేతలు వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రారంభించారు. పొరుగుదేశాలకు ప్రాధాన్యతనివ్వాలనే భారత్ విధానంలో శ్రీలంకకు ఎప్పుడూ ప్రత్యేక స్థానముందని మోడీ వ్యాఖ్యానించారు.

ప్రధాని మోడీకి మిత్ర విభూషణ అవార్డు ప్రదానం

ద్వైపాక్షిక సంబంధాలకు ఊతమివ్వడంలో ప్రధాని మోడీ చేసిన సేవలకు గుర్తింపుగా శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకె, మోడీకి మిత్ర విభూషణ అవార్డును ప్రదానం చేశారు. శ్రీలంక అత్యున్నత పౌర పురస్కారమైన ఈ అవార్డును 2008 ఫిబ్రవరిలో అప్పటి అధ్యక్షుడు మహీందా రాజపక్సా ఏర్పాటు చేశారు. ఇది తనకే కాదని, 140కోట్ల మంది భారతీయులకు అందిన గౌరవమని మోడీ వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆయనకు సాదర స్వాగతం లభించింది.

కమిషన్ల ఏర్పాటుపై సీఎం సమీక్ష

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

పలు కమిషన్ల చైర్మెన్లు, సభ్యుల ఎంపికపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షలు నిర్వహించారు. ఆయనతో పాటు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మెన్, సభ్యుల ఎంపిక, తెలంగాణ లోకాయుక్త, ఉపలోకాయుక్త ఎంపిక, తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, కమిషనర్‌ల ఎంపికపై సమీక్ష నిర్వహించారు. వాటి విధివిధానాలు, దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా వీటి ఏర్పాట్లు పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు.

ఆయుధాలు వీడండి

(మొదటిపేజీ తరువాయి)

లేరని వ్యాఖ్యానించారు. వారు కూడా మనలో భాగమేనని అన్నారు. "నక్సల్స్ సోదరులందరికీ ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా, ఆయుధాలను విడనాడండి, ప్రధాన స్రవంతిలో కలవండి, మీరందరూ కూడా మాలోని వారే, మావోయిస్టు ఎక్కడైనా చనిపోతే మేం సంతోషపడలేం. కానీ ఈ ప్రాంతానికి అభివృద్ధి కావాలి. గత 50ఏళ్లలో ఆ అభివృద్ధి జరగలేదు. కానీ ఐదేళ్లలో బస్తర్ ప్రాంతానికి ప్రతీదీ అందచేయాలని ప్రధాని మోడీ భావిస్తున్నారు." అని అమిత్ షా చెప్పారు. దంతెవాడలోని గిరిజనుల పండుగ బస్తర్ పండూమ్ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. నక్సల్స్ లొంగిపోయేలా చేసిన గ్రామాలకు అభివృద్ధి నిధి కింద కోటి రూపాయిలు ఇస్తామన్నారు. మావోయిస్టు వ్యతిరేక చర్యల్లో యువత చనిపోతున్నారని కొంతమంది తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. బస్తర్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ఢిల్లీ పోలీస్ కమిషనర్ వాంగ్మూలం నమోదు

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్ (డీసీపీ) దేవేశ్ కుమార్ మహలను దాదాపు నాలుగు గంటల పాటు విచారించి ఆయన స్టేట్‌మెంట్‌ను కూడా నమోదు చేసింది. చాణక్యపురిలోని హర్యానా స్టేట్ గెస్ట్ హౌజ్‌లో వీరిని విచారించినట్టు సమాచారం. ఇప్పటికే పలువురు పోలీసులు, సిబ్బందిని దర్యాప్తు కమిటీ విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేసింది.జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టలు దొరికిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్ ఖన్నా ముగ్గురు జడ్జిలతో కమిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. కమిటీ ఇప్పటి వరకు పలువురిని విచారించింది. ఇందులో ఐదుగురు పోలీసుల వాంగ్మూలాలను నమోదు చేసింది. అలాగే, ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్, ముగ్గురు ఫైర్‌ఫైటర్లు, జడ్జికి సంబంధించిన ముగ్గురు భద్రతా సిబ్బంది స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేసింది. కమిటీ ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదం తర్వాత నోట్ల కట్టలు కనుగొన్న స్టోర్‌రూమ్‌ను డీసీపీ మహల సీల్ చేశారు. "గత ఆరు నెలలుగా జస్టిస్ వర్మ ఇంటికి ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వివరాలను ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు ఢిల్లీ పోలీసులు సమర్పించారు. అలాగే, ఇదే ఆరు నెలల కాలానికి చెందిన ఆయన కాల్ వివరాల రికార్డులను, ఇంటర్నెట్ ప్రోటోకాల్ డిటెయిల్ రికార్డ్ (ఐపీడీఆర్)ను కూడా అందించారు. సీజేఐ ఆదేశాల తర్వాత ప్రధాన న్యాయమూర్తి ఈ వివరాలను కోరుతూ పోలీసులకు లేఖ రాశారు" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గతనెల 14న రాత్రి 11.30 గంటల ప్రాంతంలో జస్టిస్ వర్మ ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ ఘటన గురించి ఆయన పీఏ ద్వారా పోలీసులకు తెలిసింది. ఆ తర్వాత అక్కడికి పోలీసులు వచ్చారు. అయితే, మంటలు ఆరిపోయిన తర్వాత.. అక్కడ ఉన్న ఐదుగురు పోలీసు సిబ్బందిని అక్కడి నుంచి వెళ్లి, తిరిగి ఉదయం రావాలని జస్టిస్ వర్మ పీఏ కోరినట్టు సమాచారం.

కాసాగ్రాండ్ ఆక్రమణలపై విచారణ జరపండి

కొంపల్లి మున్సిపాలిటీకి హైకోర్టు ఆదేశాలు

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

రియల్ ఎస్టేట్ సంస్థ మెస్సర్స్ కాసాగ్రాండ్ హైడర్‌వైజ్ ప్రయివేటు లిమిటెడ్ భూ ఆక్రమణలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని హైకోర్టు కొంపల్లి మున్సిపాలిటీ, హెచ్‌ఎండీఏ అధికారుల్ని ఆదేశించింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం కొంపల్లి గ్రామంలోని సర్వే నెం. 105లోని ప్రభుత్వ రహదారి భూమిని రియల్ ఎస్టేట్ సంస్థ మెస్సర్స్ కాసాగ్రాండ్ హైడర్‌వైజ్ ప్రయివేటు లిమిటెడ్ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తూ హైకోర్టులో దాఖలైన పిటీషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ బీ విజయసేన్‌రెడ్డి విచారణ జరిపారు. కాసాగ్రాండ్ హైదర్‌వైజ్ భూ యజమానులు మాజీ ఎంపీ జీ రంజిత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి అనే వ్యక్తులు ప్రజా రహదారిని ఆక్రమించి, గేటు, షీట్లు వేసి 40 అడుగుల వెడల్పు గల రహదారిపై సాధారణ ప్రజల రాకపోకలను నిలిపివేసారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. దానికి సంబంధించిన రోడ్డు గూగుల్ మ్యాప్స్, ఫోటోలను సమర్పించారు. దీనిపై రియల్ ఎస్టేట్ సంస్థ తరపు న్యాయవాది పుష్పవర్ధన్ వాదిస్తూ, తన క్లయింట్లు ఎటువంటి భూమిని లేదా రహదారిని ఆక్రమించలేదన్నారు. విలేజ్ మ్యాప్ ఇతర రికార్డులకు కట్టుబడి ఉన్నారని వాదించారు. దీనితో పిటిషనర్ వాదనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, స్థలాన్ని పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.





బహిరంగ సభకు ముస్తాబైన మదురై



సైకిల్‌పై తిరుపతి నుంచి మదురై మహాసభకు హాజరైన కామ్రేడ్లు

మహాసభ కోసం తిరుపతి నుంచి మదురైకి సైకిల్ యాత్ర





సీపీఐ(ఎం) మహాసభల్లో సినీనటుడు ప్రకాశ్‌రాజ్

8 రోజులు 550 కిలోమీటర్లు...

చల్లా వెంకటయ్య, కుప్పుస్వామికి ఘన స్వాగతం

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

వారిద్దరికీ సీపీఐ (ఎం) అంటే ఎనలేని ప్రేమ. మహాసభలంటే వీపరీతమైన ఇష్టం. ఆ ప్రేమ, ఇష్టమే... ఆ ఇద్దరిని తిరుపతి నుంచి మదురై దాకా సైకిల్ యాత్ర చేపట్టేలా చేశాయి. ఆ కామ్రేడ్లే చల్లా వెంకటయ్య, కె.కుప్పుస్వామి. వీరిలో వెంకటయ్య సీపీఐ (ఎం) చిత్తూరు జిల్లా మాజీ కార్యదర్శికాగా, కుప్పుస్వామి ప్రజాశక్తి మాజీ ఉద్యోగి. ఈ ఇద్దరూ మహాసభల కోసం మార్చి 29న తిరుపతిలో బయల్దేరారు. అక్కడి నుంచి సైకిల్ యాత్ర చేసుకుంటూ ఎనిమిదో రోజైన శనివారం మదురైకి చేరుకున్నారు. మొత్తం 550 కిలోమీటర్లు ప్రయాణించి, ఇక్కడి సీతారాం ఏచూరి నగర్ (మహాసభల ప్రాంగణం) నగర్‌కు చేరుకున్న వీరికి ప్రతినిధులు, స్థానిక పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తిరుపతిలో బయల్దేరిన దగ్గర్నుంచి మదురై దాకా ప్రతీచోటా తమకు భోజనం, బస, వసతి ఇతర సౌకర్యాలను ఆయా ప్రాంతాల్లోని సీపీఐ (ఎం) కమిటీలే చూసుకున్నాయని వెంకటయ్య, కుప్పుస్వామి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సైకిల్ యాత్ర తమ జీవితంలో మరపురాని మధురఘట్టంగా నిలిచిపోతుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

లాల్ సలామ్ కామ్రేడ్..


కేరళ సీఎం పినరయి విజయన్‌తో సినీ నటుడు ప్రకాశ్‌రాజ్

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీపీఐ (ఎం) 24వ మహాసభల్లో భాగంగా శనివారం మదురైలోని సీతారాం ఏచూరి నగర్‌లో నిర్వహించతలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్య వక్తగా పాల్గొనేందుకు ప్రకాశ్ రాజ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన కేరళ సీఎంతో సమావేశమయ్యారు. 'లాల్ సలామ్ కామ్రేడ్, హౌ ఆర్ యూ...' అంటూ ఆయన విజయన్‌ను ఆప్యాయంగా పలకరించారు. పినరయి కూడా ప్రకాశ్ రాజ్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇరువురూ కొద్దిసేపు సమకాలీన రాజకీయాల గురించి చర్చించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రకాశ్ రాజ్... వేదిక వద్దకు చేరుకోగానే భారీ వర్షం మొదలైంది. ఆగకుండా రెండు గంటలపాటు అది కొనసాగటంతో ప్రకాశ్ రాజ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకుని వెళ్లిపోయారు. కాగా... వర్షం కురవటానికి ముందు 'కర్నాటక స్టేట్ డొల్లు కునిత మహిళా బృందం' నిర్వహించిన జానపద నృత్యాలు సభికులను అలరించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి కళాకారుడు జగన్ ఆధ్వర్యంలో పాడిన 'భరతమాత ముద్దుబిడ్డ సుందరయ్య...' పాట విప్లవ స్ఫూర్తిని నింపింది.



చుక్క రాములు



బండారు రవికుమార్

చర్చల్లో తెలంగాణ ప్రతినిధులు



సాయిబాబు



కిరణ్‌చంద్ర



మహాసభలో తీర్మానాలను ఆమోదిస్తున్న తెలంగాణ ప్రతినిధులు



తెలంగాణ ప్రతినిధుల బృందం



ప్రతినిధుల కోసం తాటి ముంజలు



అశోక్‌ధావలేతో యువ వాలంటీర్లు



బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు



పదివేల మందితో నేడు ఎర్రదండు కవాతు..

అతిరథ మహారథులతో భారీ బహిరంగ సభ

ముగియనున్న సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాబోయే మూడేండ్ల కాలానికి దేశానికి దిశ, దశా, నిర్దేశం చేసేందుకు వీలుగా మదురైలో కొనసాగుతున్న సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ ఐదో రోజైన శనివారం ముగియనుంది. ఈ సందర్భంగా నగరంలో పది వేల మందితో ఎర్రదండు కవాతును నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు ఎన్.శంకరయ్య స్క్వేర్ (స్థానిక మస్తాన్‌పట్టి దగ్గరల్లోని వండియూర్ రింగ్‌రోడ్ టోల్‌గేట్ ప్రాంతం) వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. తొలుత పుదుగయి భూపాలమ్ కళా బృందం, కామ్రేడ్ గ్యాంగ్‌స్టా మ్యూజిక్ బృందం, కుమారి మురసు సాంస్కృతిక బృందం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ఆ తర్వాత సీపీఐ (ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం అధ్యక్షతన బహిరంగ సభ ఆరంభమవుతుంది. మదురై ఎంపీ వెంకటేశన్ స్వాగతోపన్యాసం చేస్తారు. సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్‌తోపాటు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, జి.రామకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు కె.బాలకృష్ణన్, యూ.వాసుకి, పి.సంపత్ ప్రసంగిస్తారు. మహాసభల ఆహ్వాన సంఘం కోశాధికారి మధుక్కర్ రామలింగమ్ ధన్యవాదాల ప్రసంగంతో బహిరంగ సభ ముగియనుంది. కాగా ఈ బహిరంగ సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.